www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 230 | శుక్రవారం | 9 ఫిబ్రవరి, 2018
...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

శరవేగ వృద్ధి

- తీవ్ర ఆర్థిక మాంద్యంలోనూ మూడేళ్లపాటు అత్యధిక జిడిపి వృద్ధిని సాధించాం
- మన ప్రగతిని ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంకు గుర్తించాయి : 2018 బడ్జెట్‌ను సమర్థించుకున్న జైట్లీ



న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా 2010 ఆర్థిక మాంద్యం ప్రతికూల ప్రభావం చూపెడుతున్న సమయంలో కూడా భారత్ మూడేళ్లపాటు అత్యధిక స్థూలజాతీయోత్పత్తి వృద్ధి సాధించిందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. 2018 కేంద్ర బడ్జెట్‌ను గురువారం లోక్‌సభలో ఆయన సమర్థించుకున్నారు. భారత ప్రగతిని అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకు రెండూ గుర్తించాయని, మిగతా దేశాలకన్నా వేగవంతంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ మనదని ఆయన చెప్పారు. 'మనకేమి సంక్రమించింది. ఇప్పుడు మనకేమి ఉన్నదన్నది అన్నవి వేర్వేరు కథనాలు. నాడు ఎవరూ భారత్ వేగంగా వృద్ధి చెందుతున్న దేశం అనలేదు. అది ఇప్పుడే జరుగుతోంది. డేటా కూడా ఇదే చెబుతోంది' అని ఆయన వివరించారు. వ్యాపార సౌలభ్యత ర్యాంకింగ్‌లో కూడా భారత్ దూసుకుపోతోందని చెప్పారు. ఈ వృద్ధి మరింత పెరిగి తరువాయి 6లో



ముంపు ముప్పు!

పోలవరంతో భద్రాచలం, దాని పరిసరాల్లోని 36 మేజర్ గ్రామాలు మునిగిపోయే ప్రమాదం?

పుణె సంస్థతో తాజాగా అధ్యయనం చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచన

మన తెలంగాణ/ హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టుతో భద్రాచలం సహా పరిసర్లాలోని 36 మేజర్ గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. గోదావరితో పాటు ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, కిన్నెరసాని తదితర ఉపనదులన్నీ భద్రాచలం సమీపంలోనే కలుస్తుండడంతో వరదముప్పు ఎక్కువగా ఉంటుందని, దీన్ని ఏ విధంగా ఎదుర్కోవాలనేదానిపై తెలంగాణ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గతంలో నిర్మించిన కరకట్టలు ఇకపైన ఉధృతంగా ప్రవహించే గోదావరి జలాల, దాని వెన్నంటే ప్రభావం చూపే తిరుగు జలాల (బ్యాక్ వాటర్) వేగానికి తట్టుకోవడం అనుమానమేనని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రభావంపై తాజాగా పుణెలోని సిడబ్ల్యుపిఆర్ఎస్ (సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్)తో అధ్యయనం చేయించాలని అనుకుంటోంది. 1986లో గోదావరి వరదల (182 అడుగుల మేర) కారణంగా భద్రాచలం పట్టణంలో మెజారిటీ భాగం నీట మునగ్గా నాలుగైదేళ్ల క్రితం కేంద్ర జలసంఘం బ్యాక్ వాటర్‌పై అధ్యయనం చేస్తే 191 అడుగుల వరకు ప్రభావం ఉంటుందని తేలింది. దుమ్ముగూడెంతో పాటు సమీపంలోని మణుగూరు, సింగరేణి గనులపై, భార జల కేంద్రంపై పరోక్ష ప్రభావం ఉండవచ్చని నిపుణుల అంచనా. అటవీ, పర్యావరణ సమస్యలతో పాటు గిరిజన నివాస ప్రాంతాలకు, వన్యప్రాణులకు సంబంధించిన అనేక అంశాలు ఉన్నా జాతీయ హోదా పేరుతో వీటిని పరిష్కరించకుండానే పోలవరం ప్రాజెక్టును నిర్మిస్తున్నారని అభిప్రాయపడ్డారు. తొలుత 36 లక్షల క్యూసెక్కుల గరిష్ఠ వరద ప్రవాహంతో ప్రాజెక్టు డిజైన్‌ను రూపొందించగా దాన్ని ఇప్పుడు 50 లక్షల క్యూసెక్కుల అంచనాకు అనుగుణంగా ఎపి ప్రభుత్వం డిజైన్లు రూపొందిస్తోంది. పోలవరం కొత్త డిజైన్‌తో తెలంగాణకు చాలా నష్టం జరుగుతుందని మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. ఎపిఇఆర్ఎల్ (ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ ల్యాబ్) అధ్యయనం ప్రకారం 36 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహానికే (191 అడుగుల మేర) భద్రాచలంలో ముంపు ఉండవచ్చన్న అంచనాతో 1986 అనుభవంతో భద్రాచలం పట్టణం చుట్టూ కరకట్ట ఎత్తును 190 ఫీట్ల ఎత్తు వరకు పెంచారు. ధవళేశ్వరం బ్యారేజీ బ్యాక్‌వాటర్ ప్రభావం, పోలవరం కట్టిన తర్వాత తెలంగాణలోని 36 మేజర్ గ్రామాల, మరో 40 చిన్న గ్రామాల తరువాయి 6లో

ఆ 15 కంపెనీలకు దరఖాస్తు వద్దు

- హెచ్-1 బి వీసాలపై అమెరికా సూచన



వాషింగ్టన్ : హెచ్–1బి వీసాల దరఖాస్తులకు సంబంధించి అమెరికా కార్మిక విభాగం పలు సూచనలు చేసింది. దరఖాస్తు చేసుకోవడానికి వీల్లేని 15 సంస్థల పేర్లను బుధవారం నాడు విడుదల చేసింది. ఈ జాబితా ఇండియాతోపాటు ప్రపంచంలోని చాలా దేశాలు జాగ్రత్తగా పరిశీలించాలని సూచించింది. కావాలని పలుమార్లు ఉల్లంఘనలకు పాల్పడిన కంపెనీలుగా వీటిని గుర్తించి, ఆయా కంపెనీల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవద్దని హెచ్చరించింది. ఈ కంపెనీలపై దర్యాప్తు తరువాయి 6లో

సిఇఒ పోస్టుకు ముగ్గురి పేర్లు

- కేంద్ర ఎన్నికల సంఘానికి పంపిన రాష్ట్ర ప్రభుత్వం 3
- జాబితాలో నవీన్ మిట్టల్, రజత్ కుమార్, శశాంక్ గోయల్

ఎన్ని ఉద్యోగాలు సృష్టించారు?

మోడీ సర్కార్‌ను నిలదీసిన మాజీమంత్రి చిదంబరం



న్యూఢిల్లీ: ఎన్‌డిఎ ప్రభుత్వం రానున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రవేశ పెట్టిన పూర్తి స్థాయి, చివరి బడ్జెట్‌పై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఆర్థికమంత్రి పి. చిదంబరం గురువారం విరుచుకు తరువాయి 6లో

ఖతర్‌లో పెంబట్ల యువకుడి ఆత్మహత్య


నాగరాజు (ఫైల్ ఫొటో)

- పనిచేసిన కంపెనీ జీతాలు ఇవ్వక, తిరిగి వచ్చే దారి కానరాక

మన తెలంగాణ / సారంగాపూర్ : కరీంనగర్ జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్లకు చెందిన తోట నాగరాజు (24) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాగరాజు ఉపాధి నిమిత్తం రెండు సంవత్సరాల క్రితం దోహ (ఖతర్) దేశానికి వెళ్లాడు. కొన్ని నెలలుగా కంపెనీ జీతం చెల్లించకపోవడంతో దిన దిన గండంగా కాలం వెల్లదీస్తున్నానని, స్వదేశానికి వచ్చేందుకు అయ్యే ఖర్చుకు కూడా డబ్బులు లేవని నాగరాజు తన కుటుంబ తరువాయి 6లో

హామీలు నెరవేర్చండి

- ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో తెలంగాణకు చేసిన వాగ్దానాలను అమలు చేయండి
- కాళేశ్వరం నిర్మాణానికి నిధులు కేటాయించండి
- కనీస మద్దతు ధర విభాగంలో అదనంగా 24 పంటలను చేర్చండి
- లోక్‌సభలో నిజామాబాద్ ఎంపి కవిత డిమాండ్



మన తెలంగాణ/ న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో తెలంగాణకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎంపి కవిత కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా మధ్య, చిన్నతరహా రైతులకు వ్యవసాయానికి సరైన సమయంలో సబ్సిడీ కేటాయించాలని కోరారు. కనీస మద్దతు ధర విభాగంలో మరో 24 పంటలను చేర్చాలన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయానికి ప్రాధాన్యనివ్వాలని ఆమె కోరారు. జిఎస్‌టి, నోట్లరద్దుకు తాము మద్దతునిచ్చామని అందువల్ల తెలంగాణకు సంబంధించిన ప్రాజెక్టుల మంజూరు, నిధుల విడుదల విషయంలో కేంద్రం మద్దతునివ్వాలని కవిత అభ్యర్థించారు. ఎపికి చెందిన టిడిపి, వైసిపి ఎంపిలు చేస్తున్న ఆందోళనకు కవిత మద్దతు పలికారు. అయితే, ప్రభుత్వంలో ఉండి నిరసనలు తెలుపడం సరైన పద్ధతి కాదని ఆమె పరోక్షంగా టిడిపి ఎంపిలనుద్దేశించి పేర్కొన్నారు. కేంద్రం వెంటనే స్పందించి ఎపి, తెలంగాణ రాష్ట్రాల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కేంద్రం ఎరువుల సబ్సిడీని నేరుగా రైతులకు ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. 1968 నుంచి పెస్టిసైడ్స్ బిల్లు పెండింగ్‌లో, ఎరువుల ఉత్పత్తులను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సబ్సిడీపై రైతులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఆమె ప్రశ్నించారు. ఎరువుల కంపెనీల విషయంలో గత యుపిఎ హయాంలో కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పులనే బిజెపి ఎందుకు చేస్తోందని నిలదీశారు. ఈసారి కేంద్ర బడ్జెట్‌ను చూసి దేశ వ్యాప్తంగా, తెలంగాణలో రైతులు నిరుత్సాహం చెందారని కవిత అన్నారు. బడ్జెట్‌లో రైతుల కోసం కృషి చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, కానీ జైట్లీ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో అలా జరగలేదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. 2022 లోపు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్నారు కానీ, బడ్జెట్ కేటాయింపులు ఆ దిశగా లేవని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. తెలంగాణలో ఎస్‌సి, ఎస్‌టి రైతులకు వంద శాతం సబ్సిడీ ఇస్తున్నామని హామీనిచ్చి దానిని నెరవేర్చలేదని మండిపడ్డారు. వ్యాపార రంగానికి ఇచ్చిన ప్రాధాన్యత.. వ్యవసాయ రంగానికి ఎందుకు ఇవ్వడం లేదని ఆమె ప్రశ్నించారు. సాగునీటి రంగానికి కేంద్రం పెద్దగా నిధులు కేటాయించలేదని కవిత అన్నారు.



మృత్యు ఒడిగా మారిన ఆరబోసిన పత్తి

- వరంగల్ ఎనుమాముల మార్కెట్ యార్డులో విషాదం
- డిసిఎం దూసుకెళ్లి రైతు మృతి

మన తెలంగాణ/ కాశిబుగ్గ : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఆరబోసుకున్న తమ పత్తిపై నిద్రపోతున్న రైతు మీది నుంచి డిసిఎం వ్యాన్ దూసుకుపోగా ఆ రైతు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి సంభవించింది. పాలకుర్తి నియోజకవర్గం దేవరుప్పుల మండలం, మాదాపురం గ్రామంలోని దేవుని గుట్ట తండకు చెందిన బానోతు రవి (40)తో పాటు ఆయన తండ్రి మంజా, తమ్ముళ్లు బుధవారం 120 పత్తి బస్తాలు తీసుకొని ఎనుమాముల మార్కెట్లోని పవన్ ట్రేడర్స్ అడ్తికి వచ్చారు. పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉందని ఖరీదుదారులు కొనుగోలు చేయడానికి నిరాకరించారు. దాంతో వేరుశనగ యార్డు సమీపంలో పత్తిని ఆరబోసుకున్నారు. అదే పత్తిపై రాత్రి వారు నిద్రపోయారు. ఆ సమయంలో ఏటూరునాగారం నుంచి తరువాయి 6లో

కుంచెపోటు



పటేల్‌కి ప్రధాని ఉద్యోగం రాలేదని మా సారు బాధ పడ్తుంటే... నీ ఉద్యోగం గురించి అడుగుతావేమయ్యా..!

డిసిఎం బోల్తా

ముగ్గురు దుర్మరణం



- 59 గొర్రెలు మృతి
- నల్లగొండజిల్లా చిట్యాల మండలం వెల్మినేడు హైవేపై ఘటన

మన తెలంగాణ/ చిట్యాల : అంగడిలో గొర్రెలు కొనుగోలు చేసి తెల్లవారేలోపు హైదరాబాద్ చేరుకుని మండిలో అమ్ముకుందామనుకున్న గొర్రెల వ్యాపారులు తెల్లవారకుండానే తనువులు చాలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెల్మినేడు శివారులో జాతీయ రహదారిపై గురువారం తెల్లవారు జామున డిసిఎం వాహనం బోల్తా పడిన ఘటనలో ముగ్గురు మృతి చెందటంతో పాటు 59 మూగజీవాలు మృతి తరువాయి 6లో

హైదరాబాద్‌లో డిఐపి కారిడార్ నెలకొల్పాలి

రక్షణమంత్రికి కెటిఆర్ విజ్ఞప్తి




మన తెలంగాణ/ న్యూఢిల్లీ: హైదరాబాదులో డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర రక్షణ శాఖమంత్రి నిర్మలా సీతారామన్‌ను రాష్ట్ర మంత్రి కెటి రామారావు కోరారు. ఢిల్లీ పర్యటనలో మంత్రి కెటిఆర్ బిజీ బిజీగా గడిపారు. 2018–19 ఏడాదికి గాను కేంద్ర బడ్జెట్‌లో 2 డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్‌లను ప్రకటించిన కేంద్రం, అందులో ఒకదానిని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని మంత్రి కోరారు. రక్షణ రంగానికి హైదబాద్‌కు అనుబంధం ఉందన్న మంత్రి కెటిఆర్, రక్షణ రంగ సంస్థలు, రక్షణ రంగ పరికరాల తయారీలో హైదరాబాద్ ముందు వరుసలో ఉందని మంత్రి వివరించారు. రక్షణ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న హైదరాబాద్‌లో ఒక డిఫెన్స్ ఇండస్ట్రియల్ తరువాయి 6లో

తెలంగాణకు 17.90 టిఎంసిలు కేటాయింపు

మన తెలంగాణ/హైదరాబాద్: ఫిబ్రవరి మాసం అవసరాలకు తెలంగాణకు 17.90 టిఎంసిల నీటిని కృష్ణా బోర్డు కేటాయించింది. ఇదే విధంగా ఆంధ్రప్రదేశ్ అవసరాలకు 17.09 టిఎంసిలు కేటాయించింది. ఈ మేరకు తెలంగాణకు కల్వకుర్తి ఎత్తిపోతలకు 2.5 టిఎంసిలు, ఎఎంఆర్‌పి, హైదరాబాద్ తాగునీటికి 4.4 టిఎంసిలు, సాగర్ ఎడమ కాలువకు 11 టిఎంసిలు కేటాయించారు. ఆంధ్రప్రదేశ్‌లో పోతిరెడ్డి పాడుకు 0.50 టిఎంసిలు, హంద్రీ నీవా, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 4 టిఎంసిలు, నాగార్జునసాగర్ కుడి కాలువకు 10.5 టిఎంసిలు, సాగర్ ఎడమ కాలువకు 2.09 టిఎంసిలు వినియోగించుకోవడానికి బోర్డు అనుమతించింది. ప్రస్తుత వాటర్ ఇయర్‌లో తెలంగాణ ఇప్పటి వరకు 75.60 టిఎంసిలు వినియోగించుకోగా, ఆంధ్రప్రదేశ్ 211.63 టిఎంసిలు వాడుకుంది. అయితే శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లో కనీస నీటిమట్టానికి ఎగువన 71.31 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. వీటిని మే నెలాఖరు వరకు జాగ్రత్తగా వినియోగించుకోవాల్సి ఉంది. ఈ మేరకు కృష్ణాబోర్డు సభ్య కార్యదర్శి పరమేశం గురువారం నాడు ఉత్తర్వులు జారీచేశారు.



సర్కారు స్కూళ్లకు ఉచిత విద్యుత్



- **ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్న శాసనసభ హామీల కమిటీ**

మనతెలంగాణ/హైదరాబాద్ : ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్, ఉచిత తాగునీరు సౌకర్యం కల్పించాలని శాసనసభ హామీల కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేయనుంది. ఇటీవల జరిగిన ఆ కమిటీ సమావేశంలో పాఠశాల విద్యాశాఖ ఈ మేరకు ప్రతిపాదించగా, అందుకు సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. సర్కారు బడులను కమర్షియల్ కేటగిరీ కింద పరిగణిస్తుండటంతో విద్యుత్ బిల్లులు పెరుగుతున్నాయి. సర్వశిక్షా అభియాన్(ఎస్ఎస్ఎ), రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్(ఆర్ఎంఎస్ఎ) కింద స్కూళ్లకు వివిధ అవసరాల నిమిత్తం మంజూరయ్యే నిధుల నుంచి ప్రధానోపాధ్యాయులు విద్యుత్, వాటర్ బిల్లులు చెల్లిస్తున్నారు. కొన్నిసార్లు పాఠశాల పరిధిలో నిధులు లేకపోతే ప్రధానోపాధ్యాయులు లేదా ఉపాధ్యాయులు బిల్లులు చెల్లించి తర్వాత జిల్లా విద్యాశాఖ అధికారికి దరఖాస్తు చేసుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో ఫ్యాన్లు, లైట్లు మాత్రమే వినియోగిస్తుండగా ఇప్పుడు కంప్యూటర్ ల్యాబ్‌లు, డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నందున విద్యుత్ వినియోగం క్రమంగా పెరుగుతోంది. పాఠశాలలకు ఇచ్చే నిధులు మాత్రం పెరగకపోవడంతో సకాలంలో ఆ బిల్లుల్ని చెల్లించలేక ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఉపాధ్యాయ సంఘాల డిమాండ్ మేరకు హైదరాబాద్ జిల్లాలో ప్రభుత్వ బడులకు ఉచిత విద్యుత్, ఉచిత తాగునీరు అందించాలని అప్పటి హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన నటరాజన్ గుల్జార్ ప్రతిపాదించారు. అప్పటి ప్రభుత్వం ఈ విషయంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

సమన్వాయం, పారదర్శక పాలన

- **అమలు కోసం ప్రభుత్వంపై వత్తిడి**



మన తెలంగాణ / హైదరాబాద్ : సమన్యాయం, పారదర్శక పాలన కోసం ప్రభుత్వంపై వత్తిడి తేనున్నట్లు అఖిల భాతర ముస్లిం సంఘం ప్రకటించింది. సంఘం అధ్యక్షులు ఖాలిద్ రసూల్ ఖాన్ గురువారం మీడియాతో మాట్లాడుతూ సుపరిపాలన కోసం ప్రభుత్వంపై వత్తిడి తెస్తుందన్నారు. మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టినా సక్రమంగా అమలు జరగడం లేదని, సమానత్వం లేకుండా పోయిందని, అవినీతి పెరిగి పోయిందని ఆరోపించారు. ముస్లింలను ఓటు బ్యాంకు రాజకీయాలకు ఉపయోగించుకుంటున్న తరుణం లో రాబోయే ఎన్నికల్లో రాజకీయాలకు అతీతంగా అర్హులైన అభ్యర్థులనే ఎన్నుకునేలా ముస్లిం సమాజంలో చైతన్యం తేనున్నట్లు వెల్లడించారు. మౌజం, ఇమామ్‌లకు ఇచ్చే గౌరవ వేతనాన్ని రెట్టింపు చేయాలని డిమాండ్ చేశారు. ముస్లిం సంఘం అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలని డిమాండ్ చేస్తోందన్నారు. విద్వేష పూరిత ప్రసంగాలను సూమోటోగా తీసుకొని వెంటనే చర్యలు తీసుకోవాలని సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా మండల స్థాయి నుండి తమ సంఘా కార్యకలాపాలను బలోపేతం చేస్తామని తెలంగాణ తో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ దృష్టిసారిస్తామన్నారు.

కోదండరామ్ నాయకత్వంలో
పని చేయడానికి సిద్ధం



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వాన్ని ఎదిరించాలంటే ఉద్యమ శక్తుల పునరేకీకరణ జరగాలని తెలంగాణ ఇంటిపార్టీ అధ్యక్షులు డాక్టర్ చెరుకు సుధాకర్ అన్నారు. తన చుట్టు ఉన్న ఇద్దరు,ముగ్గురు అనామకులతో జెఎసి పేర ఉద్యమిస్తున్న కోదండరామ్ ఇతర ఉద్యమ శక్తులను కలుపుకోకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని ఇంటిపార్టీ కార్యాలయంలో గురువారం ఆ పార్టీ ఉపాధ్యాక్షులు యొన్నంశ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కోదండరామ్ నాయకత్వంలో తాము పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని, ఆయన అంగీకరిస్తే అవసరమైతే తెలంగాణ ఇంటిపార్టీ అంశంలో తాము ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు. కెసిఆర్ వ్యతిరేక శక్తులను కలుపుకోకుండా కోదండరామ్ ఏం సాధించాలనుకుంటున్నారని ప్రశ్నించారు. కూర్చోని మాట్లాడుదామని కోదండరామ్‌ను పలుమార్లు కోరినా నియంతృత్వ వైఖరిని ప్రదర్శించడంలో మర్మమేమిటని, ఇకనైనా కోదండరామ్ అన్ని వర్గాలను కలుపుకుని చర్చించి నిర్ణయం తీసుకుంటే తెలంగాణ ప్రజలు ఆయన నాయకత్వాన్ని అంగీకరిస్తారని చెప్పారు. కాదంటే కోదండరామ్ నిర్ణ యంలో దురుద్ధేశం ఉంటుందనే సంకేతాలు ప్రజల్లోకి వెళ్తాయన్నారు. కోదండరామ్ ఏర్పాటు చేయబోయే రాజకీయ పార్టీ ఎవరి లబ్ధికోసమని ఆయన అనుమానం వ్యక్తచేశారు. సామాజిక తెలంగాణ లక్ష్యంగా ఎస్‌సి,ఎస్‌టి, బిసి,మైనార్టీ వర్గాలకు సముచిత భాగస్వామ్యం కల్పించినప్పుడే ఉద్యమ శక్తుల పునరేకీకరణ సాధ్యమన్నారు

ఇద్దరు ఐపిఎస్‌లకు
త్వరలో పదోన్నతి

మన తెలంగాణ/హైదరాబాద్:రాష్ట్రంలో పనిచేస్తున్న ఇద్దరు ఐపిఎస్‌లకు పదోన్నతులు రాబోతున్నాయి. సైబరాబాద్ పోలీసు కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న సం దీప్ శాండిల్యాకు అదనపు డిజిపిగా, రాచకొండ పోలీసు కమిషనరేట్‌లో జాయింట్ పోలీసు కమిషనర్‌గా పని చేస్తున్న తరుణ్‌జోషికి డిఐజిగా పదోన్నతులు కల్పించేందుకు డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటి (డిపిసి) త్వరలో ఖరారు చేయనుంది. సందీప్‌శాండిల్యాకు పదోన్నతి వస్తుండడంతో సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్థానం ఖాళీ అవుతుంది. ఇక్కడ ఏ అధికారిని నియమించాలనే అంశంపై ఉన్నతాధికారులు తర్జనబర్జన పడుతున్నారు. ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఇటీవల బాధ్యతలు నిర్వహించిన శివధర్‌రెడ్డిని సైబరాబాద్ కమిషనర్‌గా నియమించే అవకాశాలు ఉన్నాయి.

లియోని రిసార్ట్స్ ఎండి విడుదల

మన తెలంగాణ/హైదరాబాద్ : సిబిఐ కేసులో చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న లియోని రిసార్ట్స్ ఎండి చక్రవర్తి రాజు గురువారం విడుదలయ్యారు. రైతులకు సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్స్‌ను ఫోర్జరీ చేసి అక్రమంగా రూ.605 కోట్లు రుణాలు పొంది బ్యాంకులను మోసగించారని చక్రవర్తి రాజుపై సిబిఐ అభియోగాలు మోపిన విషయం తెలిసిందే. 15 రోజుల క్రితం చక్రవర్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో అతన్ని కోర్టు అనుమతితో మరో ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీకి తీసుకుని లోతుగా విచారించారు.నాంపల్లి సిబిఐ కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో విడుదలయ్యారు.

సిఇఒ పోస్టుకు ముగ్గురి పేర్లు

మన తెలంగాణ / హైదరాబాద్ : ఎన్నికల ప్రధానాధికారి పదవి కోసం ముగ్గురి పేర్లను సిఫారసు చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక జాబితాను పంపింది. ఇంతకాలం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఉమ్మడిగా వ్యవహరించిన ఎన్నికల ప్రధానాధికారి భన్వర్‌లాల్ రెండు నెలల క్రితం పదవీ విరమణ చేయడంతో ఆంధ్రప్రదేశ్‌కు విడిగా సిఇఒను కేటాయిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో తెలంగాణకు కూడా విడిగా సిఇఓ అధికారి అనివార్యమైంది. ముగ్గురు పేర్లతో కూడిన జాబితాను ఈ నెల 5న కేం ద్ర ఎన్నికల సంఘానికి పంపింది. సీనియర్ ఐఎఎస్ అధికారులు నవీన్ మిట్టల్, రజత్‌కుమార్, శశాంక్ గోయల్‌లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. కేంద్ర ఎన్నికల కమిషన్‌లోని ముగ్గురు కమిషనర్లు ఈ అంశంపై సమావేశమై ముగ్గురిలో ఒకరిని ఖరారు చేస్తారు. ఆ మేరకు ఉత్తర్వులు వెలువరిస్తే దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేస్తుంది. వారం రోజుల్లోనే కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టత ఇస్తుందని, వచ్చే వారంకల్లా ఉత్తర్వులు రాష్ట్రానికి చేరవచ్చని సచివాలయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. జూన్‌కల్లా పంచాయతీరాజ్ ఎన్నికలు నిర్వహించాల్సి రావడంతో ఓటర్ల తుది జాబితా రూపొందించడం తదితర పనులు ఉన్నందువల్ల వీలైనంత త్వరలో కేంద్ర ఎన్నికల సంఘం సిఇఓ నియామక ప్రక్రియను పూర్తిచేయవచ్చు.

'ఆమె'కు అడుగడుగునా వేధింపులే!

ప్రతి ముగ్గురిలో ఒకరు బాధితురాలు



- మహిళలపై రోజురోజుకు పెరుగుతున్న గృహహింస
- జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే వెల్లడి

న్యూఢిల్లీ: మహిళలపై గృహహింస రోజురోజుకు పెరిగిపోతుందని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్‌హెచ్ఎఫ్ఎస్4) ఆందోళనకరమైన విషయాన్ని వెల్లడించింది. సంబంధిత నివేదికను కేంద్ర కుటుంబ, ఆరోగ్య శాఖ విడుదల చేసింది. 15ఏళ్ల బాలికలు ప్రతి ముగ్గురిలో ఒక్కరు గృహహింస బారిన పడుతున్నారని నివేదిక తెలిపింది. వీరిలో 27శాతం మంది శారీరక హింసకు గురవుతున్నారు. ఇది పట్టణ ప్రాంతాలతో పోల్చితే గ్రామాల్లో అధికంగా ఉందని తెలిసింది. గ్రామీణ ప్రాంతాల్లో గృహహింస 29శాతం ఉంటే, పట్టణ ప్రాంతాలలో 23శాతం ఉన్నట్లు వివరించింది. హింసిస్తున్న వారిలో అధికంగా వారి భర్తలే ఉంటున్నారు. 31శాతం మంది వివాహిత మహిళలు లైంగికంగా, భౌతికంగా, భావోద్వేగాల పరంగా హింసను ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా 15ఏళ్లలోపు పెళ్లైన యువతులు సుమారు 83శాతం మంది వారి జీవిత భాగస్వాముల నుంచి భౌతికంగా హింసకు గురవుతున్నట్లు తెలిసింది. వివాహం కాని యువతులు కూడా ఈ హింసకు బాధితుల్లో ఉన్నారు. అయితే వీరిని హింసిస్తున్న వారిలో తల్లి, సవతి తల్లి, కన్న తండ్రి, సవతి తండ్రి, సోదరులు, టీచర్లు ఉంటున్నారు. ఇలా గృహహింసకు గురవుతున్న వారికి ఎలాంటి సహాయసహకారాలు లేకపోవడమే ఈ హింసకు ప్రధానం కారణం. కొన్ని ప్రాంతాల్లో మహిళలే ఆశ్చర్యకరంగా గృహహింసకు మద్దతునిస్తుండటం విచారించినదగిన విషయం.

భారతీయ మహిళల్లో 6శాతం మంది జీవితాంతం లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారు. ఇక పెళ్లికాని యువతుల విషయంలోనూ లైంగిక వేధింపులు క్రమంగా పెరుగుతూనే ఉన్నాయి. బంధువులు, ప్రియుడు, స్నేహితుల రూపంలోనూ లైంగిక వేధింపులు ఎదుర్కొంటూనే ఉన్నారు. జీవిత భాగస్వామి అంగీకారం లేకుండా ఆమెతో సెక్స్‌లో పాల్గొనడం దేశంలో నేరం కాకపోవడం గమనార్హం. కానీ, ఐపిసి సెక్షన్ 375 ప్రకారం వైవాహిక జీవితంలో బలవంతపు లైంగిక చర్య అనేది భార్య వయస్సు 15ఏళ్ల కంటే తక్కువ ఉంటేనే నేరంగా పరిగణిస్తారు. మహిళల గృహహింస రక్షణ చట్టం 2005లో వైవాహిక జీవితంలో జీవిత భాగస్వామి బలవంతపు అత్యాచారానికి పాల్పడినప్పటికీ ఎలాంటి శిక్ష లేదు. 2006లో సవరణలు వచ్చినా దాన్ని సివిల్ కేసుగా పరిగణిస్తారు.

12మంది ఐపిఎస్‌లకు జెఎజె హోదా

మన తెలంగాణ/హైదరాబాద్: 2005–06 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన 12 మంది ఐపిఎస్ అధికారులకు 'జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్' (సీనియర్ ఎస్‌పి) హోదా కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శైలేంద్ర కుమార్ జోషి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన ఐపిఎస్ అధికారులు వి.శివకుమార్, వి.బి.కమలాసన్‌రెడ్డి, ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎ.ఆర్.శ్రీనివాస్, పి.విశ్వప్రసాద్, ఎం.రమేష్, కె.రమేశ్‌నాయుడు. ఎ.వి.రంగనాథ్, బి.సుమతి, వి.సత్యనారాయణ, ఎ.వెంకటేశ్వరరావులు ఉన్నారు. వీరందరిని త్వరలో తదుపరి శిక్షణకై పంపించాలని డిజిపి మహేందర్‌రెడ్డిని కోరారు.

దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక కార్యదర్శులతో నేడు ఆర్థిక సంఘం భేటీ

మన తెలంగాణ/హైదరాబాద్: దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక శాఖ కార్యదర్శులతో పదిహేనవ ఆర్థిక సంఘం హైదరాబాద్‌లో సమావేశం ఏర్పాటు చేయనుంది. నగరంలోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగే ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తోంది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక, మహారాష్ట్రలకు చెందిన ఆర్థిక శాఖ కార్యదర్శులు, ఆ శాఖ అధికారులు హాజరవుతున్నారు. చత్తీస్‌ఘడ్‌ను ఆహ్వానించినప్పటికీ అక్కడ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నందువల్ల హాజరు కాలేమంటూ సమాచారం పంపారు. పదిహేనవ ఆర్థిక సంఘానికి చెందిన ఐదుగురు సభ్యులు హాజరవుతున్నట్లు ఇప్పటికే రాష్ట్రానికి సమాచారం అందింది. అయితే చైర్మన్ ఎన్‌కె సింగ్ హాజరవుతారా లేదా అనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఏప్రిల్ నెలలో అన్ని రాష్ట్రాలతో విడివిడిగా సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్న ఆర్థిక సంఘం ప్రస్తుతం అన్ని రాష్ట్రాలతో ప్రాథమిక స్థాయిలో చర్చలు జరిపి ప్రతిపాదనలను ఏ విధంగా రూపొందించాలి, ఇందుకు అనుసరించాల్సిన ప్రామాణిక అంశాలు, రాష్ట్రాల అవసరాలు తదితరాలపై అన్ని రాష్ట్రాల కార్యదర్శులకు అవగాహన కల్పిస్తారు. ఈ సమావేశానికి నిర్దిష్టంగా ఎజెండా ఇంకా రూపొందనప్పటికీ ఆయా రాష్ట్రాల్లో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రాజెక్టులు, రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులు, ఆదాయ వనరులు తదితర అంశాలపై ఆర్థిక సంఘం బృందం ప్రాథమిక వివరాలను సేకరించే అవకాశం ఉంది. ఈ సమావేశం అనంతరం శనివారం కాళేశ్వరం ప్రాజెక్టును ఐదుగురు సభ్యుల ఆర్థిక సంఘం బృందం సందర్శించనున్నట్లు సమాచారం. ఈ మేరకు రాష్ట్ర సాగు నీటి పారుదల శాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

వైరు తగిలి యువకుడు దుర్మరణం

- ఢిల్లీలో పోలీసుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

న్యూఢిల్లీ: పోలీసుల నిర్లక్ష్యం కారణంగా యువకుడు బలైన ఘటన రాజధాని ఢిల్లీలో చోటుచేసుకుంది. పశ్చిమ ఢిల్లీలోని ఓ రోడ్డుపై పోలీసులు రెండు బారికేడ్ల మధ్య కట్టిన వైరు కారణంగా ఈ దారుణం జరిగింది. ప్రైవేటు ట్యాక్సీ సర్వీస్‌లో పనిచేసే 21ఏళ్ల యువకుడు బుధవారం రాత్రి ద్విచక్రవాహనంపై రోడ్డుపై వెళ్తుండగా వీధి దీపాలు కూడా లేకపోవడంతో బారికేడ్ల మధ్య కట్టిన వైరు కనిపించక అలాగే ముందు కెళ్లాడు. దీంతో వైరు మెడకు కోసుకుపోయి తీవ్రంగా గాయపడి మరణించాడు. ఈ ఘటనకు సంబంధించి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు నలుగురు పోలీస్ కానిస్టేబుళ్లను అధికారులు సస్పెండ్ చేశారు. నిర్లక్ష్యంతో వ్యక్తి మరణానికి కారణమయ్యారని ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేసినట్లు పోలీస్ డిప్యూటీ కమిషనర్ వెల్లడించారు. యువకుడి మెడపై తీవ్రంగా కోసుకు పోయిందని, ఘటనాస్థలంలోనే అతడు మరణించాడని పోలీసులు ధ్రువీకరించారు

2లక్షల మందికి గేదెల పంపిణీ

మన తెలంగాణ/హైదరాబాద్: గొర్రెల పంపిణీతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఒక మేరకు పరిపుష్టి కలిగించామని భావిస్తున్న ప్రభుత్వం త్వరలో గేదెల పంపిణీపై దృష్టి సారించనుంది. నాలుగు సహకార సంఘాల పరిధిలో ఉన్న సుమారు 2.15 లక్షల మంది రైతులకు వీలైనంత త్వరలో వీటిని సబ్సిడీపై పంపిణీ చేయాలని భావిస్తోంది. కరీంనగర్, మదర్ డైరీ, ముల్కనూరు, విజయ డెయిరీ పరిధిలో ఉన్న పలు సహకార సంఘాల్లో సభ్యులుగా ఉన్న రైతులకు వీటిని పంపిణీ చేయాలని భావిస్తున్న ప్రభుత్వం బడ్జెట్‌లో తగిన ప్రతిపాదనలు చేసి స్పష్టమైన ప్రకటన చేయాలనుకుంటోంది. పంజాబ్ నుంచి ముర్రాజాతి గేదెలను ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారులకు 75% సబ్సిడీతో, వెనకబడిన తరగతుల రైతులకు 50% సబ్సిడీతో ఇవ్వాలనుకుంటోంది. ఒక్కో గేదెకు సుమారు రూ. 65 వేల నుంచి రూ. 90 వేల వరకు ఖర్చవుతుందని, ఇందుకోసం బడ్జెట్‌లో సుమారు రూ. 900 కోట్లను కేటాయించాలని భావిస్తోంది. సహకార సంఘాల్లో సభ్యులుగా ఉన్న రైతులకు తలా ఒకటి చొప్పున మొత్తం 2.15 లక్షల మంది రైతులకు సబ్సిడీపై పంపిణీ చేయాలన్నది ప్రభుత్వ భావన. ఈ మేరకు వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల అధికారులతో ప్రధాన కార్యదర్శి చర్చించినట్లు సమాచారం.

కెటిఆర్‌కు బడ్జెట్‌పై అవగాహన లేదు

మన తెలంగాణ/హైదరాబాద్: మంత్రి కెటిఆర్ చదువుకున్న ఒక నిరక్షరాస్యుడని, కేంద్ర బడ్జెట్ కేటాయింపులపై ఏ మాత్రం అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. గులాబిదళానికి, వారి కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకు కేంద్ర బడ్జెట్ అనుకూలంగా లేదనే అక్కసుతోనే మంత్రి కెటిఆర్ కేంద్రంపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మాజీ ఎంఎల్‌ఎలు బద్దం బాల్‌రెడ్డి, చందా లింగయ్యదొరతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను కేటాయించకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన రూ. 10,962 కోట్లు నిలిచిపోయాయన్నారు. బిజెపిపై ఆరోపణలు చేయడం కంటే ముందుగా 'మీ ఇంటి' పరిస్థితులను చూసుకోవాలని, మంత్రులు, ఎంఎల్‌ఎలు, నాయకులు అసంతృప్తితో రగిలిపోతున్నారని ఆయన అన్నారు. కెసిఆర్ తర్వాత ఆపార్టీ ఒక నీటి బుడగనే అని వ్యాఖ్యానించారు. టిఆర్‌ఎస్ పుట్టకమునుపే ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలో బిజెపికి 23 శాతం ఓట్లు వచ్చాయని గుర్తుచేశారు. జిహెచ్ఎంసిలో గుంతలు చూపిస్తే డబ్బులిస్తానని ప్రకటించిన మంత్రి కెటిఆర్, ఇప్పుడు నగరంలో ఉన్న గుంతలను చూపిస్తే రాష్ట్ర బడ్జెట్ కూడా సరిపోదని ఆయన ఎద్దేవా చేశారు. కార్పొరేషన్ల అభివృద్ధికి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎంత మొత్తంలో నిధులను కేటాయించిందో ఒక శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై ప్రభుత్వం నిధుల వినియోగం పత్రాలను అందజేయడం లేదని, అందుకే కేంద్ర నిధులు నిలిచిపోతున్నాయని పేర్కొన్నారు.



గతేడాది కంటే 50శాతం అదనం



- బడ్జెట్ ప్రతిపాదనలపై అధికారులకు మంత్రి లక్ష్మారెడ్డి ఆదేశం

మన తెలంగాణ/హైదరాబాద్: భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని బడ్జెట్ ప్రతిపాదనలను రూపొందించాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డా. సి.లక్ష్మారెడ్డి అధికారులకు సూచించారు. ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలతో పాటు వచ్చే ఏడాది ఆయా పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు వీలుగా బడ్జెట్ ఉండాలన్నారు. గతంలో 6వేల కోట్లను కేటాయించిన ప్రభుత్వం ఈ సారి 50 శాతం మేరకు నిధులు పెంపుదల ఉండేలా ప్రతిపాదనలు ఉండాలన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో గురువారం మంత్రి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి వైద్య, ఆరోగ్యశాఖ మీద ప్రత్యేక దృష్టి సారించారని, నిధులను పెంచేందుకు కూడా సిద్ధం ఉన్నారని తెలిపారు. కంటి, మధుమేహం, బీపీ, క్యాన్సర్, స్క్రీనింగ్ వంటి రోగ నిర్ధారక పరీక్షలు, ఆధునిక పరికరాలు, మరిన్ని మందులతో పాటు కొత్త భవనాలను దృష్టిలో ఉంచుకొని ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వ వైద్యశాలలపై ప్రజలకు నమ్మకం పెరిగిందని, రోగుల తాకిడి పెరిగిందన్నారు. రాష్ట్రంలో మరిన్ని మాతా, శిశు ఆసుపత్రుల నిర్మాణంతో పాటు కేసీఆర్ కిట్ల పంపిణీని విజయవంతంగా అమలు చేసేందుకు వీలుగా బడ్జెట్ రూపకల్పన ఉండాలన్నారు. సమావేశంలో వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి, డిఎంఈ రమేష్‌రెడ్డి, డిహెచ్ లలిత కుమారి, హెల్త్ యూనివర్శిటీ విసి కరుణాకర్ రెడ్డి, ఐపిఎం డైరెక్టర్ డా. శంకర్, నిమ్స్ డైరెక్టర్, ఆరోగ్యశ్రీ సిఇఒ డా. మనోహర్, ఈజెహెచ్ఎస్ డైరెక్టర్ డాక్టర్ పద్మ, ఆయుష్ కమిషనర్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి, ఎంఎన్‌జె డైరెక్టర్ డా.జయలలిత, ఎంఎస్ఐడిసి చీఫ్ ఇంజినీర్ లక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

- స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రపంచాన్ని పీడిస్తున్న సమస్యల్లో పర్యావరణ కాలుష్యం ముఖ్యమైన సమస్య అని, హరిత విప్లవం, అప్రమత్తత ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాలని శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి అన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే మనిషి భూమిని వదిలి వెళ్లాల్సి వస్తుందని శాస్త్రవేత్తలు హెచ్చరించే పరిస్థితి రావడం బాధాకరమని పేర్కొన్నారు. గురువారం స్పీకర్ అధ్యక్షతన అసెంబ్లీలో వన్యప్రాణి పర్యావరణ పరిరక్షణ కమిటీ సమావేశమైంది. ఈ సమావేశంలో ఎంఎల్‌సి నారదాసు లక్ష్మణరావు, ఫరూదుద్దీన్, ఎంఎల్‌ఎలు జలగం వెంకట్రావు, కిషన్‌రెడ్డి, దివాకర్ రావు, బాపూరావు రాథోడ్, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి రజత్ కుమార్, పిసిసిఎఫ్ పికె ఝా, సిఎం ఒఎస్‌డి ప్రియాంక వర్గీస్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ పెట్టుబడిదారులదా?

- రౌండ్ టేబుల్ సదస్సులో వక్తలు



మన తెలంగాణ/హైదరాబాద్: హైదరాబాద్ నగరం పెట్టుబడిదారులదా లేదా అన్ని వర్గాల ప్రజలదా? అని టి జెఎసి చైర్మన్ ఎం.కోదండరామ్ ప్రశ్నించారు. సచివాలయం తరలింపు వెనకాల వాణిజ్య సముదాయాల నిర్మాణ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. జర్నలిస్టులు, న్యాయవాదులు, పేదలు ఇండ్లు అడిగితే వారికి స్థలాన్ని కేటాయించని ప్రభుత్వం, కమీషన్ల కో సం ఆ స్థలాలను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తు ందని విమర్శించారు. టి జెఎసి హైదరాబాద్ క మిటీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'సచివాలయాన్ని బైసన్‌పోలో గ్రౌండ్‌కు తరలిం చడాన్ని నిరసిస్తూ' రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోదండరామ్ మా ట్లాడుతూ సచివాలయ తరలింపు ముగిసిన అ ధ్యాయం కాదన్నారు. హుస్సేన్‌సాగర్ పరిసర ప్రాంతాల్లో బహుళ అంతస్తుల నిర్మాణానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, గతంలో ఇదే అంశాన్ని సిఎం ప్రకటించారని గుర్తుచేశారు. సచివాలయ తరలింపును అడ్డుకునేందుకు అన్ని పార్టీల ప్రతినిధులు ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి వినతి పత్రం అందజేయాలన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత విహెచ్ మాట్లాడుతూ తన కొడుకును సిఎం చేయడానికే చినజీయర్‌స్వామి చెప్పినట్టుగా పాత సచివాలయ తరలింపు ప్రక్రియ జరుగుతున్నదని వ్యాఖ్యానించారు. సిపిఐ(ఎంఎల్‌న్యూడెమోక్రసి) రాష్ట్ర నాయకులు కె.గోవర్ధన్ మాట్లాడుతూ తెలంగాణ వనరులను కాపాడు కోవాల్సిన అవసరం ఉందని, బస్తీల ను కూడా తరలించే ప్రయత్నాలు జరుగుతాయని, దీనిని అడ్డుకోవాలన్నారు. సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు పి.గెల్వయ్య మాట్లాడుతూ మూడున్నరేళ్లుగా హైదరాబాద్‌లోని బస్తీలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. బిజెపి నాయకులు రామకృష్ణా మాట్లాడుతూ బైసన్‌పోలోలో సచివాలయ నిర్మాణానికి అనుమతి రాకుండా కేంద్రంపై ఒత్తిడి పెంచుతామన్నారు. తెలంగాణ ప్రజా సమితి నాయకులు గాదె ఇన్నయ్య మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కెసిఆర్ గెలిస్తే బస్తీలు కనుమరుగు అవుతాయన్నారు. ఈ సమావేశంలో జెఎసి హైదరాబాద్ చైర్మన్ సత్యం గౌడ్, సిపిఐ(ఎంఎల్‌న్యూడెమోక్రసి) రాష్ట్ర నాయకులు ఝాన్సీ, టిడిపి నాయకులున్నారు.

స్పీకర్‌ను కలిసిన టిటిడిపి నేతలు

మన తెలంగాణ /హైదరాబాద్: అసెంబ్లీలో సిఎం కెసిఆర్ హామీ మేరకు రైతుల రుణ మాఫీకి సంబంధించి వడ్డీ బకాయిల చెల్లింపు జరిగి, పాస్ పుస్తకాలు తిరిగిచ్చేలా ఆదేశాలు ఇప్పించాలని శాసనసభ స్పీకర్ మధుసూదనాచారికి టిడిపి ఎంఎల్‌ఎలు విజ్ఞప్తి చేశారు. టిడిపి ఎంఎల్‌ఎ సండ్ర వెంకటవీరయ్య నేతృత్వంలోని టిడిపి ప్రతినిధి బృందం గురువారం స్పీకర్‌ను అసెంబ్లీ ప్రాంగణంలోని ఆయన ఛాంబర్‌లో కలిసి విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు. ఇప్పటి వరకు రుణ మాఫీ జరగక ఇబ్బందులు పడుతున్న రైతుల వివరాలతో కూడిన పత్రాలను వారు స్పీకర్‌కు సమర్పించారు. సభలో సిఎం ఇచ్చిన హామీని నెరవేర్చే బాధ్యత స్పీకర్‌పై ఉందన్నారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రమణ స్పీకర్‌ను కలిసిన ప్రతినిధి బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా సండ్ర వెంకటవీరయ్య మీడియాతో మాట్లాడుతూ రుణమాఫీ కాకపోవడంతో రైతుల పాస్ పుస్తకాలు బ్యాంకుల్లో మగ్గుతున్నాయన్నారు. ఒక్క ఖమ్మం జిల్లాలో 20వేల మందికి రూ.105 కోట్ల రుణమాఫీ కాలేదని జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి లేఖ రాశారని తెలిపారు. రుణ మాఫీపై అసెంబ్లీ సమావేశంలో స్పీకర్‌కి ఫిర్యాదు చేస్తే వివరాలను ప్రభుత్వానికి పంపుతామన్నారని, రెండునర్న నెలలు గడిచినా ఇప్పుడు వినతి పత్రం ఇస్తే మళ్ళీ ప్రభుత్వానికి పంపుతామన్నారు. రుణమాఫీ చేసినా పాస్ పుస్తకాలు ఇవ్వని బ్యాంక్ అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఎల్.రమణ మాట్లాడుతూ అసెంబ్లీలో సిఎం కెసిఆర్ చెప్పిన మాటలకు క్షేత్రస్థాయిలో ఆచరణ చర్యలు భిన్నంగా ఉన్నాయన్నారు. రావుల చంద్ర శేఖర్ రెడ్డి మాట్లాడుతూ రైతులందరికి రుణాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

కెటిఆర్‌పై కాంగ్రెస్ ఫైర్



మన తెలంగాణ/ హైదరాబాద్ : కాంగ్రెస్ లోఫర్ పార్టీ అని వ్యాఖ్యానించిన మంత్రి కెటిఆర్‌పై కాంగ్రెస్ నేతలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కెటిఆర్ నెంబర్ వన్ లోఫర్ అని, టిఆర్ఎస్ లత్కోర్ పార్టీ అని దుయ్యబట్టారు. సిఎం కెసిఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన విషయాన్ని కెటిఆర్ మరిచిపోవద్దన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, టిపిసిసి చీఫ్ ఉత్తమ్‌పై చేసిన వ్యాఖ్యలను నేతలు రాష్ట్రవ్యాప్తంగా ఖండించారు. జగిత్యాలలో సిఎల్‌పి నేత జీవన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ, నాయకులపై అనుచితంగా మాట్లాడిన మంత్రి కెటిఆరే నెంబర్ వన్ లోఫర్ అన్నారు. కాంగ్రెస్ ఓడిపోతే తన కుటుంబమంతా రాజకీయాల నుంచి తప్పుకుంటామని, కెటిఆర్ కుటుంబం తప్పుకుంటుందా? అని ఉత్తమ్ విసిరిన సవాలుకు కెటిఆర్ స్పందించలేదన్నారు. సిఎల్‌పి ఉప నేత కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి అసెంబ్లీ మీడియా హాల్‌లో మాట్లాడుతూ కెటిఆర్ డబ్బు,పదవి తో మదమెక్కి మాట్లాడుతున్నారన్నారు. గూగుల్‌లో కెటిఆర్ అని టైప్ చేస్తే దోపిడీ దొంగ అని వస్తుందన్నారు. గాంధీభవన్‌లో మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ పెంపకం ఎలా ఉందో కెటిఆర్ మాటలను బట్టి అర్థమవుతుందన్నారు. మాజీ ఎంపి అంజన్ కుమార్ మాట్లాడుతూ తన తండ్రి కెసిఆర్ కూడా ఈ పార్టీలోనే ఓనమాలు నేర్చుకున్న విషయం మరిచిపోవద్దని కెటిఆర్‌కు సూచించారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ కుటుంబం చీటింగ్ చేయడంలో నంబర్ వన్ అని, టిఆర్ఎస్ అంటే లత్కోర్ పార్టీ అని విమర్శించారు. టిపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి డా. దాసోజు శ్రవణ్ కెటిఆర్ అంటే కారుకూతల తారక రామారావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌నూ లోఫర్ అన్న కెటిఆరే వైట్ కాలర్ దొంగ అని ఆరోపించారు. టిపిసిసి కోశాధికారి గుడూరు నారాయణ రెడ్డి మాట్లాడుతూ కెటిఆర్ అనడం ఆయన దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట అని, కెటిఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు.

ఓడిపోతే తప్పకుంటా..



కాంగ్రెస్ అధికారంలోకి రాకపోతే పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డినే కాదు, నేను కూడా రాజకీయాల నుంచి తప్పుకుంటా. కెటిఆర్ నా ఆఫీసుకు వచ్చారు. టిఆర్ఎస్‌లో చేరితే మంత్రి పదవి ఇస్తానన్నారన్నది నిజం. కావాలంటే దానికి సంబంధించిన సిసి ఫుటేజీ కూడా నా వద్ద ఉంది. నేనెప్పుడు టిఆర్ఎస్‌లోకి వస్తా అని అడగలేదు.

– కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సిఎల్‌పి ఉపనేత

నీది రాహుల్ స్థాయి కాదు



పెద్దవాళ్లను విమర్శించినంత మాత్రాన కెటిఆర్ పెద్దవాడివి అయిపోవు. ప్రధాన మంత్రి అయ్యే అవకాశాన్ని వద్దనుకున్న రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి నీకు లేదు. తెలంగాణ బిల్లుపై ప్రధాని మోడీ వ్యాఖ్యలపై ఇప్పటివరకు ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు, మంత్రి కెటిఆర్ ఎందుకు స్పందించలేదు.

– భట్టి విక్రమార్క, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్

కెసిఆర్ పెద్ద లోఫర్.. కెటిఆర్ చిన్న లోఫర్



కెటిఆర్ చిన్న లోఫర్, ఆయన తండ్రి కెసిఆర్ పెద్ద లోఫర్. తెలంగాణ ఉద్యమం జరిగే సమయంలో అమెరికాలో ఉన్న కెటిఆర్ కాంగ్రెస్‌ను తిట్టడం పెద్ద జోక్. దమ్ముంటే కెటిఆర్, ఆయన కుటుంబం గతం, ప్రస్తుతంపై బహిరంగ చర్చకు రావాలి. వంద సీట్లు వస్తాయంటున్న కెటిఆర్ అన్ని సీట్లు రాకపోతే రాజకీయ సన్యాసం చేస్తారా?

– షబ్బీర్ అలీ, శాసన మండలి ప్రతిపక్ష నేత



"జీవితం అనేయుద్ధంలో గెలవడానికి ధైర్యాన్ని మించిన ఆయుధం లేదు. – భగత్‌సింగ్"

ప్రశంసలు తప్ప పైసలేవి?

సంపాదకీయం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన హామీలకు, ప్రత్యేక హోదాకు బదులు అంగీకరించిన ప్రత్యేక ప్యాకేజీకి కేంద్రబడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవటానికి నిరసనగా ఆ రాష్ట్ర పాలక పార్టీ టిడిపి, ప్రతిపక్షపార్టీలు పార్లమెంటులోపల, వెలుపల ఆందోళన చేస్తుండగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా 'బిజెపి తలబిరుసు ధోరణి' పట్ల ఎట్టకేలకు విమర్శనాస్త్రాలు సంధించింది. వామపక్షాల పిలుపుపై గురువారం ఆంధ్రప్రదేశ్ బంద్ విజయవంతంగా జరిగింది. వైసిపి,కాంగ్రెస్ బలపరిచాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశంపై టిడిపి శ్రేణులు కూడా వేరుగా నిరసన ప్రదర్శనలు జరిపాయి. కేంద్రప్రభుత్వంలో భాగస్వామి అయిన టిడిపి తరపున మంత్రి సుజనాచౌదరి, సానుకూల స్పందనకొరకు కేంద్రప్రభుత్వానికి 15రోజులు సమయమిస్తున్నామని చెప్పటం బిజెపితోవారి తెరవెనుక చర్చలకు నిదర్శనం. ప్రతిపక్షాల ఆందోళన ఏ రూపం తీసుకుంటుందీ, టిడిపి–బిజెపి రాజీపడతాయా, ఘర్షణ తెగతెంపులకుదారితీస్తుందా అనేవి వచ్చే ఎన్నికలకు ఆయా పార్టీల రాజకీయ వ్యూహం, ఎత్తుగడలపై ఆధారపడి ఉంటాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆందోళనను టిఆర్‌ఎస్ లోక్‌సభ వేదిక మీద గతంలోలాగే ఇప్పుడూ బలపరిచింది. లోక్‌సభలో టిఆర్‌ఎస్ పక్ష నాయకుడు జితేందర్‌రెడ్డి బుధవారం ప్రసంగిస్తూ తమ పొరుగురాష్ట్రానికి ఇచ్చిన హామీలను కేంద్రప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. అదేసమయంలో, రాష్ట్ర విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవటాన్ని గుర్తు చేశారు. కేంద్రబడ్జెట్‌లో తెలంగాణకు తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు.

తెలంగాణకు మొండిచెయ్యి చూపిన కేంద్రబడ్జెట్ పట్ల ప్రభుత్వ తీవ్ర అసంతృప్తిని ఐటి, మున్సిపల్, పరిశ్రమల శాఖామంత్రి కె.టి.రామారావు అరమరికలు లేకుండా వ్యక్తం చేశారు. రాష్ట్రానికి 14వ ఫైనాన్స్ కమిషన్ ప్రకారం చట్టబద్ధంగా లభించే నిధులు మినహా బడ్జెట్‌లో ఇతర కేటాయింపులు రూ.1000 కోట్లు కూడా లేవని వెల్లడించారు. ఇది బాహుబలి సినిమా వసూళ్లకన్నా తక్కువని తన విమర్శకు వ్యంగ్యం జోడించారు. బుధవారం నాడు ఆయన తన కార్యాలయంలో మీడియాతో పిచ్చాపాటి మాట్లాడుతూ, ప్రభుత్వ భాగస్వామ్య పక్షాలను సైతం సంతృప్తిపరచలేకపోయిన కేంద్రబడ్జెట్ వైఫల్యాన్ని ఎత్తిచూపారు. తెలంగాణ ప్రభుత్వం వివిధ పథకాల అమలుకు కేంద్రంనుండి రూ.40వేలకోట్ల సహాయం కోరుతూ ప్రతిపాదనలు సమర్పించింది. మిషన్ భగీరథకు రూ.19వేలకోట్లు, మిషన్ కాకతీయకు రూ.5వేలకోట్లు, కాళేశ్వరంకు రూ.10 వేల కోట్లు కోరింది. టెక్స్‌టైల్ పార్క్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంట్(ఐఐఎం) తదితర ప్రతిపాదనలున్నాయి. అయితే ఈ విజ్ఞప్తిని కేంద్రప్రభుత్వం పట్టించుకోలేదు. కాళేశ్వరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని చేస్తున్న డిమాండ్ చెవిటివాని ముందు శంఖమూదిన చందమే అయింది. ముస్లింలు,ఎస్‌టిలకు రిజర్వేషన్ పెంపుదల, మాదిగలకురిజర్వేషన్ ఉపవర్గీకరణ, ఐటి ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ ఏర్పాటు తదితర కోర్కెలు అరణ్యరోదనగానే ఉన్నాయి. హైదరాబాద్ సందర్శించిన కేంద్రమంత్రులు తెలంగాణ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రశంసలు కురిపిస్తుంటారు. కాని ఏ ఒక్క పథకానికీ గత నాలుగేళ్లలో పైసా సహాయం అందలేదు. పైసలు లేని ప్రశంసలతో ఒరిగేదేముంది? ''బిజెపి ప్రభుత్వం తెలంగాణ ప్రజలపట్ల తన ప్రేమను రుజువు చేసుకుంది. తెలంగాణ ప్రజలు సమయమొచ్చినప్పుడు(ఎన్నికలు) బదులు తీర్చుకుంటారు'' అని కెటిఆర్ హెచ్చరిక చేశారు. ప్రధానమంత్రి హైదరాబాద్ వచ్చినపుడు, ఎస్‌సి వర్గీకరణపై అఖిలపక్ష బృందం కలుసుకునేందుకు సమయమివ్వలేదని ఆయన గుర్తు చేశారు.

కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనాలకోసం తొందరపాటుతనంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించిందని, అందువల్లనే ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోడీ బుధవారం లోక్‌సభలో వ్యాఖ్యానించటం కాంగ్రెస్‌పై దాడికి ఉద్దేశించినా, సుదీర్ఘ పోరాటం ద్వారా స్వరాష్ట్రం సాధించుకున్న తెలంగాణ ప్రజల స్వాభిమానాన్ని గాయపరిచేదిగా ఉంది. ఉత్తరాఖండ్, జార్ఖండ్, చత్తీస్‌ఘడ్‌లలాగా అందర్నీ ఒప్పించి తెలంగాణ రాష్ట్రం ఇవ్వటమంటే మరెంత జాప్యం జరిగేదో! బిజెపి కాంగ్రెస్‌తో పోటీపడిందేగాని అటువంటి జాప్యాన్ని కోరుకోలేదు.


కతియార్ వ్యాఖ్యల అద్దంలో...

చూపు

ఆయన బిజెపి లోక్‌సభ సభ్యుడు. కాబట్టి ఆయన మాటలను బిజెపి మాటలుగా మనం భావించవచ్చు. ఇటీవల వరుసగా ఆయన చేసిన వ్యాఖ్యలు బిజెపి నిజరూపాన్ని మనందరి ముందు ఆవిష్కరిస్తున్నాయి.''ముస్లిములు భారత దేశంలో ఉండరాదు. వాళ్ళు దేశాన్ని జనాభా ప్రాతిపదికన విభజించారు. కాబట్టి వాళ్ళు ఇక్కడ ఎందుకుండాలి? వారికి భూమి ఇచ్చేయడం జరిగింది. వాళ్ళు పాకిస్తాన్ వెళ్ళి పోవాలి. లేదా బంగ్లాదేశ్ వెళ్ళిపోవాలి.''– ఇదీ వినయ్ కతియార్ తాజా ఉవాచ.

భారతదేశ విభజనకు కారకులెవ్వరు, ముహమ్మద్ అలీ జిన్నానా నెహ్రూ నా, పటేల్ కారకుడా వంటి ప్రశ్నలకు సమాధానాలు అంత తేలిక కాదు. దేశ విభజనకు బీజాలు విభజనకు పూర్వం 80 సంవత్సరాల క్రితమే నాటడం జరిగింది. బి.ఆర్ అంబేద్కర్ మాటల్లో చెప్పాలంటే, 1857 మొదటి స్వతంత్ర సంగ్రామం నిజానికి బ్రిటీషు ప్రభుత్వంపై ముస్లిములు ప్రకటించిన జిహాద్. బ్రిటీషువారిపై జిహాద్ పిలుపు నిచ్చిన అనేక ఫత్వాలు ఆ కాలంలో వచ్చాయి. 1857 తిరుగుబాటు విఫలమైన తర్వాత సహజంగానే బ్రిటీషు పాలకులు ముస్లిములను లక్ష్యంగా చేసుకున్నారు. విభజించు పాలించు సూత్రాన్ని ఆచరణలో పెట్టారు. సర్దార్ పటేల్ ఈ విషయాన్ని చాలా గొప్పగా చెప్పారు. ''హిందూ ముస్లిమ్ కలహాల గురించి బ్రిటీషు వాళ్ళు మాట్లాడుతుంటారు. ఈ కలహాలకు సంబంధించిన సమస్యను తమ భుజాల మీద వాళ్ళెందుకు వేసుకుంటున్నారు. బ్రిటన్‌ను ఒక వారం పాలించే అవకాశం నాకిచ్చి చూడండి. ఇంగ్లాండ్, వేల్స్, స్కాట్లాండ్ మధ్య శాశ్వత వైరంతో పోరాటాలు ప్రారంభమయ్యేలా చేసి చూపిస్తాను.'' అన్నారు. అంటే బ్రిటీషు వారు ఎలా ఇక్కడ చిచ్చు పెడుతున్నది ఆయన స్పష్టంగా చెప్పేశారు. భారత విభజన గురించి స్పష్టంగా అర్థం చేసుకోవాలంటే అంబేద్కర్ రాసిన ''థాట్స్ ఆన్ పాకిస్తాన్'' చదివితే చాలా విషయాలు తెలుస్తాయి. ఏమైనా గాని సగటు భారత ముస్లిములు, ఇక్కడి మూలవాసులు, వారికి దేశవిభజనతో ఎలాంటి సంబంధమూ లేదు. అయినా వినయ్ కతియార్ లాంటి నాయకులు భారత ముస్లింలను పాకిస్తానీ అంటూ మాట్లాడడం ఇది మొదటి సారి కాదు. గొడ్డుమాంసం తినకుండా ఉండలేకపోతే పాకిస్తాన్ వెళ్ళాలంటూ ఇంతకు ముందు ముక్తార్ అబ్బాస్ నక్వీ ఒక టి.వి కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యను కూడా ఇక్కడ దృష్టిలో ఉంచుకుంటే, గొడ్డు మాంసం తినేవారు కేవలం ముస్లింలే కాదు ఇంకా ఇతరులు, స్వయంగా హిందువులుగా పిలువబడే వారిలో కొన్ని కులాల వారు కూడా ఉన్నారని గ్రహిస్తే ముక్తార్ అబ్బాస్ నక్వీ లాంటి నోటిదురుసు నాయకుడు ఎవరెవర్ని పాకిస్తాన్ పంపాలనుకుంటున్నట్లు? అనే ప్రశ్న తలెత్తుతుంది. బిజెపి కేబినెట్‌లో మంత్రి కిరణ్ రిజిజు అప్పుడే ముక్తార్ అబ్బాస్ నక్వీ గారికి జవాబిస్తూ, నేను గొడ్డు మాంసం తింటాను, నన్నెవరు పాకిస్తాన్ పంపుతారని ప్రశ్నించాడు. ఆ తర్వాత తన మాటలను మీడియా వక్రీకరించిందంటూ రిజిజు బిజెపికి ఇబ్బంది కలుగకుండా చేశాడన్నది వేరే విషయం. కాబట్టి బిజెపి నాయకులకు నోరిప్పితే ఏం మాట్లాడుతున్నారో అర్థం కాకుండా పాకిస్తాన్ పంపేస్తామనడం పరిపాటి. వినయ్ కతియార్ ఇప్పుడు ముస్లిములు అస్సలు ఇండియాలో ఉండడానికి వీల్లేదంటూ పాకిస్తాన్ పోవాలన్నాడు. ముక్తార్ అబ్బాస్ నక్వీ ఇప్పుడేం చేస్తాడు? పాకిస్తాన్ పోతాడా? షా నవాజ్ హుస్సేన్ ఇప్పుడేం చేస్తాడు? పాకిస్తాన్ పోతాడా?

మొన్న కాస్‌గంజ్ అల్లర్ల సందర్భంగా వినయ్ కతియార్ ఈ మాటలే చెప్పాడు. కాస్ గంజ్ లో తిరంగా ర్యాలీ తీస్తున్న సోకాల్డ్ దేశభక్తులను ముస్లిములు అడ్డుకున్నారని, ముస్లిములు అక్కడ పాకిస్తాన్ జిందాబాద్ నినాదాలిచ్చారని, పాకిస్తాన్ జెండా ఎగరేయాలని చెప్పారంటూ



వ్యాఖ్యలు చేశాడు. కాని కాస్ గంజ్ లో అలాంటివేమీ జరగలేదు. నిజానికి అక్కడ రిపబ్లిక్ డే వేడుకలు జరుపుకుంటూ, పతాకావిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేసుకున్న ముస్లిముల కార్యక్రమాన్ని తిరంగా ర్యాలీ 'దేశభక్తు'లే అడ్డుకుని, కాషాయ జెండా ఎగరేయాలంటూ బలవంతం చేసిన వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. అక్కడ పాకిస్తాన్ జిందాబాద్ అన్న నినాదాలు ఏవీ వినిపించలేదని పోలీసులు కూడా స్పష్టం చేశారు. మరి వినయ్ కతియార్ ఈ మాటలు ఎలా చెప్పాడు. అదే విషయాన్ని ఒక ఇంగ్లీషు చానల్ రిపోర్టర్ ఎన్ని సార్లు అడిగినా ఈ అబద్దాల కోరు నాయకుడు ముఖం చాటేసి వెళ్లిపోయాడు. ఇంతకు ముందు జవహర్ లాల్ విశ్వవిద్యాలయం సంఘటనలోనూ దొంగ విడియోలు ప్రచారంలో పెట్టి పాకిస్తాన్ జిందాబాద్ నినాదాలకు సంబంధించి గగ్గోలు లేవదీశారు. దీన్ని బట్టి అర్థమవుతున్నదేమంటే, పాకిస్తాన్ జిందాబాద్ నినాదాలు ఈ దేశంలో ముస్లింలు చేస్తుంటారని, పాకిస్తాన్ జెండా ఎగరేస్తుంటారన్న బిజెపి నాయకులు కావాలని అబద్ధపు ప్రచారంతో ముస్లిముల పట్ల విద్వేషంతో అధికారం కాపాడుకునే ప్రయత్నాలుకొనసాగిస్తున్నారు.

ఆగ్రాలో తాజ్ మహోత్సవ్ జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. యోగి ప్రభుత్వానికి, బిజెపికి తాజ్ మహల్ పై ఎంత నిరసన, ఆగ్రహాలు ఉన్నప్పటికీ తాజ్ మహోత్సవం జరపడం తప్పనిసరి అవసరంగా మారింది. ఈ సందర్భంగా వినయ్ కతియార్ మాట్లాడుతూ తాజ్ మహోత్సవ్ అన్నా తేజ్ మహోత్సవ్ అన్నా ఒక్కటే. మా తేజ్ మహల్ ను ఔరంగజేబు తాజ్ మహల్ గా ఒక సమాధిగా మార్చాడని చెప్పాడు. ఆ తాజ్ మహల్ ను త్వరలో తేజ్ మహల్‌గా మార్చేస్తామన్నాడు. ''మా'' తాజ్ మహల్ అంటే అర్థమేమిటి? అంటే బిజెపి స్వంతమా. తాజ్ మహల్ భారత ప్రజలందరిదీ. అందులో హిందువులు, ముస్లింలు అందరూ ఉన్నారు. కాని వినయ్ కతియార్ విషయంలో మా తాజ్ మహల్ అంటే అర్థం హిందువుల తాజ్ మహల్ అని. మేము అంటే హిందువులం, వాళ్ళు అంటే ముస్లింలు ఈ విభజన మాటలు ఈ విద్వేషపు మాటలే బిజెపి నేతల నోటి నుంచి వస్తుంటాయి. మనం భారతీయులం అనే మాట వారి నోట వినబడదు. మరో విచిత్రమేమంటే తాజ్ మహల్ కట్టించింది ఔరంగజేబు కాదు, షాజహాన్. చరిత్ర గురించి ఒనమలు తెలియని ఈ నాయకులు దేశ చరిత్రను మార్చేస్తామంటున్నారు. వినయ్ కతియార్ తాజ్ మహల్ కూడా ఒక శివాలయమే అంటున్నాడు. తాజ్ మహల్ విషయమై విద్వేషపు వ్యాఖ్యలు చేసి తర్వాత తాజ్ సందర్శించి చీపురు పట్టిన యోగీ ఆదిత్యనాథ్ వ్యవహారం మనందరికీ తెలిసిందే. ఒక్క తాజ్‌మహల్ విషయంలోనేనా, ఢిల్లీలో జామా మసీదు అసలు జమునాదేవీ మందిరమట, మొగల్ పాలకులు రాక ముందు, మొగల్ పాలకులు వచ్చి హిందువులకు సంబంధించిన 6000 హిందూ మందిరాలు పడగొట్టారట. జామా మస్జిదు కట్టింది కూడా షాజహాన్. ఆయనే తాజ్ మహల్ కట్టించాడు. ఎర్రకోట కట్టించింది కూడా షాజహానే. భారత ముస్లిములను పాకిస్తానీ అని నిందించే వారిని శిక్షించే చట్టం కావాలని మజ్లిస్ నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. దానికి జవాబిస్తూ అసలు ముస్లిములు దేశంలో ఉండరాదని పాకిస్తాన్ పోవాలని వినయ్ కతియార్ అన్నాడు. విద్వేషపూరిత వ్యాఖ్యలతో ప్రజల్లో చిచ్చుపెట్టే వినయ్ కతియార్ ఇంతకు ముందు ప్రియాంకా వాద్రాను ఉద్దేశించి ఆమె కన్నా అందమైన వాళ్ళు బిజెపి ప్రచారంలో ఉన్నారని చేసిన వ్యాఖ్య కూడా ఆయన వ్యక్తిత్వం ఎంత చవుకబారుదో అర్థం చేసుకోడానికి ఉపయోగపడుతుంది.ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్న నాయకులపై ఎలాంటి చర్యలు కనిపించడం లేదు. అంటే బిజెపి అసలు స్వరూపాన్నే ఈ నాయకులు ప్రదర్శిస్తున్నారని అర్థం చేసుకోవాలి.

✻ వాహెద్

అంధకారంలో యువత

మనది ప్రపంచంలోనే అత్యధికంగా యువకులు ఉన్న దేశంగా చెప్పుకుంటున్నాము. ఈ నిజాన్ని ఎవరూ కాదనలేరు, ఇది గొప్ప అవకాశం, దేశాభివృద్ధికి సహకరిస్తుంది. ఈ మధ్య కాలంలో మన రెండు తెలుగు రాష్ట్రాలలోనూ, మొత్తంగా భారతదేశంలో యువతలో పెరుగుతున్న అసంతృప్తి, అసహనం, ఆక్రోశం, విభిన్న రూపాలలో బహిర్గతమవుతూ, హింసామార్గాలకు, దాడులకు, అంతిమంగా ఆత్మహత్యలకు కూడా దారితీస్తున్నది.

అనేక అసమాన సమాజ వ్యవస్థలు ఉన్న మన దేశ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో జీవిస్తున్న యువత ప్రధానంగా చదువుకొని, ఉద్యోగం సంపాదించాలని కలలు కంటారు. తల్లిదండ్రులు కూడా ఆశతో పిల్లలను చదివించడం పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. ఫలితంగా అన్ని సామాజిక వర్గాల ప్రజలు తమ పిల్లలను పాఠశాలకు (ప్రభుత్వ, ప్రైవేట్) పంపి చదివిస్తున్నారు.

ఎన్నో ఆశలతో, ఆశయాలతో పాఠశాలకు, కళాశాలకు వెళుతున్న విద్యార్థులలో విద్యపట్ల అసంతృప్తి పెరుగుతున్న కొద్దీ, అసహనం పెరుగుతున్నది. పర్యవసానంగా వందల సంఖ్యలో పిల్లలు, ముఖ్యంగా కళాశాలస్థాయి విద్యార్థులు హాస్టళ్లలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. స్పష్టంగా వారి బలిదానాలకు కారణాలు స్పష్టంగా తెలియచేస్తూ ఉత్తరాలు కూడా రాస్తున్నారు.

కళాశాలల్లో చేరుతున్న విద్యార్థులు ప్రధానంగా ఎక్కువశాతం వారి అభిప్రాయాలకు భిన్నంగా, తమపెద్దలను సంతృప్తి చేయడానికి చదువుతున్నాం అనే భావనలోనే తమ చదువును కొనసాగిస్తున్నారు. అసలు ఎల్‌కెజి నుండే ఏం చదవాలి? ఎక్కడ చదవాలి? ఎలాంటి చదువులు చదవాలనే అన్ని అంశాలను తల్లిదండ్రులు, లేదా చుట్టూ ఉండే పరిసరాలే నిర్ణయిస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, ప్రతి ఒక్కరు కూడా తమ పిల్లలు ఇంజినీర్లు, డాక్టర్లు, సాఫ్ట్ వేర్ ఉద్యోగులు కావాలి అనుకుంటున్నారు తప్ప ఒక మంచి మానవుడు కావాలని కోరుకోవడం లేదు.

విపరీతమైన ఒత్తిడి!

పుస్తకాలు, కంప్యూటర్లు సిలబస్‌లను పూర్తిచేయడం తప్ప, ఒక్క నిముషం కూడా మరో ఆలోచన చేయలేని చక్రబంధం లాంటి వాతావరణంలో విద్యార్థులు తమ జీవితాలను గడుపుతున్నారు. అనేక సామాజిక వర్గాల కుటుంబాల నుండి వచ్చే విద్యార్థులు సహజంగానే అన్ని అంశాలలో తమ ప్రతిభను చూపడం కష్టం.

ప్రతి విద్యార్థి ప్రతిభావంతులే. కానీ ఎటువంటి సామర్థ్యాలున్నాయో, మనం పరీక్షించకుండా, మార్కుల ప్రాతిపదికన జరిగే పోటీ విధానానికి గురి చేయడం వల్ల విద్యార్థులు ఒత్తిడికి గురి అవుతున్నారు. తాము తమ తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చలేకపోతున్నామనే భావనకు సహజంగానే గురి అవుతున్నారు. అంతిమంగా ఏ దారీ కానరాక, చెప్పుకోవడానికి ఎవరూలేక, చెప్పుకొనే ఆత్మధైర్యంలేక ఒంటరిగానే బ్రతికి,చివరికి ఒంటరి నిర్ణయాలతో కొంతమంది కొన్నిసార్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు చూస్తున్నాం. ఎవరిని ప్రశ్నించాలి? ఎలాంటి ధైర్యాన్ని ఇవ్వలేని ఈ అసంబద్ధ విద్యావిధానాలను, వారిని బలవంతంగా రుద్దుతున్న ప్రభుత్వాలనా? విద్యను వ్యాపారీకరణ చేస్తూ, లక్షలాది యువతజీవితాలతో ఆడుకుంటున్న రాజకీయ వ్యవస్థలనా? ఏది ఏమైనా జాతి సంపదను రక్షించుకోలేక పోతున్న ప్రభుత్వాలది ప్రధాన బాధ్యత కాదా?

నగరీకరణలో భాగంగా విస్తరించిన సంస్కృతి ఆకర్షణలో అనేక రకాల అంశాలు యువతను ప్రక్కదారి పట్టిస్తున్నాయి. అంతవరకు గల మన గ్రామీణ సంస్కృతి, ఆచార వ్యవహారాలు, అలవాట్లు, సాంప్రదాయాలకు దూరమై, ఈ నూతన సంస్కృతిని చూసి తొందరగా తాము కూడా అభివృద్ధి చెందాలని, అందరితో పాటు ఏదో ఒకటి చేసి పైకి రావాలనే పోటీ తత్వంలో విలువలకు దూరమై ఎంతటి నేరమైనా చేసి, తాను నిలబాలనే తపనతో ఎంతటి అన్యాయాలకైనా వెనకాడని స్థితికి గురి అవుతున్నారు. ఫలితంగా నేరాలు, అమ్మాయిలపై దాడులు, ఇతరులను పరిగణనలోకి తీసుకోకపోవటం, లాంటి వికృత నేరాలతో సైబర్ నేరాలకు పాల్పడుతూ, ఈ విషవలయంలో తాము చిక్కుకొని ఇతరులను ఇబ్బంది పెడుతూ సతమతమవుతున్నారు.

సామాజిక శాస్త్రాలు, సాంఘిక అంశాలు బోధించకపోవడం వలన తన చుట్టూ వస్తున్న ప్రమాదాలను గుర్తించి పరిష్కరించుకోవడంలో విఫలమవుతున్న దుస్థితిలో యువత బేలతనాన్ని ప్రదర్శిస్తున్నది. అందుబాటులోకి వచ్చిన విజ్ఞానం, చేతిలో ప్రపంచాన్ని చూపిస్తున్న సెల్‌ఫోన్లు, వెబ్‌సైట్‌లు, ఫేస్‌బుక్‌లు, ఛానళ్లు, సాహిత్యం విచ్చల విడిగా యువతను ఆకర్షిస్తున్నది. అయితే అంది వచ్చిన విజ్ఞానం, అవకాశాలను వినియోగించుకోవడంలో స్పష్టత లేకపోవడంతో వాటిని దుర్వినియోగపరచడానికే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఉన్న సమాచార వ్యవస్థలపై ఎలాంటి నియంత్రణ లేక విరివిగా వాటిని దుర్వినియోగపరిచే అవకాశాలే ఎక్కువ కావడంతో, ఆకాశంలో విహరిస్తూ, తమకు తాము మిగతా వారితో పోల్చుకుని పెడదారిలో, ఎంతటి విధ్వంసాన్ని అయినా సృష్టించి తన కోరికలను నెరవేర్చుకునేలా చేస్తున్నది. సమిష్టి తత్వాన్ని మరిచి, కేవలం వ్యక్తిగా తాను బాగుపడితే చాలనే దృష్టి కోణంలో జీవిస్తూ, అవి సాధ్యం కాకపోయినపుడు ఇతరులను ద్వేషిస్తూ, ఇతరులపై దాడులు చేస్తూ, వివిధ రకాల నేర ప్రవృత్తి గురి అవు తున్నారు. ప్రధానంగా రోజువారి జీవితలో వారికి విచక్షణను తెలియజేసే వ్యవస్థలు పూర్తిగా ధ్వంసం కావడం, విచ్చలవిడితనాన్ని పెంచుతున్నది.

> దేశ వెన్నెముకగా నిలిచే అసంఖ్యాకంగా ఉన్న మన యువత గాడి తప్పకుండా, దేశ అభివృద్ధికి తోడ్పడే విధంగా అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత మన అందరిపై ఉన్నది. ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాగరూకతతో వ్యవహరించకపోతే భావిభారతం తీవ్ర పరిణామాలను ఎదుర్కోక తప్పదు. వెంటనే మన విధానాలను సంస్కరించుకుని, నూతన శాస్త్రీయ విధానాలతో మన యువతను దేశాభివృద్ధిలో భాగస్వాములుగా చేసుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది.

60 శాతంపైగా ఉన్న భారత దేశ యువతకు మార్గదర్శనం చేసే విధానాలు లేకపోవడం, ఉన్న పాలసీలను సరిగ్గా అమలు చేయలేకపోవడం ప్రధాన కారణం. గ్రామాలలో కొన్ని యువజన సంఘాలు ఉన్నప్పటికీ, వాటికి దశ, దిశా నిర్దేశం చేసేవారు లేరు. అందువలన అప్పుడప్పుడు కొన్ని కార్యక్రమాలు చేపడుతూ నామమాత్ర ఉనికిని చాటుకుంటున్నాయి. యువజన సర్వీసుల శాఖ నిధుల కొరతతో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టేస్థితిలో లేదు. నూతనంగా వస్తున్న ఆవిష్కరణలు, అవకాశాలు ఉద్యోగ నియామకాల గురించి వివరించే సంస్థలు, వ్యక్తులులేని కారణంగా ఎక్కడ కూడా యువకులను ఉత్తేజపరిచి వారిలో సామాజిక బాధ్యతను, పెంచే అవకాశం లేకుండా పోయింది. ఒక వేదిక అనేది నేడు యువ వయస్కులకు లేని కారణంగా అనేక అంశాలు చర్చకు రాకుండా పోతున్నాయి. దీనితో అసంతృప్తికి గురి అయిన యువకులు, అశాంతికి, అసహనానికి, గురి అవుతూ ఏదో ఒక రూపంలో నేర ప్రపంచంలోకి అడుగు పెడుతున్నారు.

తక్షణ కర్తవ్యం:

– గ్రామాలలో, పట్టణాలలో యువతను సమూహాలుగా ఏర్పరిచే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. అలాంటి సమూహాలతో వారికి అనేక అంశాలలో ప్రత్యేకించి సామాజిక అంశాలలో అవగాహన కల్పించాలి. ఈ ప్రక్రియ చాలా దేశాలలో మంచి ఫలితాలను ఇచ్చింది. యువతను ప్రేరేపింపజేసే వ్యవస్థలు ప్రధానంగా ప్రసార సాధనాలు ప్రభుత్వ నియంత్రణలో, కొన్నిసార్లు మన స్వీయ నియంత్రణలో పని చేయాలి.

– విద్యా విధానాలు సమీక్షించుకొని, విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి లేని కరిక్యులమ్, సిలబస్‌లను తయారు చేయాలి. సామాజిక అంశాలను విస్తృతంగా కళాశాలల్లో చర్చించాలి.

– ప్రతిభ కలిగిన ప్రతి వ్యక్తిలోని సామర్థ్యాలను వెలికి తీయడానికి కళా రంగాలను ప్రోత్సహించాలి. కళ ద్వారా విద్యార్థులు ఎంతో ఆనందిస్తారు. శాస్త్రీయ కళలను విస్తృతంగా ప్రచారం చేయాలి. సామాజిక రంగాలలో యువతను భాగస్వాములను చేయాలి. సహకారం, త్యాగశీలత, సామాన్య జీవనం, శ్రమ గౌరవం లాంటి అంశాలను చర్చకు తీసుకు రావాలి. ప్రభుత్వాలు విద్యా రంగానికి యువజన సర్వీసులకు బడ్జెట్‌లో సముచిత న్యాయం కల్పించే విధంగా కేటాయింపులు జరపాలి.

– దేశ వెన్నెముకగా నిలిచే అసంఖ్యాకంగా ఉన్న మన యువత గాడి తప్పకుండా, దేశ అభివృద్ధికి తోడ్పడే విధంగా అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత మన అందరిపై ఉన్నది. ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాగరూకతతో వ్యవహరించకపోతే భావిభారతం తీవ్ర పరిణామాలను ఎదుర్కోక తప్పదు. వెంటనే మన విధానాలను సంస్కరించుకుని, నూతన శాస్త్రీయ విధానాలతో మన యువతను దేశాభివృద్ధిలో భాగస్వాములుగా చేసుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది.

✻ చిక్కు మురళీమోహన్,
9849097586

చక్కెర వ్యాధిపై మహిళా చైతన్యం



డాక్టర్ పోటు భగత్‌కుమార్
ఎంఎస్, పిహెచ్‌డి
9440128169

ప్రతి పదిమంది మహిళల్లో ఒకరికి షుగర్ ఉండే అవకాశం ఉందని, అది తెలియక, షుగర్ వ్యాధిపై సరైన అవగాహన లేక సంబంధిత వైద్యసదుపాయాల కొరత, అజాగ్రత్త వలన ఇబ్బందులకి గురౌతున్నారని 'ఇంటర్నేషనల్ డయాబెటిక్ ఫెడరేషన్' చెప్తున్నది. ప్రపంచవ్యాప్తంగా 19.9 కోట్ల మంది మహిళలు చక్కెర వ్యాధితో నివసిస్తున్నారని ఈ సంఖ్య 2040 సం॥కల్లా 31.3 కోట్లకి చేరుతుందని అంచనా. వీరిలో ప్రతి 5గురిలో ఇద్దరు పునరుత్పత్తి వయస్సులో ఉండేవారేనని, చక్కెర వ్యాధి ఉందని తెలియక వారు గర్భం దాల్చలేక, ఒకవేళ దాల్చినా ఎబార్షన్‌లకి దారితీయడం, పుట్టే పిల్లల్లో వైకల్యం సంభవిస్తున్నదని కూడా ప్ర.ఆ.స చెపుతుంది. ఇలా బాధపడే వారి సంఖ్య కూడా సుమారు ఆరు కోట్ల పైనే అని తెలుస్తుంది. అభివృద్ధి చెందిన దేశాల్లో ''ఫ్రీ కన్‌సెప్షన్ ప్లానింగ్ సర్వీసెస్' పేరుతో స్క్రీనింగ్స్ ఉండటం వలన బాధితుల సంఖ్య తక్కువైనా, లో–మిడిల్ ఇన్‌కమ్ దేశాల్లో బాధపడే మహిళల సంఖ్య ఎక్కువని తెలుస్తున్నది. దీనికిగల ముఖ్యకారణాలుగా అందీ అందని వైద్య సదుపాయాలు, తల్లి సంరక్షణ వైద్యకేంద్రాలు, పేదరికం వలన మందుల సదుపాయాలు లేకపోవటంలా ఉన్నాయి. 1922 వ సం॥లో ఇన్సులిన్‌ను కనుగొన్న శాస్త్రవేత్త ఫ్రెడరిక్ బాంటింగ్ చక్కెర వ్యాధితో బాధపడుతున్న కోట్ల ప్రజానీకానికి దేవుడని చెప్పవచ్చు.

ప్రపంచానికే పెను సవాలుగా మారిన వైనం

షుగర్ వ్యాధి భారతదేశంలో సుమారు ఆరుకోట్ల 92లక్షలమంది వయోజనులని బాధపెడుతున్నట్లు తెలుస్తున్నది.

2015వ సం॥లో తేలిన వివరాల ప్రకారం ప్రతిదేశంలో సుమారు 5–20శాతం ఆరోగ్యవైద్యవ్యయం(తాము వైద్యం మీద ఖర్చుచేసే బడ్జెట్‌లో) వరకు షుగర్ వ్యాధి నియంత్రణకే పోతుందని, 2015వ సం॥లో షుగర్ వ్యాధి ప్రపంచ వ్యాప్తంగా 673 బిలియన్ డాలర్లు మింగితే ఇది కాస్త 2040సం॥కల్లా 802 బిలియన్ల డాలర్లకి చేరుతుందని వ్యాధి బారిన పడేవయోజనుల సంఖ్య ద్వారా తెలుస్తున్నది. అయితే ఈ ఖర్చులో 80% ధనిక దేశాల్లోనే జరగటం, లో–మిడిల్ ఇన్‌కమ్ దేశాల్లో వైద్య సదుపాయాల లోపాన్ని చెప్పకనే చెప్తుంది. షుగర్ వ్యాధి వలన కలిగే వైకల్యాలతో బాధపడే ప్రాంతాల్లో దక్షిణ ఆసియా ఉంది. మహిళలు బాధపడే వ్యాధుల పట్టికలో 9వ స్థానంలో షుగర్ వ్యాధి ఉండటం ఆలోచించవలసిన విషయం.

ముప్పులో భారతదేశం

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ సుమారు 57 వేలమంది ప్రజలని భాగస్వామ్యం చేసి 15 రాష్ట్రాల్లో షుగర్ వ్యాధిపై పరిశోధన చేసింది. ఇటీవల ''లాన్సెట్ డయాబెటిస్ అండ్ ఎండోక్రైనాలజీ జర్నల్‌లో ప్రచురింపబడిన ఈ ఫలితాలు మనదేశంలో పట్టణ ప్రాంతాల్లో నివసించే పేదప్రజలు షుగర్ వ్యాధి బారిన పడుతున్నట్లు చెపుతున్నాయి. 11.2% మంది పట్టణప్రాంతాల్లో ఉంటే, 5.2%మంది గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నట్లు తెలుస్తున్నది. 13.6%తో చత్తీస్‌ఘడ్ ప్రథమస్థానంలో షుగర్ వ్యాధిగ్రస్తులతో ఉండగా అత్యల్పంగా 4.3%తో బీహార్ ఉంది. 2012–13సం॥ వ్యవధి కాలంలో జరిగిన ఈ పరిశోధనలో అవిభక్త ఆంధ్రప్రదేశ్ 8.4%తో మహారాష్ట్రకి సమానంగా 5వ స్థానంలో ఉంది. ఈ పెరుగుతున్న శాతాలు సమస్య బలాన్ని, పరిష్కారలోపాన్ని లోతుగా చూపుతున్నాయి. దీనికి ఉన్న ఒకే ఒక దారి ప్రజల్లో వ్యాధిపై అవగాహన కల్పించటం, ముఖ్యంగా నిరక్షరాస్యులలో, పేదప్రజలకి ఈ వ్యాధిపై అవగాహన కల్పించాలి. లేని యెడల పెరుగుతున్న జీవనశైలి వ్యాధులు మనదేశ మనుగడకి ప్రమాదమే. అవసరానికి తగ్గ ఆహారం, పోషక విలువలతో కూడిన తిండి, శారీరక శ్రమ, మానసిక ఒత్తిడి తగ్గింపు తదితర విషయాలపై ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా పలు కార్యక్రమాలు నిర్వహిస్తే తప్ప మనదేశ కుటుంబ విధానంలో ముఖ్యపాత్ర వహించే మహిళ ఆరోగ్యం కుదుట పడదు. మహిళలకి చక్కెరవ్యాధిపై అవగాహన కల్పించటంలో ప్రపంచం సఫలీకృతమైతే కుటుంబం బాగుపడుతుంది, ఆయా సమాజాలు రోగరహిత సమాజాలుగా మారి దేశ ప్రగతికి, అభివృద్ధికి తోడ్పడతాయనటంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. ఇవే మహిళలకి మనం చేరవేయాల్సిన ముఖ్య సందేశం.

ప్రభుత్వ నిర్ణయాలే కీలకం

చక్కెర వినియోగం అధికమవటం వలనే చక్కెరవ్యాధి వస్తుం దనేది తెలిసిన విషయమే. అధిక చక్కెర వినియోగం వలన షుగర్ వ్యాధితో పాటు స్థూలకాయం, గుండెజబ్బుల ముప్పు కూడా ఎక్కువవుతుంది. సంక్షేమం కోసం పలు దేశాలు చక్కెరతో చేసిన డ్రింక్స్‌పై ట్యాక్స్ వేయాలనే దిశగా కదులుతున్నాయి. మెక్సికోలో 10% చక్కెర పానీయాలపై ట్యాక్స్ వేయటం వలన 12% వాడకం తగ్గి పిల్లల్లో స్థూలకాయం నివారణకి తోడ్పడుతున్నదని నివేదికలు తెలిపాయి. ఇంగ్లండ్‌లో కూడా ఇలా ట్యాక్స్ పెంచి, చక్కెర పానీయాల వాడకాని నియంత్రించాలని, పిల్లల్లో స్థూలకాయం రూపుమాపాలని ఆలోచనలు ప్రారంభించినట్లు తెలుస్తుంది. ఇదే దిశగా భారత కూడా 20% వరకు చక్కెర ట్యాక్స్ పెంచి పిల్లల్లో చక్కెరవాడకంని నియంత్రించి ఊబకాయాన్ని రూపుమాపాలనే నిర్ణయం ఆచరణ రూపం దాల్చింది. దీనితో పాటు మనదేశంలో తయారయ్యే ప్రతి ప్యాక్‌డ్ ఫుడ్ మీద ఆయా ఆహార పోషక విలువలు, దాని ద్వారా వచ్చే శక్తి క్యాలరీల విషయం కూడా తూ.చ. తప్పకుండా ప్రకటన చేయాలని, నిబంధనలు తేవాలని చూస్తున్నది. ఇలా చేయటం వలన మన దేశంలో ఉన్న 22% ఊబకాయం తగ్గుముఖం పట్టే అవకాశం లేకపోలేదు. ఈ విధమైన నియంత్రణ షుగర్ ట్యాక్స్ ద్వారా చేయగలిగితే వచ్చే 10సం॥లలో మనదేశంలో చక్కెర వ్యాధి 1.6% మరియు ఊబకాయం 3% తగ్గుముఖం పడుతుందనే నివేదికలు తెలుపుతున్నాయి. ప్రతి మహిళ అర్థం చేసుకొని కుటుంబ అవగాహనకి తోడ్పడగలిగితే ప్రపంచంలో రెండవ స్థానపు చక్కెరవ్యాధి కోరల్లో ఇరుక్కున్న భారతదేశం బయటపడగలదు.



ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో కొలువులు

ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో నేవిక్ (డొమెస్టిక్ బ్రాంచ్) పోస్టులను టెన్త్ ఎంట్రీ – 02/2018 బ్యాచ్ ద్వారా భర్తీచేసేందుకు అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది.
పోస్టు పేరు: నేవిక్ (కుక్, స్టీవార్డ్). వేతనం: రూ.21,700+ఇతర అలవెన్సులు.
అర్హతలు: కనీసం 50 శాతం మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అలాగే కుక్ అభ్యర్థులకు భారతీయ వంటకాల (శాకాహార, మాంసాహార) తయారీలో నైపుణ్యం, రేషన్ అకౌంటింగ్; స్టీవార్డ్ అభ్యర్థులకు మెనూ తయారీ, సర్వింగ్ (వడ్డించడం), హౌస్ కీపింగ్, వైన్ అండ్ స్టోర్స్ నిర్వహణలో ప్రావీణ్యం తప్పనిసరి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులతోపాటు ఏదైనా క్రీడా విభాగంలో జాతీయ/అంతర్రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ/ద్వితీయ/తృతీయ స్థానంలో నిలిచిన అభ్యర్థులకు పదో తరగతి మార్కుల్లో అయిదు శాతం సడలింపు ఉంటుంది. దరఖాస్తు విధానం: ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం: ఫిబ్రవరి 10, 2018. దరఖాస్తు చివరి తేదీ: ఫిబ్రవరి 16, 2018.

డిస్క్రిప్టివ్ అప్రోచ్‌తో ప్రిలిమ్స్ ప్రిపరేషన్

దేశంలోనే అత్యున్నత పోటీపరీక్ష యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ). దీన్ని ఏటా నిర్వహిస్తారు. నిర్దిష్ట వ్యవధిలో నియామక ప్రక్రియ పూర్తి చేస్తారు. అందువల్లే దేశంలోని ప్రతిభావంతులంతా సివిల్స్‌పైనే దృష్టి కేంద్రీకరిస్తారు. సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ 2018 నోటిఫికేషన్ విడుదలైంది. జూన్ 3న పరీక్ష జరుగనుంది. ఈ నేపథ్యంలో సివిల్స్ ప్రిలిమ్స్‌లో విజయం పొందాలంటే అనుసరించాల్సిన విధానాలను పరిశీలిద్దాం...

ప్రిలిమ్ అనేది వడపోత పరీక్ష. ప్రతి సంవత్సరం దాదాపు 5లక్షల మంది ప్రిలిమ్స్‌కు హాజరవుతున్నారు. ఈ పరీక్షలో నిర్దేశిత కటాఫ్ మార్కులు పొందినవారిని మెయిన్ పరీక్షకు అనుమతిస్తారు. ఎంతో పోటీని తట్టుకొని మలి దశకు ఎంపిక కావాలంటే ఏం చేయాలి. ఎలా చదవాలి. ఏమేం చదవాలి తదితర విషయాలపై అభ్యర్థికి స్పష్టమైన అవగాహన ఉండాలి.

సిలబస్‌పై అవగాహన

అభ్యర్థి చేయాల్సిన మొదటి పని నోటిఫికేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలి. విద్యార్హతలు, దరఖాస్తు విధానం తదితర అంశాల గురించి తెలుసుకోవాలి. అన్ని పోస్టులకు బ్యాచిలర్ డిగ్రీనే అర్హత. డిగ్రీ చివరి సంవత్సరం చదివే వారు కూడా ప్రిలిమ్స్ రాయొచ్చు. ముందుగా సిలబస్‌పై అవగాహన ఉండాలి. అభ్యర్థి వ్యక్తిగత సామర్థ్యాలపై అంచనా వేసుకోగలగాలి. అంశాలపై స్పష్టత వస్తుంది. అంశాలవారీగా కేటాయించాల్సిన సమయం, ఏమేం పుస్తకాలు చదవాలో అర్థమవుతుంది. అత్యంత ముఖ్యమైన అంశం స్టడీ మెటీరియల్‌ను సేకరించడం. ఈ విషయంలో అప్రమత్తతతో ఉండాలి. సబ్జెక్టులవారీగా ప్రామాణిక పుస్తకాలను సేకరించాలి. ఒక సబ్జెక్టుకు రెండుమూడు పుస్తకాలు కాకుండా ప్రామాణిక పుస్తకాలు కూడా చదవడం అవసరం. పుస్తకాల సేకరణ తర్వాత ప్రిపరేషన్ ప్రారంభించాలి. ప్రశ్నల శైలిలో ఇప్పుడు చాలా మార్పు వచ్చింది. అందుకోసం గత ఐదేళ్ల ప్రశ్నాపత్రాలను పరిశీలించాలి. ప్రతి ఏడాది ప్రశ్నల శైలి ఎలా మారుతుందో అర్థమౌతుంది. ఇప్పుడు స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నలు, అసెర్షన్ టైప్ ప్రశ్నలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సిలబస్‌లో ఏ టాపిక్ నుంచి ఎన్ని ప్రశ్నలు వస్తాయో అనే విషయాన్ని అంచనా వేయడం కష్టమైన పని. హిస్టరీ, సైన్స్ అండ్ టెక్నాలజీ , బయోడైవర్సిటీ అండ్ క్లైమేట్ ఛేంజ్ విభాగాల నుంచి గత ఐదేళ్లలో దాదాపు 18 నుంచి 20వరకు ప్రశ్నలడుగుతున్నారు. అందువల్ల అభ్యర్థులు సిలబస్‌లోని అన్ని అంశాలపై పట్టు సాధించాలి. అదేవిధంగా కరెంట్ అఫైర్స్ మీద అడిగే ప్రశ్నల శైలిలోనూ చాలా మార్పు కనిపిస్తోంది. ప్రత్యక్షంగా ప్రశ్నలను అడక్కుండా పరోక్షంగా అడుగుతున్నారు. సమకాలీన అంశాలతో కూడిన కోర్ సబ్జెక్టుల్లోని అంశాల నుంచి ప్రశ్నలు వస్తున్నాయి. కోర్ సబ్జెక్టులంటే పాలిటీ, ఎకానమీ, జాగ్రఫీలాంటివి. గత ఏడాది కరెంట్ ఈవెంట్స్ నుంచి 22 ప్రశ్నలు అడిగితే... వాటిలో 12 కోర్ సబ్జెక్టుకు సంబంధించినవే ఉన్నాయి.

టైమ్ మేనేజ్‌మెంట్

ప్రిపరేషన్‌కు సమయపాలన ఎంతో ముఖ్యం.ప్రతిరోజూ కనీసం ఎనిమిది గంటలకు తగ్గకుండా ప్రిపరేషన్ సాగించాలి. అన్ని సబ్జెక్టులను ప్రతిరోజు చదవడం నేర్చుకోవాలి. అంతేగానీ ఒక సబ్జెక్టు అయినాక మరొకటి అని పెట్టుకోకూడదు. ఇందువల్ల సబ్జెక్టుల ప్రిపరేషన్ మిగిలిపోయే అవకాశం ఉంది. మెమరీ టిప్స్ పాటిస్తూ చదవాలి. అభ్యర్థులు షార్ట్‌కట్ నోట్సు, విజువలైజేషన్ టెక్నిక్, చార్ట్ బేస్డ్ నోట్స్‌లాంటివి అనుసరించడం అవసరం.

అభ్యర్థులు పేపర్ 2 విషయంలోనూ శ్రద్ధ వహించాలి. పేపర్ 2 అనేది ఆప్టిట్యూడ్ పరీక్ష. ఇందులో 33శాతం మార్కులు సాధిస్తేనే పేపర్1 (జనరల్ స్టడీస్) మూల్యాంకనం చేస్తారు. అందువల్ల పేపర్ 2 చాలా కీలకమైనది. రీడింగ్ కాంప్రెహెన్షన్, న్యూమరికల్ ఎబిలిటీ, డెసిషన్ మేకింగ్ లాంటి అంశాలపై పట్టు సాధించాలి. పరీక్ష తేదీకి నెలరోజుల ముందు నుంచే అభ్యర్థులు పూర్తిగా రివిజన్‌కు పరిమితం కావాలి. ఆ సమయం లోనే మాక్, మోడల్ టెస్టులకు హాజరు కావడం వల్ల ఉపయోగం ఉంటుంది.



సివిల్స్ ప్రిలిమ్స్ వివరాలు:
నోటిఫికేషన్ విడుదల ఫిబ్రవరి 7, 2018.
దరఖాస్తుకు చివరి-తేదీ: మార్చి 6,
ప్రిలిమ్స్ పరీక్ష తేదీ జూన్ 3

సివిల్స్ ప్రిలిమ్స్ అనేది ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. రెండు పేపర్లు ఉంటాయి. పేపర్ 1లో జనరల్ స్టడీస్ ఉంటుంది. 200 మార్కులకు 100 ప్రశ్నలుంటాయి. పేపర్ 2లో ఆప్టిట్యూడ్ టెస్ట్ ఉంటుంది. 200 మార్కులకు 80 ప్రశ్నలుంటాయి.




భారత రాజ్యాంగంలో ముఖ్యమైన చట్టాలు

ఇండియన్ పీనల్ కోడ్ – 1860
నిర్భయ చట్టం (క్రిమినల్ లా సవరణ) – 2013
ఇండియన్ పోలీస్ చట్టం -1861



భారతీయ సాక్ష్యాల చట్టం -1872
భారతీయ పేలుడు వస్తువుల చట్టం -1884
క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (1973 సవరణలు..1974అమలులోకి) -1896
ఖైదీల గుర్తింపు చట్టం -1920
నష్ట పరిహారాల చెల్లింపు చట్టం -1923
ఇండియన్ వారసత్వ చట్టం -1925
వర్తక సంఘాల చట్టం -1926
డేంజరస్ డ్రగ్స్ యాక్ట్ -1930
వేతనాల చెల్లింపు చట్టం -1936
మోటర్ వాహనాల చట్టం -1939
ఫ్యాక్టరీ చట్టం -1948
ఉద్యోగుల భవిష్యనిధి చట్టం -1952
ఆహార కల్తీ నివారణ చట్టం -1954
భారతీయ పౌరసత్వ చట్టం -1955
నిత్యావసర వస్తువుల చట్టం -1955
హిందు కోడ్ చట్టం -1955
పౌర హక్కుల రక్షణ 1955
కోర్టులో ఖైదీల హాజరుపై చట్టం 1956
వరకట్న నిషేధ చట్టం 1961
ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ చట్టం – 2002
AP జూద నివారణ చట్టం – 1974
సమాన వేతన చట్టం -1976
వెట్టిచాకిరి రద్దు చట్టం – 1976
ఫ్యామిలీ కోర్టు చట్టం – 1984
బాల కార్మిక వ్యవస్థ రద్దు చట్టం – 1986
వినియోగదారుల రక్షణ చట్టం – 1986
టెర్రరిస్ట్ యాక్టివిటీస్ నిరోధక చట్టం – 1988
అవినీతి నిరోధక చట్టం -1988
ఇమ్మోరల్ ట్రాఫిక్ (ప్రివెన్షన్)చట్టం -1956.



ప్రొడక్ట్ డిజైన్‌తో ఉద్యోగావకాశాలు

ఇంజినీరింగ్ పరంగా ఎంతో ఉన్నతమైన హార్డ్‌వేర్‌ని, సాఫ్ట్‌వేర్‌ని వినియోగించినప్పటికీ కస్టమర్ కంటికి నచ్చకపోవడంతో ఎన్నో ఉత్పత్తులు విఫలమవుతున్నాయి. ఆటోమొబైల్, మొబైల్స్, ఏరోస్పేస్, ఫర్నిచర్ రంగాల్లో దిగ్గజ సంస్థల నుంచి కంపెనీలు రూపొందించే వెబ్‌సైట్స్, మొబైల్ యాప్స్ వరకు అన్నింటినీ ఆకర్షణీయంగా తయారుచేయడానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారు. గత దశాబ్ద కాలంగా ఇది మరింత పెరిగింది. ఎన్నో కంపెనీలు తమ వస్తువులను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి ప్రత్యేకంగా 'ప్రొడక్ట్ డిజైనర్'లను నియమించుకుంటున్నాయి.

ప్రొడక్ట్ డిజైనర్ వృత్తిలోకి ప్రవేశించడానికి ఇంజినీర్లు, ఆర్కిటెక్చర్ అభ్యర్థులు, క్రియేటివ్ ఆరట్స్ రంగంలో ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రొడక్ట్ డిజైనింగ్‌కి సంబంధించి బ్యాచ్‌లర్స్, మాస్టర్స్ స్థాయిల్లో కోర్సులు అందించే వృత్తి విద్యాసంస్థలు మనదేశంలో ఎన్నో ఉన్నాయి.

ఉద్యోగావకాశాలు

ప్రొడక్ట్ డిజైన్ లేదా ఇండస్ట్రియల్ డిజైన్‌లో డిగ్రీ చేసిన వారికి ఈ కింది విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

ఆటోమొబైల్ రంగం: కారు, బైక్, బస్సు, ఎర్ క్రాఫ్ట్‌లాంటి ఉత్పత్తులకు బాహ్య, అంతర నిర్మాణాలను ప్రయాణికులకు సౌకర్యంగా, ఆకట్టుకునేలా, పూర్తి రక్షణతో రూపకల్పన చేయడం.

వినియోగదారుల ఉత్పత్తులు: నిత్యజీవితంలో ఉపయోగించే గృహోపకరణాలైన మిక్సీ, ఫ్రిజ్, టీవీలకు డిజైన్‌లు చేయడం.

* ఫర్నిచర్ కంపెనీల్లోనూ సౌకర్యవంతమైన డిజైన్లు చేయడం. * ఇళ్లు, ఆఫీసుల్లో ఇంటీరియర్ డిజైనింగ్. * ఎలక్ట్రానిక్స్ రంగంలో మొబైల్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లను వినియోగదారులకు నచ్చేలా రూపకల్పన చేయడం. * ఉత్పత్తి సంస్థలు, పరిశ్రమల్లోని డిజైన్ విభాగాలు * కన్సల్టింగ్ కంపెనీలు * సిరామిక్ పరిశ్రమల్లోని వేర్, శానిటరీ వేర్ తదితర డిపార్ట్‌మెంట్‌లు * లైట్ ఫిటింగ్స్, డెకొరేటివ్ విభాగాల వంటివి ఉండే ఎలక్ట్రికల్, ఇతర పరిశ్రమలు.

ప్రధాన రిక్రూటర్లలో జనరల్ మోటార్స్ డిజైన్, హైడిజైన్, హోండా, డిజైన్ డాకు, ఎల్జీ, ఓజీఎస్ యానిమేషన్, ఓనియో వంటి సంస్థలు ఉన్నాయి. అర్హతలు, అనుభవాల ఆధారంగా సంవత్సరానికి జీతం రూ.రెండున్నర లక్షల నుంచి రూ.పన్నెండు లక్షల వరకు ఉంటుంది.

ఒక సంస్థ ఉత్పత్తి చేసిన కారు లేదా మొబైల్ ఫోన్ సాంకేతికంగా ఉన్నతంగా ఉండటం తోపాటు, ఉపయోగించే క్రమంలో మంచి ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలి. అప్పుడే ఆ సంస్థను వినియోగదారులు ఎక్కువ కాలం ఆదరిస్తారు. నిత్యజీవితంలో మనం ఉపయోగించే ప్రతి వస్తువు వెనుక ఒక అనుభవజ్ఞుడైన ప్రొడక్ట్ డిజైనర్ ఉన్నారు. రాబోయే రోజుల్లో ఆ రూపకర్త మీరే కావచ్చు. సంవత్సరానికి దాదాపు ఇరవై వేల మందికి ఈ రంగం ఉపాధి కల్పిస్తోందని ఒక అంచనా.

జీకే – కరెంట్ అఫైర్స్

వందేమాతరం పాటను ఒరిజినల్‌గా ఏ భాషలో కంపోజ్ చేశారు ?
జ: సంస్కృతం

హైకోర్టులో ఎంతమంది జడ్జిలు ఉండాలనేది ఎవరు నిర్ణయిస్తారు ?
జ: రాష్ట్రపతి

రాజ్యాంగ సవరణకు సంబంధించిన బిల్లులను పార్లమెంట్ లో ఏ సభలో ప్రవేశపెడతారు ?
జ: ఏ సభలోనైనా

ఫిన్ లాండ్ రాజధాని ఏది ?
జ: హెల్సింకి

స్వర్ణ జయంతి గ్రామ్ స్వరోజ్ గార్ యోజన ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చింది
జ: ఏప్రిల్ 1999

ఇంటర్నేషనల్ కాఫీ ఆర్గనైజేషన్ లో కొత్తగా చేరిన సభ్య దేశం ఏది ?
జ: వియత్నాం

చెకోరీ పౌడర్ మొక్కలోని ఏ భాగంలో లభిస్తుంది ?
జ: వేళ్ళల్లో

దాద్రా నగర్ హవేలీకి రాజధాని ఏది ?
జ: సిల్వాసా

అక్బర్ కు సమకాలికులైన భారతీయ పాలకురాలు ఎవరు ?
జ: రాణి దుర్గావతి

అవధ్ స్వతంత్ర్య రాజ్యాన్ని స్థాపించిన రాజు ఎవరు ?
జ: సాదత్ ఖాన్ బుర్హాన్ ఉల్ ముల్క్

మహేంద్ర సింగ్ ధోనీ మొదటి అంతర్జాతీయ వన్డేని ఎక్కడ ఆడాడు ?
జ: చిట్టగాంగ్

గురుముఖి రాతను పరిచయం చేసిన సిక్కుల గురువు ఎవరు ?
జ: గురు అంగద్.

డ్యురాండ్ రేఖ పాకిస్తాన్ తో ఏ దేశానికి మధ్య ఉంది ?
జ: ఆఫ్ఘనిస్తాన్

ఏ చెట్టు పెరగడానికి తక్కువ నీటిని వాడుకుంటుంది ?
జ: సుబాబుల్

ప్రపంచంలో ఎక్కువ మంది మాట్లాడే భాష ఏది ?
జ: మాండరిన్ (చైనాలో)

భారత్ పూర్తిగా వేటి ఉత్పత్తిలో స్వయం సంవృద్ధిని సాధించింది ?
జ: పాలు

SAARC లో సభ్యత్వం లేని దేశం ఏది ?
జ: మారిషస్


విస్తీర్ణంలో దేశంలో చిన్న రాష్ట్రం ఏది ?
జ: గోవా

ఫార్వార్డ్ బ్లాక్ పార్టీని ఎవరు స్థాపించారు ?
జ: సుభాష్ చంద్రబోస్

ఫుట్ అండ్ మౌత్ వ్యాధి వేటికి సోకుతుంది ?
జ: పశువులు

మొట్టమొదటి వ్యక్తులు

బోర్లాగ్ అవార్డు పొందిన తొలి భారతీయ మహిళా డాక్టర్?
-అమితా పటేల్ (1992)
భారత దేశ మొదటి రాష్ట్రపతి?
-డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ (1950 – 1962)
భారత దేశ మొదటి ఉపరాష్ట్రపతి
-సర్వేపల్లి రాధాకృష్ణన్ (1952 – 62)
భారత దేశ మొదటి ప్రధానమంత్రి
-జవహర్‌లాల్ నెహ్రూ (1947 – 64)
భారత దేశ మొదటి ఉప ప్రధానమంత్రి
-సర్దార్ వల్లభాయ్ పటేల్ (1947 – 50)
సుప్రీంకోర్టు మొదటి ప్రధాన న్యాయమూర్తి
హీరాలాల్ జె.కానియా (1950 – 51)
సుప్రీంకోర్టు మొదటి మహిళా న్యాయమూర్తి
-మీరా సాహెబ్ ఫాతిమా బీబీ (1989)
భారతదేశ తొలి మహిళా అడ్వకేట్ కోర్నేషియా
-సొరాబ్జి (కోల్‌కత్తా 1894)



భారత దేశ హైకోర్టులో మొదటి మహిళా ప్రధాన న్యాయమూర్తి
-లీలాసేథ్ (ఢిల్లీ)
భారత్‌లో హైకోర్టులో మొదటి మహిళా న్యాయమూర్తి
అన్నాచాంది
స్వాతంత్ర్యం రాకముందు భారత దేశ మొదటి గవర్నర్
-జనరల్ విలియం బెంటింగ్ (1828 – 35)
భారతదేశ చివరి గవర్నర్ జనరల్, మొదటి వైస్రాయ్
లార్డ్ కానింగ్ (1856 – 62)
స్వతంత్ర భారత మొదటి, చివరి గవర్నర్ జనరల్
మౌంట్ బాటన్ (1947 – 48)
స్వతంత్ర భారత మొదటి, చివరి భారతీయ గవర్నర్
జనరల్ సి. రాజగోపాలాచారి
ఐక్యరాజ్యసమితి సాధారణ సభకు అధ్యక్షత వహించిన మొదటి భారతీయ మహిళ
విజయలక్ష్మి పండిట్ (1953)
భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షురాలైన మొదటి మహిళ
-అనిబిసెంట్ (1917, కలకత్తా)
భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షురాలైన మొదటి భారతీయ మహిళ
-సరోజినీ నాయుడు (1925)
భారత జాతీయ కాంగ్రెస్ మొదటి అధ్యక్షుడు
ఉమేష్ చంద్ర బెనర్జి (1885 – ముంబయి)
భారత జాతీయ కాంగ్రెస్ తొలి ముస్లిం అధ్యక్షుడు
బద్రుద్దీన్ త్యాబ్జీ (1887 – మద్రాసు)
భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించిన తొలి ఆంధ్రుడు
-పి. ఆనందాచార్యులు (1891 – నాగపూర్)
వరుసగా రెండుసార్లు భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షుడు అయిన తొలి వ్యక్తి
-రాస్ బిహారీ ఘోష్ (1907).



పరీక్షల ఒత్తిడిపై టెలీ కౌన్సెలింగ్

మనతెలంగాణ/హైదరాబాద్ : మానసిక సమస్యలు, ఒత్తిడితో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో పరీక్షల ఒత్తిడిపై మానసిక నిపుణులతో టెలీ కౌన్సెలింగ్ ఇప్పించేందుకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. సిబిఎస్ఇ తరహాలో స్టేట్ సిలబస్ చదువుతున్న విద్యార్థులకు కూడా పరీక్షల సమయంలో టెలీ కౌన్సెలింగ్ ఇప్పించనున్నారు. ఇందుకు విద్యాశాఖ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్‌ను విద్యార్థులు, తల్లిదండ్రులు ఫోన్ చేసి సమస్య చెబితే మానసిక నిపుణులు, సంబంధిత సబ్జెక్ట్ నిపుణులు కౌన్సెలింగ్ ఇస్తారు. పదవ తరగతి పరీక్షలకు రెండు మూడు వారాల ముందు ఈ టెలీ కౌన్సెలింగ్ ప్రారంభించాలని యోచిస్తున్నట్లు తెలిసింది. తాత్కాలికంగా సర్వ శిక్షా అభియాన్(ఎస్ఎస్ఎ) టోల్ ఫ్రీ నెంబర్ 18004253525ని వినియోగించుకోవాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.



మాధ్యమం మార్పుకు అవకాశం

మనతెలంగాణ/హైదరాబాద్ : ఉపాధ్యాయ నియామక పరీక్ష(టిఆర్‌టి) నోటిఫికేషన్‌లో స్కూల్ అసిస్టెంట్ బయాలాజికల్ సైన్స్(ఇంగ్లీష్/హిందీ) మీడియంలో పోస్టులు లేవని, ఆ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న 1,868 మంది అభ్యర్థులు ఈ నెల 10 నుంచి 12 వరకు తెలుగు/ఉర్దూ/మరాఠి/కన్నడ మార్చుకోవాలని టిఎస్‌పిఎస్‌సి తెలిపింది. మాధ్యమాన్ని మార్చుకోకపోతే హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోలేరని పేర్కొంది.

పాలనా సంస్కరణలకు శ్రీకారం

• అధికారులు మారినా మొబైల్ నెంబర్ మారదు • తెలుగులోనే ప్రభుత్వ ఉత్తర్వులు



మన తెలంగాణ / హైదరాబాద్ : పరిపాలనా సౌలభ్యం కోసం, ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలయ్యేందుకు, అధికారుల్లో జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి నూతన సిఎస్ ఎస్‌కె జోషి పలు సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే వివిధ శాఖలను ఒకే గొడుకు కిందికి తీసుకురావాలని భావిస్తున్న సిఎస్ ఆయా శాఖలు జారీ చేసే ప్రభుత్వ ఉత్తర్వులను విధిగా తెలుగులో కూడా రూపొందించేలా మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. విధుల నిర్వహణలో భాగంగా ప్రభుత్వం వివిధ శాఖల ఉన్నతాధికారులకు కేటాయించిన మొబైల్ నెంబర్లు ఎప్పటికీ ఆ శాఖల్లోనే ఉండేలా, ఒక వేళ అధికారులు మారి కొత్తవారు బాధ్యతలు తీసుకున్నా నిర్దిష్ట శాఖకే ఆ నెంబర్ కొనసాగేలా ఆలోచనలు చేస్తున్నారు. అధికారుల బదిలీలు జరిగినప్పుడల్లా ఆ మొబైల్ నెంబర్లు వారితోనే వెళ్తుండడంతో తలెత్తుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ మార్పు అనివార్యమవుతోందని సచివాలయవర్గాలు వ్యాఖ్యానించాయి. అధికారిక సమాచార పంపిణీ, ఉత్తర ప్రత్యుత్తరాలకు విధిగా ప్రభుత్వ ఇ మెయిల్‌ను మాత్రమే వాడేలా ఆలోచనలు చేస్తున్నారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలకు సంబంధించిన సమాచారం వారికి అర్థమయ్యే తీరులో తెలుగు భాషలో రూపొందించాలని అధికారులకు నొక్కిచెప్పడంతో పాటు పారదర్శకత పాటించడంలో భాగంగా ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని కూడా సిఎస్ భావిస్తున్నారు. త్వరలోనే వెబ్‌సైట్ డిజైన్‌లో తగిన మార్పులు చేసే అవకాశమున్నట్లు సమాచారం. ప్రస్తుతం అమలవుతున్న వివిధ ప్రభుత్వ పథకాలను ఇన్ఫర్మేషన్ టెక్నాలజీతో అనుసంధానం చేయడం ద్వారా పకడ్బందీగా అమలుచేయడంతో పాటు ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా, సత్వరం ఫలితాలు ప్రజలకు చేరేలా తగిన మార్పులపై సంబంధిత అధికారులతో సిఎస్ చర్చించినట్లు తెలిసింది. ఐటి పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించడం ద్వారా వివిధ శాఖల మధ్య సమన్వయంతో పాటు పారదర్శకతకు స్థానం కల్పించవచ్చని ఆయన భావిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలన్నీ చిట్టచివరి లబ్ధిదారుల వరకు చేరడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. అందులో భాగంగా ఒకటి కంటే ఎక్కువ శాఖల సమన్వయం అవసరమైన పథకాలను దృష్టిలో పెట్టుకున్న సిఎస్ వాటిని సమీక్షా అవసరాల నిమిత్తం ఒకే గొడుకు కిందికి తేవడానికి ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు. వ్యవసాయ సంబంధ పథకాలపై సమీక్ష జరిపే సమయంలో ఆ శాఖతో పాటు పశు సంవర్ధక, మార్కెటింగ్, సహకార, సాగునీటిపారుదల, ఉద్యానవన తదితర శాఖల కార్యదర్శులంతా హాజరయ్యేలా ఇప్పటికే సూచనలు అందజేశారు. మొత్తం శాఖలన్నింటినీ ఈ తరహాలో గ్రూపులుగా చేయడంపై దృష్టి పెట్టారు. సామాజిక సంక్షేమంపై గురువారం జరిగిన సమీక్షకు కూడా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ తదితర శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. ఇకపైన ఇదే సంప్రదాయాన్ని కొనసాగించనున్నట్లు తెలిసింది.

హాస్టల్స్, కళాశాలలు, పాఠశాలలకు గ్రేడింగ్ విధానం

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ఎస్ సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, మహిళా సంక్షేమం, విద్యా, ఇంధనం, గృహనిర్మాణం, రవాణా, మున్సిపల్, పంచాయతీరాజ్ , పర్యాటక, యువజన సంక్షే మం, వైద్య, ఆరోగ్య, కార్మిక శాఖల ఉన్నతాధికారులతో సిఎస్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి రెసిడెన్షియల్ పాఠశాలల్లో అడ్మిషన్‌అందించేలా చర్యలు తీసుకోవాలని, హాస్టళ్లు, కళాశాలలు, పాఠశాలలకు గ్రేడింగ్ ఇచ్చే విధానాన్ని రూపొందించాలని సూ చించినట్లు ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటన పేర్కొంది.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి : అబ్కారీ కమిషనర్



మన తెలంగాణ/హైదరాబాద్ : సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని ఆబ్కారీ కమిషనర్ సోమేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లో మద్యం తయారీ డిపో మేనేజర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం డిపోలో ఉన్న సమస్యలని అధిగమించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. డిస్టిల్లరీ కార్పొరేషన్ చైర్మన్ దేవి ప్రసాద్ మాట్లాడుతూ ఎక్సైజ్ మరియు టిఎస్‌బిసిల కార్పొరేషన్ ఎండి అయిన సోమేష్ కుమార్ నాయకత్వంలో ముందుకు పోతున్నందుకు అభినందించారు. ఇటీవలే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ నాయకత్వంలో విజిలెన్స్ అండ్ ఆడిట్ వింగ్స్ ఏర్పాటు చేసి డిపోలో తనిఖీలు చేస్తున్నందుకు మంచి ఫలితాలు వస్తున్నాయని దానితో డిపోలలో పరిస్థితులు మెరుగుపడ్డాయని అభిప్రాయపడ్డారు. డిపోలో ఎదుర్కొంటున్న సమస్యలని ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. అన్ని డిపోల్లో అవినీతికి తావు లేకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్‌సబర్వాల్, అడిషనల్ కమిషనర్ రాజశేఖర్, ఆయా డిపోల మేనేజర్లతో పాటు ఆబ్కారీ అధికారులు పాల్గొన్నారు.

ఉచితంగా మెటీరియల్ పంపిణీ

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ కు హాజరవుతున్న మైనారిటీ అభ్యర్థులకు మైనారిటీ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సెంటర్ (సిఇడిఎమ్) ఉచిత శిక్షణ నిస్తోంది. ఇందుకు సంబంధించి హైదరాబాద్, సంగారెడ్డి, జహీరాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, భైంసా, నిజామాబాద్, బోధన్ కేంద్రాల్లో ఉచితంగా శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు స్టడీ మెటీరియల్‌ను కూడా ఉచితంగానే అందజేస్తున్నారు. సిఇడిఎమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్..ఎ.షుకూర్ గురువారం స్టడీ మెటీరియల్‌ను విడుదల చేశారు. ఈ మెటీరియల్‌ను ఉచిత శిక్షణ పొందుతున్న రెండు వేలకు పైగా అభ్యర్థులకు అందజేస్తారని షుకూర్ తెలిపారు. జనవరి 22 నుంచి ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

పిఒ పరీక్షలకు ఉచిత శిక్షణ

మన తెలంగాణ / హైదరాబాద్ : వివిధ బ్యాంకులు నిర్వహించే ప్రొబిషనరి (ప్రిలిమినరి), క్లరికల్, ఎస్ఎస్‌సి, ఆర్ఆర్‌బి, ఇతర పరీక్షలకు సిద్ధమయ్యే తెలంగాణ గిరిజన అభ్యర్థులకు అవసరమయ్యే శిక్షణను ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ తెలిపారు. ఉచిత శిక్షణ కేంద్రాలను భద్రాచలం, వరంగల్, ఉట్నూర్, పిఇటిసి, హైదరాబాద్ లలో ఏర్పాట్లు చేసినAట్లు తెలిపారు. మార్చి 5, 2018 నుండి మే 3 వరకు రెండు నెలలు పాటు శిక్షణ ఉంటుందని, అర్హులైన ఎస్‌టి అభ్యర్థులు ఫిబ్రవరి 9 నుంచి 19 వరకు http://studycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంత అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.2 లక్షలకు మించి ఉండరాదన్నారు. మరిన్ని వివరాలకు 040–27540104 సంప్రదించవచ్చని సూచించారు.

సిపిఐ నగర కార్యదర్శిగా నరసింహ



మన తెలంగాణ / హైదరాబాద్ :హైదరాబాద్ జిల్లా సిపిఐ కార్యదర్శిగా ఇ.టి.నరసింహ తిరిగి ఎన్నికయ్యారు. సిపిఐ నగర 22వ మహాసభల్లో 11 మంది కార్యవర్గ సభ్యులు, 45 మంది కౌన్సిల్ సభ్యులతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డల్లాస్, సింగపూర్, ఇస్తాంబుల్ నగరాల సరసన హైదరాబాద్‌ను అభివృద్ధి పరుస్తామని గొప్పలు చెప్పుకుంటున్న టిఆర్‌ఎస్ ప్రభుత్వం అందుకు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఇ.టి.నరసింహ ఈ సందర్భంగా విమర్శించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పోరాట ఎజెండాను ఖరారు చేసి ఉద్యమిస్తామన్నారు.

మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాళ్ల అధికారాన్ని కత్తిరించడం సరికాదు

మనతెలంగాణ/హైదరాబాద్ : మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సెలవు అధికారాన్ని ప్రిన్సిపాళ్ల నుంచి తొలగించి, జిల్లా విదాశాఖాధికారులకు అప్పగించడాన్ని ఎస్‌టిఎస్‌టిఎస్ ఖండించింది. ప్రిన్సిపాళ్ల అధికారాలు తగ్గించడం సరికాదని, విద్యాశాఖ సంచాలకులు తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఎస్‌టిఎస్‌టిఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.భుజంగరావు, జి.సదానందం గౌడ్‌లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఇరిగేషన్ ఉద్యోగుల జాబితా

మనతెలంగాణ/హైదరాబాద్: ఇరిగేషన్ ఉద్యోగుల జాబితాను గురువారం ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ శాఖకు ప్రభుత్వం అప్పగించింది. సుప్రీం కోర్టు తీర్పు మేరకు జోన్ 5, జోన్ 6 ఉద్యోగుల సీనియారిటీ జాబితాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే ఖరారు చేయాల్సి ఉంది. దీంతో ప్రభుత్వ సహాయ కార్యదర్శి ఎన్.ప్రతాప్ రెడ్డి, సెక్షన్ అధికారి రవీంద్రకుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.గోవర్ధనాచారి, ఎఇఇ పి.రమణా రెడ్డిలతో కూడి న తెలంగాణ ఇరిగేషన్ శాఖ ప్రతినిధి బృందం అమరావతి, వెలగ పూడిలోని ఎపి సచివాలయంలో సంబంధిత అధికారులకు జాబితాను అందజేశారు.



రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా డాక్టర్ కొర్ర లక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కొర్రా లక్ష్మి కి ఇటీవలే ఐఎఎస్ హోదా వచ్చింది.

ఎన్ని ఉద్యోగాలు సృష్టించారు?

(మొదటిపేజీ తరువాయి)

పడ్డారు. మోడీ ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు సృష్టించిందని నిలదీశారు. ఆయన తన ట్వీట్ల పరంపరలో ప్రభుత్వ ఆర్థిక లోటుపాట్లను కడిగేశారు. ఓ ప్రక్క 11.5 శాతం నామమాత్రపు స్థూల జాతీయోత్పత్తి వృద్ధి ఉంటే గ్రాస్ ట్యాక్స్ ఇన్‌కమ్ 16.7 శాతం వృద్ధి చెందుతుందని ప్రభుత్వం అంటోంది. పన్ను వృద్ధి రేటు 16.7 శాతం అనేది 'వాస్తవికమా లేక ప్రతిష్టాత్మకమా లేక దూకుడైనదా?' అనేది తెలుపాలన్నారు.

'బడ్జెట్ 2018–19లో ద్రవ్యలోటు మరింత దిగజారిందన్నారు. 2017–18లో 3.2 శాతం నుంచి 3.5 శాతానికి, 2018–19లో 3.0 శాతం నుంచి 3.3 శాతానికి పెరిగిందన్నారు. కరెంట్ అకౌంట్ లోటు అంచనాలు 2017–18, 2018–19కి ఎంత?' అని ఆయన తన ట్వీట్‌లో అడిగారు. ప్రభుత్వం నిర్దేశించుకున్న ప్రతి లోటు లక్ష్యాన్ని ఉల్లంఘించారు. ఈ అత్యధిక లోటులు ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపెడతాయా.. ఎందుకంటే టోకు ధరల సూచీ(డబ్ల్యుపిఐ) 3.6 శాతం, వినియోగదారుల ధరల సూచీ(సిపిఐ) 5.2 శాతం ఉంది. 2017–18, 2018–19లో డబ్ల్యుపిఐ, సిపిఐ ఎంత అని కూడా ఆయన ప్రశ్నించారు. 'ట్రెజరీ బాండ్లపై వడ్డీని పెంచడం అనేది ద్రవ్యోల్బణం కారణంగానేనా?' అని అడిగారు. ఒకవేళ ముడిచమురు బ్యారెల్ రేటు 70 నుంచి 75 డాలర్లకు పెరితే దాని ప్రభావం ప్రభుత్వ బడ్జెట్ అంచనాలు ముఖ్యంగా లోటులపై ఎలా ఉంటాయని అడిగారు.

2017–18లో ప్రభుత్వం అదనంగా రూ. 48, 000 కోట్ల రుణం తేనుంది. ప్రభుత్వం తరఫున ఓఎన్‌జిసి కూడా రూ. 37,000 కోట్లు అప్పు తేనుంది. కానీ ఈ రూ. 85,000 కోట్లు ఎక్కడకి వెళతాయి? అని ప్రశ్నించారు.

'2017–18లో మొత్తం వ్యయం రూ. 71,000 కోట్లకు పెంచారు. కానీ రెవెన్యూ వ్యయం రూ. 1,07,371 కోట్లకు పెంచారు. ఇది ప్రభుత్వ దుబార వ్యయానిక సాక్ష్యం కాదా, ఆర్థిక జాగురుకత నియమాలను ఇది ఉల్లంఘించడం లేదా?' అని ట్వీట్ చేశారు. 2017–18లో మూలధన వ్యయాన్ని రూ. 3,09,801 కోట్లుగా అనుకున్నారు. కానీ తర్వాత దాన్ని రూ. 2,73,445 కోట్ల అంచనాకు సవరించారు. అంటే రూ. 36,000 కోట్ల లోటు. 'ఏ పథకాల, ప్రాజెక్టులు ఈ మూలధన వ్యయం కారణంగా దెబ్బతిన్నాయి?' అన్నారు.

ప్రధాని మోడీ బాధ్యతలు చేపట్టక ముందు 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్ఓ) ప్రకారం ఉద్యోగం అంటే నిర్దిష్టమై, క్రమబద్ధమైన, సహేతుకమైన భద్రమైన పని. 'ఉద్యోగానికి మీ నిర్వచనం ఏమిటి? ఐఎల్ఓ ప్రకారం మీ ప్రభుత్వం గత నాలుగేళ్లలో ఎన్ని ఉద్యోగాలు సృష్టించింది?' అని చిదంబరం మోడీని ప్రశ్నించారు. కస్టమ్స్ పన్ను అంచనాలను తగ్గిస్తూ సవరించారు. దాని వెనుక ఉన్న కథేమిటో ప్రజలకు, దేశానికి తెలుపుతారా? అన్నారు. జిఎస్‌టి ఆదాయం ఎంతో కూడా ప్రభుత్వం తెలుపాలన్నారు. '2018–19 బడ్జెట్‌లో కార్పొరేషన్ ట్యాక్స్ 10.15 శాతం, ఆదాయపు పన్ను 19.88 శాతం, జిఎస్‌టి 67.31 శాతం అని పేర్కొన్నారు. ఈ పన్ను విధానం వెనుక ఉన్న తర్కాన్ని దేశ ప్రజలతో పంచుకుంటారా?' అని నిలదీశారు.

ఎపిలో బంద్ ప్రశాంతం



అమరావతి: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు సరైన కేటాయింపులు చేయకపోవడాన్ని నిరసిస్తూ వామపక్షాలు గురువారం రాష్ట్రబంద్ చేపట్టాయి. వైసిపి, కాంగ్రెస్, జనసేన పార్టీలతో సహా వివిధ సంఘాలు మద్దతు తెలుపుతూ బంద్‌లో పాల్గొంటున్నాయి. బంద్ కారణంగా వైసిపి అధినేత వైఎస్ జగన్ తన పాదయాత్రకు విరామం ప్రకటించారు. బంద్ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించింది. విశాఖలోని మద్దెలపాలెం బస్ డిపో వద్ద వామపక్షాలు బైఠాయించాయి. బస్సులు బయటకు రాకుండా అడ్డుకుంటున్నారు. గుంటూరు ప్రధాన బస్‌డిపో వద్ద ఆందోళనకారులు ఆందోళన చేపట్టారు. దీంతో సుమారు వెయ్యికి పైగా బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ ఆందోళన కారులు బంద్ నిర్వహిస్తున్నారు

శరవేగ వృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాని నరేంద్ర మోడీ కలలు కన్నట్లు టాప్ 50 దేశాలకు చేరుకోవడం సాకారం కావాలన్నారు. 55 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ సమాజంలోని సమస్యలను రూపుమాపడానికి ఏమీ చేయలేదని కాకపోతే ఇంకా పెంచిందన్నారు. 2004 నుంచి 2014 కాలంలో కాంగ్రెస్ ఎలాంటి నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టలేదు. కానీ ప్రస్తుత ప్రభుత్వం వాటిని అద్భుతంగా చేపట్టిందని చెప్పారు. యుపిఎ ప్రభుత్వ హయాంలో ఆర్థిక ద్రవ్యోల్బణం నిరంతరం 6 శాతానికి పైనే స్థిరంగా ఉంది. అయితే మేము ఆర్థిక జాగురుకతకు కట్టుబడి ద్రవ్యోల్బణాన్ని 3.9 శాతం నుంచి కింది తెచ్చాం అని జైట్లీ నొక్కి చెప్పారు. నిర్మాణాత్మక సంస్కరణలు అనేవి తాత్కాలికంగా సమస్యలను కలిగిస్తాయి. ఆధార్‌ను మొదట ప్రవేశపెట్టిన కాంగ్రెసే నేడు దానికి వ్యతిరేకంగా పోరాడుతోంది అన్నారు. వస్తు, సేవల పన్ను(జిఎస్‌టి) వ్యతిరేకులు దానిని వాయిదా వేయాలన్నారు. కానీ జిఎస్‌టి ఆమోదించడానికి రాజ్యాంగ తుది గడువు 2017 సెప్టెంబర్ 6 కావడంతో అప్పట్లో దానిని ఆమోదించాల్సి వచ్చిందన్నారు. 'నేను సింగపూర్‌కు వెళ్ళినప్పుడు అక్కడ వారు మెర్సిడెస్‌పై, ఆహారంపై ఒకే రకంగా 7 శాతం జిఎస్‌టిని విధించడం చూశాను. మరి భారత్‌లో కూడా అలాగే చేయాలా? ఇక్కడ అత్యధిక జనాభా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారు. ఇలాంటి పరిస్థితిలో ఒకే రకమైన శ్లాబ్ విలాస వస్తువులకు, అవసర వస్తువులకు విధించడం ఎలా?' అని జైట్లీ ప్రశ్నించారు. గత ఏడాది దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్స్ ఆదాయంను రూ. 3.67 లక్షల వరకు మినహాయింపు ఇచ్చినట్లు కూడా ఆయన తెలిపారు.

కారిడార్ నెలకొల్పాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రొడక్షన్ కారిడార్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్న మంత్రి కేటీఆర్ నిర్మాలా సీతారామన్ కి స్పష్టం చేశారు.ఫిక్కీ ఆధ్వర్యంలో ఈ నెల 14 19 వరకు హైటెక్స్ లో జరిగే ఇంటర్ నేషనల్ కాన్ఫరెన్స్ కమ్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవానికి రావాలని కేంద్ర మంత్రులు నరేంద్ర సింగ్ థోమర్, హర్ష వర్ధన్ లను మంత్రి కేటీఆర్ కోరారు. అనంతరం కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్ ను కలసిన కే.టీ.ఆర్ హైదరాబాద్ ఫార్మా సీటికి సహకరించాలని కోరారు. శుక్రవారం ఉదయం 10:30 నిమిషాలకు రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ని రాష్ట్రపతి భవన్ లో మంత్రి కే.టీ. రామారావు మర్యాదపూర్వకంగా కలవనున్నారు.

యువకుడి ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులకు ఫోన్ చేసి వివరించినట్లు తెలుస్తోంది. కంపెనీ పని చేయించుకుని జీతం ఇవ్వకపోవడంతో అక్కడ ఉండలేక, ఇంటికి రాలేక తన కొడుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. దేశం కాని దేశంలో చనిపోయిన తమ కొడుకు మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి తరలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

మృత్యుఒడిగా మారిన ఆరబోసిన పత్తి



(మొదటిపేజీ తరువాయి)

మిర్చి లోడుతో వచ్చిన డిసిఎం బానోతు రవి పైనుంచి దూసుకెళ్లింది. వెంటనే అతన్ని వరంగల్ ఎంజిఎం ఆసుపత్రికి తరలించగా, అప్పటికే రవి మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు.

మార్కెట్లో ఉద్రిక్తత: రవి మృతి చెందిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్, బిజెపి, టిడిపి నేతలు మార్కెట్ చేరుకొని బాధితుడికి న్యాయం చేయాలని ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో వారిని పోలీసులు అరెసు చేసి స్టేషన్‌కు తరలించారు. అయితే మార్కెట్ కమిటీ అధికారులు ఎంజిఎం ఆసుపత్రికి వెళ్లి మృతుడి కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చే ఎక్స్‌గ్రేషియాతో పాటు అధికారులు, వ్యాపారస్తులు ఆర్థిక సహాయం అందించారు.

మార్కెట్‌కు రాని జెసి, ఆర్‌డిఒ : మార్కెట్‌లో చిన్న గొడవ జరిగితే వెంటనే వచ్చే ఆర్‌డిఒ లేదా జెసిలు రైతు చనిపోయాడని తెలిసిన కూడా రాకపోవడంతో కాంగ్రెస్, బిజెపి, టిడిపి పార్టీల నాయకులు పలు అనుమానలు వ్యక్తం చేశారు. వెంటనే వారు మార్కెట్‌కు రావాలని డిమాండ్ చేశారు.

డిసిఎం బోల్తా

(మొదటిపేజీ తరువాయి)

చెందాయి. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గొల్లపల్లికి చెందిన ధోనికి కుమారస్వామి (40), సంగెం మండలం క్రిష్ణానగర్‌కి చెందిన మేకల మల్లయ్య(36), చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లికి చెందిన డిసిఎం క్లీనర్ కొల్లూరు రాకేష్ (22) గొర్రెల వ్యాపారులు. వీరు బుధవారం నెక్కొండ సంతలో 105 గొర్రెలు కొనుగోలు చేశారు. వీటిని హైదరాబాద్ జియాగూడ మండిలో అమ్మడం కోసం డిసిఎం వాహనం కిరాయికి మాట్లాడుకుని అదే రోజు రాత్రి బయలుదేరారు. గురువారం తెల్లవారు జామున సుమారు నాలుగు గంటల ప్రాంతంలో వాహనం వెల్మినేడు శివారులోకి వెళ్లగానే ప్రమాదవశాత్తు కల్వర్టు గోడను ఢీకొట్టి అదుపుతప్పి పడిపోయింది. గొర్రెల కాపరులు ఇద్దరు, డిసిఎం క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందారు. 59 గొర్రెలు మృతి చెందాయి. డిసిఎం డ్రైవర్ మేడిపల్లి వెంకన్న తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృత దేహాలను పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. మృతి చెందిన గొర్రెలను అక్కడే ఖననం చేసి మృతులను వారి కుటుంబాలకు అప్పజెప్పి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ పాండురాంగారెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా, గొర్రెల కాపరులకు, గొర్రెలకు ప్రభుత్వం పది లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని జిఎంపిఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షులు అవిశెట్టి శంకరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆ 15 కంపెనీలకు దరఖాస్తు వద్దు

(మొదటిపేజీ తరువాయి)

జరిపేందుకు సిద్ధమవుతున్నట్టు కార్మిక విభాగం తెలిపింది. విదేశీ ఉద్యోగులను తీసుకునే క్రమంలో కావాలని నిబంధనలు ఉల్లంఘించడం లేదా వివరాలు తప్పుగా సమర్పించిన కంపెనీలను ఈ జాబితాలో ఉంచుతామని లేబర్ డిపార్ట్‌మెంట్ వెల్లడించింది. హెచ్ 1బి అనేది నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా. దీని కింద ప్రత్యేక నైపుణ్యం ఉన్న విదేశీ ఉద్యోగులను అమెరికా కంపెనీలు తీసుకునే అవకాశం ఉంటుంది. ప్రతి ఏటా లాటరీ పద్ధతిలో 65 వేల వరకూ హెచ్1బి వీసాలను జారీ చేస్తారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత హెచ్1బి వీసాల జారీపై ఎన్నో ఆంక్షలు విధిస్తోంది.

అమెరికా విడుదల చేసిన 15 కంపెనీలు ఇవే... ఏజెల్ టెక్నాలజీస్(న్యూజెర్సీ), అమికా టెక్నాలజీ (కెంట్, వాషింగ్టన్), క్లిన్నార్ ఎల్‌ఎల్‌సి (షికాగో, ఇలినాయిస్) మాక్రో నెట్‌వర్క్స్ (న్యూయార్క్, కాలిఫోర్నియా), డెల్టా సెర్చ్ ల్యాబ్స్(కేంబ్రిడ్జ్, మసాచుసెట్స్), ఎన్‌వైసి హెల్త్‌కేర్ స్టాఫింగ్(న్యూయార్క్), ఫోస్కామ్ డిజిటల్(హూస్టన్, టెక్సాస్), జీ హెల్త్‌కేర్ ఎల్‌ఎల్‌సి(శాన్ జోస్, కాలిఫోర్నియా), ఇన్‌కాన్ కార్పొరేషన్(సన్నీవేల్, కాలిఫోర్నియా), ఎండి2 సిస్టమ్స్(వర్జీనియా), రీడ్‌స్ట్రా డైరీ లిమిటెడ్(మెన్‌డాన్, మిషిగాన్) నిషె సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్(హూస్టన్, టెక్సాస్), నార్తర్న్ కాలిఫోర్నియా యూనివర్సల్ ఎంటర్‌ప్రైజ్ కార్పొరేషన్(శాన్ జోస్, కాలిఫోర్నియా), టెలవా నెట్‌వర్క్స్(శాన్‌ఫ్రాన్సిస్కో, కాలిఫోర్నియా), టెక్‌వైర్ సొల్యూషన్స్(జెర్సీ సిటీ, న్యూజెర్సీ).

ముంపు ముప్పు!

(మొదటిపేజీ తరువాయి)

భవిష్యత్తుపై తెలంగాణ అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్య నుంచి గట్టెక్కడం కోసం కరకట్టల ఎత్తు మరో పది అడుగుల మేర పెంచాల్సి ఉంటుందని, ఇందుకు సుమారు రూ. వెయ్యి కోట్ల మేర ఖర్చు కావచ్చని, దీన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే భరించాలని తెలంగాణ అభిప్రాయపడుతోంది.



యుపిలో విపక్షాల అంతరాయాల మధ్య గవర్నర్ ప్రసంగం

లక్నో: విపక్షాల అంతరాయాల మధ్య ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం నాడు ప్రారంభమ య్యాయి. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ రామ్‌నాయక్ ప్రసంగిస్తుండగా విపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతి రేకంగా నినాదాలు చేశారు. ఆయనపై కాగితపు బంతులు, గాలి బుడగలను వదిలి తమ నిరసనను తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'గవర్నర్ గో బ్యాక్', అమాయకుల ఎన్ కౌంటర్‌ను నిలిపి వేయాలని, ముస్లింలపై అమానుష దాడులు ఆపాలని రాసిన ప్లకార్డులను ప్రదర్శించారు. యుపిలో శాంతిభద్రతలు లేవని, రైతు వ్యతిరేక బిజెపి ప్రభుత్వం, రైతుల రుణాలు రద్దు చేయాలనే విపక్షాల నిర సనల మధ్య యోగి ఆదిత్యానాథ్ ప్రభుత్వ విజయాలపై గవర్నర్ దాదాపు గంటన్నరపాటు ప్రసంగించారు. అనంతరం ప్రసంగ పూర్తవగానే గవర్నర్ మాట్లాడుతూ 'మీరు నాగరిక సమాజ ప్రతినిధులుగా వ్యవహరించా లని' విపక్షాలను మందలించారు. ఎటువంటి విరామం లేకుండా 38 పేజీల ప్రసంగాన్ని ఆయన చదివారు. విప క్షాల ప్రవర్తనను ఖండించిన స్పీకర్ హృదయ్ నారాయణ్ దీక్షిత్ గవర్నర్ ప్రసంగానికి కృతజ్ఞతలు తెలిపారు.

సాగు విస్తీర్ణం పెంపునకే రైతుకు ఆర్థిక సాయం

మన తెలంగాణ/శంషాబాద్: తెలంగాణ రాష్ట్రంలో సాగు భూమి విస్తీర్ణాన్ని పెంచేందు కోసమే కెసిఆర్ రైతులకు ఆర్థిక సహా యం అందజేస్తుందని వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం శంషాబాద్ మండల పరిధిలోని కాచారం వర్ధమాన్ కాలేజి ప్రాంగణంలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది కోసం మూడు రోజుల పాటు జరిగే స్పోర్ట్స్ మీట్‌ను స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, మహేశ్వరం ఎమ్మెల్యే తీగల కృష్ణరెడ్డితో కలిసి ప్రారంభించారు.

ముగ్గురు స్నాచర్ల అరెస్టు



మన తెలంగాణ/ హైదరాబాద్ సిటీబ్యూరో : 11 స్నాచింగ్‌లు చేసి తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు నిందితులను నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుండి రూ. 12 లక్షల విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. గురువారం పోలీసు కమిషనర్ శ్రీనివాస్‌రావు నిందితుల వివరాలను వెల్లడించారు. మహారాష్ట్ర జల్‌గావ్‌కు చెందిన అయ్యన్ అలీఖాన్, అహ్మద్ అలీఖాన్, బబ్లూ అలియాస్ హరీందర్‌సింగ్‌తో కలిసి 2014–15లో 11 స్నాచింగ్‌లు చేశారు. అయ్యన్ అలీఖాన్ వాహనాన్ని నడుపుతుండగా బబ్లూ చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతుంటాడు.2017లో మొత్తం 47 స్నాచింగ్‌లు జరగగా 11 స్నాచింగ్‌లు వీరుముగ్గురే చేశారు.వీరి అరెస్టు చేసి , వీరి వద్ద నుంచి 311గ్రా. నగలు,1.25 లక్షల నగదు, 2 మోటార్ సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసు కమిషనర్ శ్రీనివాస్‌రావు వెల్లడించారు.


ప్రజలకు కార్పొరేటు స్థాయి వైద్యం

వైద్యఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి

మన తెలంగాణ/సంగారెడ్డి టౌన్ : రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖ స్వర్ణ యుగం నడుస్తుదని మంత్రులు హరీశ్‌రావు, లక్ష్మారెడ్డిలు అన్నారు. గురువారం సంగారెడ్డిలో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, పాత్రికేయుల కోసం ఏర్పాటుచేసిన వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ప్రజా వైద్య విధానాన్ని గాలికి వదిలేసి కార్పొరేట్లకు కొమ్ముకాశాయన్నారు. తెలంగాణ వచ్చాక మార్పును చూడాలనుకుంటే గత ప్రభుత్వంలో ఆసుపత్రిలో ఉన్న రికార్డులను, ఇప్పుడున్న రికార్డులను పరిశీలిస్తే స్పష్టంగా అర్థమవుతుందన్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్ గతంలోని ఎమ్మెల్యే లాగా మాటల మనిషి కాదని, చేతల మనిషి అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. కలెక్టర్ మాణిక్కరాజ్ కణ్ణన్, జెసి వాసం వెంకటేశ్వర్, ఇహెచ్‌ఎస్ సిఇఒ పద్మజ, ఎమ్మెల్సీలు భూపాల్‌రెడ్డి, పాతూరు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు ద్రోహం చేస్తున్న ప్రభుత్వాలు

ప్రెస్ మీట్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ



మన తెలంగాణ/కురవి(మహబూబాబాద్ జిలా): కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ద్రోహం చేస్తున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం కురవి మండల కేంద్రంలో నిర్మించిన సిపిఐ నూతన కార్యాలయం ఎదుట పార్టీ జెండాను ఆవిష్కరించి భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పా టు చేసిన నియోజకవర్గం ముఖ్యకార్యకర్తల సమావేశంలో చాడ మాట్లాడుతూ 2014 పునర్విభజన చట్టం ప్రకారం తెలుగు రాష్ట్రాలకు నిధులు ఇవ్వడంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ విఫలం చెందారని, బిజెపి ప్రభుత్వానికి భజన చేస్తున్న తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రు లు కెసిఆర్, చంద్రబాబులు నిధులు రాబట్టడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కల్పించి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ నిర్మించి ఈ ప్రాంత నిరుద్యోగులను ఆదుకుంటామని గొప్పలు చెప్పిన ప్రభుత్వాలు పార్లమెంట్ బడ్జెట్ సమావేశంలో ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించకపోవడం సిగ్గు చేటన్నారు. మాజీ ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ దళిత,గిరిజనులకు మూడెరాల భూమి ఇస్తానని మోసం చేశారన్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు తమ్మెర విశ్వేశ్వర రావు, మహబూబాబాద్ జిల్లా సిపిఐ అధ్యక్షులు బి విజయసారథి పాల్గొన్నారు.

బాలీవుడ్‌లో కొత్త ప్రేమాయణం

బాలీవుడ్‌లో కొత్త ప్రేమ పావురాలు పుట్టుకొస్తున్నాయి. డేటింగ్, సహజీవనం ఇవన్నీ అక్కడ సహజమే అయినా ఇవన్నీ బయటపడటం అనేది అరుదుగా జరుగుతుంది. అయితే ప్రేమలో మునిగిపోయిన ఓ కొత్త జంట గురించి తోటి హీరోయిన్ చెప్పడంతో ఈ వ్యవహారం అందరికీ తెలిసిపోయింది. ఆ కొత్త ప్రేమ జంట రణబీర్ కపూర్, అలియాభట్ కాగా... వారి ప్రేమాయణాన్ని సోనాక్షి సిన్హా బయటపెట్టింది. ఈ ఏడాది ముగిసేలోపు వాళ్లిద్దరూ ఒకరినొకరు బాగా అర్థం చేసుకొని పెళ్లి పీటలెక్కుతారని వారి తరపున సోనాక్షి చెప్పడం విశేషం. రణబీర్ కపూర్ కోసం ఓ సినిమాను సైతం త్యాగం చేసి అతనితో లోతైన ప్రేమలో అలియాభట్ మునిగి తేలుతోందట. ఈ వార్త బయటకు రావడంతో కపూర్‌ల వంశం మూడో తరం వారసుడి పెళ్లి త్వరలోనే జరుగనుందని బాలీవుడ్ మీడియా ప్రచారం మొదలుపెట్టింది. ప్రస్తుతం రణబీర్‌కపూర్, అలియాభట్ 'బ్రహ్మాస్త్ర' సినిమాలో కలిసి నటిస్తున్నారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ మూవీ భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోంది.





ఏప్రిల్‌లో 'గోపికృష్ణ మూవీస్' చిత్రం

ప్రభాస్ హీరోగా సుజిత్ దర్శకత్వంలో 'సాహో' సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. యు.వి. క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ 50 శాతం పూర్తయ్యింది. ఈ సినిమా తర్వాత ప్రభాస్ 'జిల్' ఫేమ్ రాధాకృష్ణ దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నాడు. ఏప్రిల్‌లో ఈ చిత్రం ప్రారంభం కానుంది. అయితే ప్రభాస్ 'సాహో' సినిమా షూటింగ్ కోసం ఈ నెలాఖరున దుబాయ్ వెళ్లనున్నాడు. ఈ చిత్రాన్ని పూర్తిచేసుకొని ఏప్రిల్ 20న అతను ఇండియాకు తిరిగి రానున్నాడు. అనంతరం గోపికృష్ణ మూవీస్ సంస్థలో కృష్ణంరాజు నిర్మాతగా రాధాకృష్ణ దర్శకత్వంలో సినిమా చేయనున్నాడు. ఈ సినిమా ఏప్రిల్ చివరి వారంలో పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది. తాజా సమాచారం ప్రకారం హాట్‌బ్యూటీ పూజా హెగ్డే ఈ మూవీలో హీరోయిన్‌గా నటించే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. ఈ సినిమా భారీ బడ్జెట్‌తో తెరకెక్కనుంది.

'మిర్చి' ఘనత అతనిదే

ప్రభాస్ కెరీర్‌లోని హిట్ చిత్రాల్లో 'మిర్చి' కూడా ఒకటి. ఈ చిత్రంతోనే టాలీవుడ్‌కు కొరటాల శివ వంటి మంచి దర్శకుడు దొరికాడు. చేసిన తొలి చిత్రంతోనే అందరి మెప్పును పొంది ఆయన కమర్షియల్ డైరెక్టర్‌గా పేరుతెచ్చుకున్నాడు. అయితే దర్శకత్వపు అనుభవం లేకున్నా తను చెప్పిన కథను నమ్మి 'మిర్చి' చేసిన ప్రభాస్‌కే ఆ సినిమా విజయపు ఘనత మొత్తం దక్కుతుందని కొరటాల శివ పలు సందర్భాల్లో అన్నారు. ఇక 'మిర్చి' సినిమా విడుదలై గురువారంతో ఐదేళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా కొరటాల శివ మాట్లాడుతూ ''మిర్చి చిత్రం నాకు ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చింది. నాతో ఈ సినిమా చేసిన ప్రభాస్, నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్, సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు''అని చెప్పారు. ప్రస్తుతం సుజిత్ దర్శకత్వంలో ప్రభాస్ 'సాహో' చేస్తుండగా... మహేష్ హీరోగా కొరటాల శివ 'భరత్ అనే సినిమాను తెరకెక్కిస్తున్నాడు.



• కొరటాల శివ

అది ఆయన గొప్పతనం

సాయిధరమ్‌తేజ్, లావణ్య త్రిపాఠి హీరోహీరోయిన్లుగా వి.వి.వినాయక్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఇంటిలిజెంట్'. సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై.లి. బ్యానర్‌పై సి.కళ్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. ఈ సందర్భంగా హీరో సాయిధరమ్‌తేజ్‌తో ఇంటర్వ్యూ విశేషాలు...



• సాయిధరమ్‌తేజ్

❑ అదే సినిమా కాన్సెప్ట్...

మనం జీవితంలో ఎదగడానికి కొందరు చాలా సహాయం చేస్తారు. అలాంటి వాళ్లు కష్టాల్లో ఉన్నప్పుడు వాళ్లకు మనం కూడా సహాయం చేయాలి. ఆ సాయం చేయడానికి ఎంత దూరమైనా వెళ్లాలి. ఇదే సినిమా కాన్సెప్ట్.

❑ తన వాళ్ల కోసం పోరాటం...

సినిమాలో నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా కనిపిస్తాను. మంచి వాతావరణంలో పనిచేసే ఆ కుర్రాడు కొన్ని కారణాల వల్ల బయటికొచ్చి తన వాళ్ల కోసం ఎలా పోరాడుతాడు, కష్టాలను ఎలా తప్పించుకుంటాడు అనేదే ఈ చిత్రం.

❑ చాలా సంతోషంగా ఉంది...

స్టార్ డైరెక్టర్ వి.వి.వినాయక్‌తో ఈ సినిమా చేస్తానని అస్సలు ఊహించలేదు. 'ఖైదీ నంబర్ 150' వంటి బిగ్గెస్ట్ హిట్‌ను తెరకెక్కించిన తర్వాత ఆయన నాతో ఈ సినిమా చేశారు. నన్ను పిలిచి మరీ ఈ సినిమా చేయడం ఆయన గొప్పతనం. ఆయనతో పని చేసినందుకు చాలా సంతోషంగా ఉంది.

❑ మంచి కథ ఉండాల్సిందే...

నేను ఈ సినిమా చేయడానికి మొదటి కారణం దర్శకుడు వినాయక్. అలాగే కథ నచ్చడం రెండో కారణం. ఏ సినిమాకైనా మంచి కథ ఉండాల్సిందే. అన్ని కమర్షియల్ అంశాలతో సినిమా అద్భుతంగా రూపుదిద్దుకుంది.

❑ భిన్నమైన సినిమాలు చేస్తా...

భిన్నమైన సినిమాలు చేసి ప్రేక్షకులను అలరించాలని కోరుకుంటాను. కానీ నా దగ్గరకు వచ్చే వాళ్లు కమర్షియల్ సినిమాలతోనే వస్తున్నారు. అందుకే అవే చేస్తున్నాను. అవకాశం వస్తే తప్పకుండా భిన్నమైన సినిమాలు చేస్తాను.

❑ అందుకే అవి నచ్చలేదు...

గతంలో నేను చేసిన కొన్ని సినిమాలు పరాజయం పాలు కావడానికి కారణం అవి ప్రేక్షకులకు సరిగ్గా కనెక్ట్ కాకపోవడమే. అదేవిధంగా కథ, కథనం మేము అనుకున్నది అనుకున్నట్టుగా స్క్రీన్‌పై రాకపోవడంతో అవి ప్రేక్షకులకు నచ్చలేదు.

❑ దర్శకుల డిమాండ్‌వల్లే...

నా సినిమాల్లో మావయ్య చిరంజీవి పాటలు రీమిక్స్ చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. అయితే దర్శకుల డిమాండ్‌వల్లే ఆ పాటల్ని రీమిక్స్ చేయాల్సి వస్తోంది.

❑ పైరసీని ప్రోత్సహించవద్దు...

నా సినిమా శుక్రవారం, వరుణ్‌తేజ్ సినిమా శనివారం విడుదలవుతున్నాయి. మెగా అభిమానులంతా రెండు సినిమాల్ని థియేటర్లలోనే చూడండి. పైరసీని ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రోత్సహించవద్దు.

ఆ హీరోతో రెండో సినిమా?



• రష్మిక మండన్న

రష్మిక మండన్న... ప్రస్తుతం టాలీవుడ్‌లో బాగా వినిపిస్తున్న పేరు. గత వారం విడుదలైన యంగ్ హీరో నాగశౌర్య 'ఛలో' చిత్రంతో ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది ఈ కన్నడ భామ. సినిమాలో ఆమె నటనకు తెలుగు ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. ఈ సినిమా విడుదల కాకముందే తెలుగులో యంగ్ స్టార్ విజయ్ దేవరకొండతో పరుశురామ్ దర్శకత్వంలో ఓ సినిమాకు సైన్ చేసిన ఈ బ్యూటీ ఇప్పుడు మరో సినిమా కూడా చేసే అవకాశాలున్నాయని తెలిసింది. 'పెళ్లిచూపులు' చిత్ర నిర్మాత యష్ రంగినేని నిర్మాణంలో విజయ్ దేవరకొండ ఒక చిత్రాన్ని చేయనున్నాడు. ఈ సినిమాను నూతన దర్శకుడు భరత్ కమ్మ డైరెక్ట్ చేయనున్నాడు. కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సినిమాలో రష్మిక అయితే బాగుంటుందని దర్శక నిర్మాతలు భావిస్తున్నారట. కాబట్టి అన్నీ కుదిరితే రష్మిక రెండోసారి విజయ్ సరసన నటించవచ్చు.

పెళ్లికి అదే కారణం కాదు కదా

అటు కమర్షియల్ సినిమాలు, ఇటు లేడీ ఓరియెంటెడ్ సినిమాలను చేసుకుంటూ సౌత్‌లో లేడీ సూపర్‌స్టార్‌గా పేరు తెచ్చుకుంది అనుష్క. ఆమెలా సుదీర్ఘ కాలం పాటు హీరోయిన్లుగా రాణించిన వారున్నప్పటికీ రెండు విధాలుగా రాణిస్తూ కెరీర్‌ను కొనసాగిస్తున్న వాళ్లు మాత్రం లేరు. తాజాగా ఆమె 'భాగమతి'తో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది. అయితే ఈమధ్య స్వీటీ ఎక్కడికెళ్లినా ఆమెకు ఎదురవుతున్న ప్రశ్న పెళ్లి ఎప్పుడనే. ఈ బ్యూటీ పెళ్లి గురించి పెద్దగా మాట్లాడటం లేదు కానీ... పిల్లలంటే మాత్రం తనకు చాలా ఇష్టమంటోంది. అసలు తన పెళ్లి గురించి మరీ ఎక్కువగా ఆలోచించవద్దని అభిమానులకు ఉచిత సలహా కూడా ఇస్తోంది. తన పెళ్లి గురించి వచ్చే ఊహాగానాలను కూడా పెద్దగా పట్టించుకోవద్దని అంటోంది. ''నాకు పిల్లలంటే భలే ఇష్టం. కానీ అదొక్కటే పెళ్లి చేసుకోవాలని అనుకోవడానికి కారణం కాదు కదా. నేను ఎప్పుడు పెళ్లి చేసుకోవాలనుకున్నా వెంటనే అందరికీ చెప్పేస్తా. ఈలోగా ఫలానా వాళ్లతో నా పెళ్లి అంటూ వచ్చే రూమర్లను పట్టించుకోవాల్సిన అవసరం లేదు''అని అంటోంది అనుష్క. ఇక 36 ఏళ్ల వయసులో ఉన్న ఈ భామ ఇప్పటికీ పెళ్లి గురించి పెద్దగా ఆలోచించడం లేదు. అయితే ఆమె త్వరలో పెళ్లి చేసుకోబోతోందని... సినిమాలకు స్వస్తి చెప్పనుందని ఇటీవల పలు వార్తలు వినిపించాయి. మరి చివరకు అనుష్క పెళ్లి ఎప్పుడు అనేది తెలియాలంటే కొంత కాలం ఆగాల్సిందే.



• అనుష్క

'దండుపాళ్యం-3' వస్తోంది

విభిన్నమైన కథాంశంతో, సహజమైన సన్నివేశాలతో, భావోద్వేగమైన నటనతో 'దండుపాళ్యం' చిత్రాలు మంచి క్రేజ్ సంపాదించుకున్నాయి. ఇదే ఊపులో ఇప్పుడు 'దండుపాళ్యం 3' చిత్రం కూడా విడుదలకు సిద్ధమైంది. శ్రీనివాసరాజు దర్శకత్వంలో రూపొందిన ఈ సెన్సేషనల్ సినిమా మార్చి 2న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. బొమ్మాళి రవిశంకర్, పూజా గాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవికాలే ఇందులో ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమా రైట్స్‌ను శ్రీ వాడపల్లి వెంకటేశ్వర క్రియేషన్స్ సొంతం చేసుకుంది. సాయికృష్ణ ఫిల్మ్స్ సమర్పణలో నిర్మాతలు శ్రీనివాస్ మీసాల, రజనీ తాళ్లూరి సంయుక్తంగా ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ ''దండుపాళ్యం సిరీస్‌లో భాగంగా వచ్చిన చిత్రాలు ఎంతటి సంచలన విజయం సాధించాయో తెలిసిందే. ఇప్పుడు ఈ సిరీస్‌లో భాగంగా 'దండుపాళ్యం 3' రాబోతోంది. దర్శకుడు శ్రీనివాసరాజు కథ,కథనం అద్భుతంగా ఉంటాయి. సహజమైన సన్నివేశాలు మైమరపిస్తాయి. భావోద్వేగపూరిత డైలాగులతో ఈ కథ సాగుతుంది. ఈ చిత్రం ట్రైలర్‌కు అనూహ్య స్పందన వచ్చింది. అయితే దండుపాళ్యం సిరీస్‌లో ఇదే చివరి పార్టు కావడంతో అసలు క్లైమాక్స్ ఎలా ఉండబోతోందో అనే ఆసక్తి అందరిలో ఉంది. త్వరలోనే భారీగా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను చేయబోతున్నాం. మార్చి 2న ప్రపంచవ్యాప్తంగా 'దండుపాళ్యం 3' చిత్రాన్ని తెలుగులో విడుదల చేయబోతున్నాం''అని అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః వెంకట్ ప్రసాద్, సంగీతంః అర్జున్ జన్యా, ఎడిటింగ్ః రవిచంద్రన్.



• పూజా గాంధీ

16న 'సోడా గోలీసోడా'



నిత్య నరేష్, మానస్

మానస్, నిత్య నరేష్, కారుణ్య హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'సోడా గోలీసోడా'. ఎస్.బి. ఆర్ట్ క్రియేషన్స్ పతాకంపై చక్రసీడ్ సమర్పణలో మల్లూరి హరిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈనెల 16న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్మాత భువనగిరి సత్య సింధూజ మాట్లాడుతూ ''పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రంగా 'సోడా గోలీసోడా' రూపుదిద్దుకుంది. ఈ చిత్రంలో అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే కంటెంట్ ఉంది. కమర్షియల్ విలువలతో ఎక్కడా రాజీపడకుండా ఈ చిత్రాన్ని నిర్మించాము. దర్శకుడు అద్భుతంగా చిత్రాన్ని తీర్చిదిద్దాడు. సెన్సార్ పూర్తయి సినిమాకు క్లీన్ యు సర్టిఫికెట్ వచ్చింది. ఈనెల 16న చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాము''అని అన్నారు. బ్రహ్మానందం, అలీ, కృష్ణ భగవాన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః ముజీర్ మాలిక్, సంగీతంః భరత్, ఎడిటర్ః నందమూరి హరి.

చారిత్రక చిత్రం షూటింగ్‌లో...

హాట్‌బ్యూటీ సన్నీలియాన్ ప్రస్తుతం కథలను ఎంచుకుంటున్న తీరు నిజంగా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. నీలి చిత్రాల నుంచి వచ్చిన ఈ భామ ఇండియన్ సినిమాల్లోకి అడుగుపెట్టినప్పుడు గ్లామరస్ రోల్స్ మాత్రమే చేసింది. కానీ ఇప్పుడు ఏకంగా లేడీ ఓరియెంటెడ్ సినిమాలు చేయడానికి సిద్ధమైంది. ప్రస్తుతం ఆమెకు ఆఫర్లు చాలా వస్తున్నప్పటికీ నటిగా ప్రాధాన్యం ఉంటేనే ఒప్పుకుంటోంది. ఇక అసలు విషయానికొస్తే... ఈ భామ ఒక చారిత్రాత్మక చిత్రంలో నటిస్తున్నట్టు గతంలో వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు 'వీర మహాదేవి' అనే టైటిల్‌తో రూపొందే ఈ సినిమా షూటింగ్ చెన్నైలో మొదలైంది. దర్శకుడు వి.సి.వడిఉడయన్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ్, మలయాళం, హిందీ భాషల్లో తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్ కోసం సన్నీ ఏకంగా 150 రోజుల కాల్షీట్స్ ఇచ్చిందట. ఇంతకుముందు నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఈ భామ సినిమాలోని యుద్ధపు సన్నివేశాల కోసం గుర్రపుస్వారీ, కత్తియుద్ధాలలో బాగా శిక్షణ తీసుకుందట.





గూగుల్‌పై రూ.136 కోట్ల జరిమానా

న్యూఢిల్లీ : నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందుకు గాను సెర్చ్ ఇంజిన్ దిగ్గజం గూగుల్‌పై దేశీయ యాంటీట్రస్ట్ వాచ్‌డాగ్ కొరఢా ఝులిపించింది. గూగుల్‌పై రూ.136 కోట్ల జరిమానాను విధించింది. ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన ఇంటర్నెట్ సెర్చ్ ఇంజిన్ గూగుల్ పక్షపాత విధానాలను అవలంభించిందని సిసిఐ(కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా) పేర్కొంది. గూగుల్‌కు చెందిన ఆల్ఫాబెల్ కంపెనీ వెబ్‌సెర్చ్‌లో, అడ్వర్టైయిజ్‌మెంట్స్‌లో పైచేయి సాధించేందుకు ప్రయత్నించిందని, ఈ కారణంగా పోటీ సంస్థలు, వినియోగదారులు నష్టపోయారని సిసిఐ చెప్పింది. ఈ మేరకు గూగుల్‌కు రూ. 136 కోట్ల జరిమానా విధించినట్లు వెల్లడించింది. అరవై రోజుల్లోగా గూగుల్ ఈ జరిమానాను చెల్లించాల్సివుంటుందని చెప్పింది. సెర్చింగ్‌లో పక్షపాత వైఖరి విషయమై విమర్శలు గతం నుంచి ఉన్నాయి. వాటిని బహిరంగం చెప్పి పోరాటం చేసే వారు లేరు. అయితే తాజాగా కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఈ నిర్ణయం తీసుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

బాటా బ్రాండ్ అంబాసిడర్‌గా స్మృతి



న్యూఢిల్లీ: ఫుట్‌వేర్ దిగ్గజ సంస్థ బాటా ఇండియా అంబాసిడర్‌గా మహిళా క్రికెట్ జట్టు క్రీడాకారిణి స్మృతి మంధన ఎంపికయ్యారు. ఈమేరకు బాటా కంపెనీ ప్రకటించింది. కంపెనీకి చెందిన కొత్త ఉత్పత్తుల ప్రచారంలో మంధన భాగం కానున్నారని బాటా ఇండియా కంట్రీ మేనేజర్ సందీప్ కటారియా తెలిపారు.

ఆర్‌బిఐ వడ్డీ రేట్లను పెంచే వరకు బ్యాంకులు ఆగేలా లేవు

న్యూఢిల్లీ: దేశీయ ఆర్థిక వ్యవస్థ కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. బాండ్ ఆర్జన పెరగడం, వాటి లాభాల నియంత్రణకు మరిన్ని కేటాయింపుల అవసరం వంటి ప్రమాదాల వల్ల ఆర్‌బిఐ రిజర్వు బ్యాంక్ (ఆర్‌బిఐ) వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించింది. అయితే ఆర్‌బిఐ వడ్డీ రేట్లను పెంచేంత వరకు ఆగే పరిస్థితి లేదని బ్యాంకింగ్ వర్గాలు అంటున్నాయి. ఇప్పటికే దేశీయ రెండో అతిపెద్ద ప్రైవేటు రంగ దిగ్గజం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ కొన్ని రేట్లను 10 బేసిస్ పాయింట్ల మేరకు పెంచింది. వరుసగా మూడోసారి కూడా 6 శాతం రెపో రేటు(బ్యాంకులకు ఆర్‌బిఐ ఇచ్చే రుణాలపై వడ్డీ రేటు)నే నిర్ణయించింది. బుధవారం ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ ఆధ్వర్యంలోని ఎంపిసి(ద్రవ్య విధాన కమిటీ) రెపోరేటు యథాతథంగా 6 శాతం కొనసాగించింది. కమిటీలో ఐదుగురు సభ్యులు సానుకూలంగా, ఒక్కరు వ్యతిరేకంగా ఓటు వేశారు. చమురు ధరల పెరుగుదల, ప్రభుత్వ ఉద్యోగాల జీతాల పెంపు వల్ల ద్రవ్యోల్బణం పెరిగే అవకాశముందని ఆర్‌బిఐ పేర్కొంది. అలాగే 2018–19 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలోనూ ద్రవ్యోల్బణం 5.1 నుంచి 5.6 శాతం వరకు ఉండే అవకాశముందని అభిప్రాయపడుతోంది. గత ఆగస్టు నెలలో మాత్రమే ఆర్‌బిఐ 0.25 శాతం మేరకు వడ్డీ రేటును తగ్గించడంతో 6 శాతానికి తగ్గింది. ఆ తర్వాత ఇప్పటివరకు వడ్డీ రేటులో ఎలాంటి మార్పు చేయలేదు. డిసెంబర్ సమీక్షలో ధర పెరుగుదల ఆందోళనల కారణంగా ఎంపిసి బెంచ్‌మార్క్ వడ్డీ రేట్లను తటస్థంగానే కొనసాగించింది.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	34413.16	330.45	0.97%
నిఫ్టీ	10576.85	100.15	0.96%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	28580	30566.84	–1.07%
ముంబై	29690	31754.01	–1.07%
ఢిల్లీ	28900	30909.09	–2.2%
కోల్‌కతా	29600.99	31658.81	–0.57%
కేరళ	27800	29732.62	–0.71%
బెంగళూరు	28050	30000.00	–2.26%
హైదరాబాద్	28600	30588.24	–0.94%
గల్ఫ్	1402.97	1500.50	–0.65%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	42600.00	42400.00	0.47
ముంబై	42600.00	42400.00	0.47
ఢిల్లీ	42600.00	42400.00	0.47
కోల్‌కతా	42600.00	42400.00	0.47
హైదరాబాద్	42600.00	42400.00	0.47



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	345	విశాఖపట్నం	355
వరంగల్	347	చిత్తూరు	373
విజయవాడ	350	చెన్నై	380
గోదావరి	350	బెంగళూరు	365

కార్లు, బైక్‌లు సందడే సందడి



గురువారం గ్రేటర్ నోయిడాలో ఆటో ఎక్స్‌పో 2018ను ప్రారంభోత్సవం చేస్తున్న కేంద్రమంత్రి అనంత్, తదితరులు

- గ్రేటర్ నోయిడాలో ఆటో ఎక్స్‌పో–2018 రెండో రోజు
- ఈనెల 9 నుంచి 14 వరకు సందర్శన
- ప్రారంభోత్సవం చేసిన కేంద్రమంత్రి అనంత్ ఎస్ గీతె
- ప్రత్యేక ఆకర్షణగా ఎలక్ట్రిక్ వాహనాలు

న్యూఢిల్లీ: గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో మార్ట్ వద్ద 'ఆటో ఎక్స్‌పో 2018'ను కేంద్ర భారీ పరిశ్రమల శాఖమంత్రి అనంత్ ఎస్ గీతే గురువారం ప్రారంభోత్సవం చేశారు. ఈనెల 14వరకు ఆటో ఎక్స్‌పో నిర్వహిస్తారు. దేశ విదేశాలకు చెందిన ఆటోమొబైల్ సంస్థలు తమ ఉత్పత్తులను ఇక్కడ సందడి చేయనున్నాయి. మారుతీ సుజుకీకి చెందిన ఫ్యూచర్ ఎస్, హోండా న్యూ అమేజ్, హుందయ్‌కు చెందిన ఎలైట్ ఐ20ను బుధవారం ప్రదర్శించారు. వందలాది వాహనాలు సందడి చేయనుండగా, ఈసారి ఎలక్ట్రిక్ వాహనాలు ప్రత్యేక ఆకర్షణగా మారనున్నాయి. 2018 ఆటో ఎక్స్‌పో ప్రీ ఓపెన్ ఈవెంట్ బుధవారం ప్రారంభమవగా.. ముందస్తుగా ఈ కార్యక్రమానికి మీడియా, వాణిజ్య ప్రముఖులను మాత్రమే ఆహ్వానించారు. శుక్రవారం నుంచి పూర్తిస్థాయిలో ఎక్స్‌పో మొదలవుతుంది. ఈ నెల 14 వరకు ప్రజల సందర్శనకు అనుమతిస్తారు. ఇప్పటికే మారుతి సుజుకీ, హ్యుందాయ్, టాటామోటార్స్, మహీంద్రా లాంటి దేశీయ కంపెనీలతో పాటు, కియా మోటార్స్, బెంజ్, టయోటా, కవాసకీ లాంటి విదేశీ సంస్థలు కూడా కొత్తకొత్త మోడళ్లను ఇక్కడ ప్రదర్శనకు ఉంచాయి.

ఎమ్‌ఫ్లక్స్ మోటార్స్ తొలి ఎలక్ట్రిక్ సూపర్‌బైక్



దేశీయ స్టార్టప్ కంపెనీ ఎమ్‌ఫ్లక్స్ మోటార్స్ తొలి ఎలక్ట్రిక్ సూపర్‌బైక్‌ను ఆవిష్కరించింది. ఎమ్‌ఫ్లక్స్ వన్ పేరుతో రూపొందించిన ఈ బైక్ గంటకు 200 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణిస్తుంది. త్వరలోనే దీన్ని మార్కెట్లోకి విడుదల చేయనున్నారు. ఈ ఏడాది జులైలో ఈ సూపర్‌బైక్ ముందస్తు ఆర్డర్లు ప్రారంభం కానున్నాయి. దీని ధర రూ.5.5లక్షల నుంచి రూ. 6లక్షల వరకూ ఉండనుంది. ఇంకా ధర వివరాలను వెల్లడించలేదు. 2019 ఏప్రిల్ నుంచి డెలివరీని ప్రారంభించనున్నారు. ఈ బైక్‌లను ఆన్‌లైన్ ద్వారానే విక్రయించనున్నట్లు సంస్థ ఈ సందర్భంగా పేర్కొంది.

మారుతీ సుజుకీ నుంచి కొత్త స్విఫ్ట్ హ్యాచ్‌బ్యాక్



మారుతీ సుజుకీ మూడో జనరేషన్‌కు చెందిన కొత్త స్విఫ్ట్ హ్యాచ్‌బ్యాక్‌ను లాంచ్ చేసింది. ఈ కొత్త వెహికిల్ ధర రూ.5 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. ఈ కొత్త స్విఫ్ట్ పాత దానికి కంటే మరింత ప్రీమియంగా ఉండనుంది. 1.21 విటివిటి పెట్రోల్ ఇంజిన్‌ను ఇది కలిగి ఉంది. పాత స్విఫ్ట్ కంటే 7.8 శాతం ఎక్కువ మైలేజ్‌ను అందిస్తోంది.
డీజిల్ డిడిఐఎస్ 190 ఇంజిన్‌ను కూడా ఇది కలిగి ఉంది. పాత దానికంటే 12.7 శాతం ఎక్కువ మైలేజ్‌ను ఈ కొత్త స్విఫ్ట్ ఆఫర్ చేస్తోంది. ఆటో గేర్ స్విఫ్ట్ టెక్నాలజీతో రూపొందించగా, ఐదో జనరేషన్ హార్ట్‌టెక్ట్ ప్లాట్‌ఫామ్‌పై మారుతీ సుజుకీ దీన్ని అభివృద్ధి చేసింది.



ఆటో ఎక్స్‌పోలో డిసి టిసిఎ కారును ఆవిష్కరిస్తున్న బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా



లోహియా ఆటోకు చెందిన ఇ–ఆటో కంఫర్ట్ హెచ్‌ఎస్



ప్రపంచంలో తొలి గేర్డ్ ఎలక్ట్రిక్ క్రూజర్ రెనగేడ్ థ్రోర్‌ను ప్రారంభించిన యుఎం మోటార్స్



హ్యూందయ్ కొత్త కారు ఎలైట్ ఐ20లో బాలీవుడ్ సూపర్ స్టార్ షారుఖ్ ఖాన్

వరుస నష్టాలకు బ్రేక్

- కొనుగోళ్ల జోరుతో పైపైకి ఎగసిన మార్కెట్లు
- 330 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్



ముంబై : వారం రోజుల పాటు ఇన్వెస్టర్లను బెంబేలెత్తించిన స్టాక్‌మార్కెట్లకు బ్రేక్ పడింది. ఇటీవల నాలుగు రోజులుగా భారీ పతన బాటలో సాగిన మార్కెట్లలో ఒక్కసారిగా ట్రెండ్ మారింది. అంతర్జాతీయ మార్కెట్లు తిరిగి లాభాల్లోకి చేరుకోవడం, ఆర్‌బిఐ వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించడం, ఇన్వెస్టర్ల కొనుగోళ్లతో సూచీలు రోజు మొత్తం స్థిరమైన ర్యాలీ చేశాయి. ట్రేడర్లు, ఇన్వెస్టర్లు అన్ని రంగాలలోనూ కొనుగోళ్లకు ఆసక్తి చూపడంతో మార్కెట్లు ఊపందుకున్నాయి. రోజంతా భారీ లాభాలతో కదిలి చివరికి పటిష్టంగా ముగిశాయి. సెన్సెక్స్ 330 పాయింట్లు లాభపడి 34,413 వద్ద ముగిసింది. మరోవైపు నిఫ్టీ 100 పాయింట్లు పెరిగి 10,577 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఇలో అన్ని రంగాలూ లాభపడ్డాయి. అయితే ఫార్మా రంగం అత్యధికంగా 3.7 శాతం జంప్ చేసింది. ఆ తర్వాత పిఎస్‌యు బ్యాంక్స్, రియల్టీ సెక్టార్లు లాభాల జోరును చూపాయి. ఈ బాటలో మెటల్, ఐటీ, ఆటో రంగం కూడా 1.2 శాతం మేరకు బలపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో సిప్లా 8 శాతం దూసుకెళ్లింది. అంబుజా, సన్ ఫార్మా, ఇన్‌ఫ్రాటెల్, ఐబి హౌ సింగ్, డాక్టర్ రెడ్డీస్, ఎస్‌బిఐ, యుపిఎల్, ఇన్ఫోసిస్, అల్ట్రాటెక్ లాభాలతో దూసుకెళ్లాయి. అరబిందో, ఎన్‌టిపిసి, ఓఎన్‌జిసి, అదానీ పోర్ట్స్, ఐటిసి, టాటా మోటర్స్, హిందాల్కో 1 శాతం నుంచి 2.5 శాతం మధ్య నష్టపోయాయి. మా ర్కెట్ల ఊపుతో చిన్న షేర్లూ జోరందుకున్నాయి. బిఎస్‌ఇలో మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 2 శాతం స్థాయిలో ఎగశాయి. ట్రేడైన మొత్తం షేర్లలో 2173 లాభ పడగా, 639 షేర్లు నష్టపోయాయి. నగదు విభాగంలో బుధ వారం ఎఫ్ పిఐ(విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు) రూ. 1022 కోట్లకుపైగా విలువైన స్టాక్స్ విక్రయించారు. మరోవైపు దేశీ ఫండ్స్ రూ. 461 కోట్లను ఇన్వెస్ట్ చేశారు.



మేధో సంపత్తిలో భారత్ ర్యాంకు 44

వాషింగ్టన్ : అంతర్జాతీయ మేధో సంపత్తి(ఐపి) సూచీలో భారత్ ర్యాంక్ ఆశించిన స్థాయిలో లేదు. తాజాగా 50 దేశాల జాబితాలో భారత్ చిట్టచివరన 44వ స్థానంలో ఉంది. ఈమేరకు జిఐపిసి(గ్లోబల్ ఇన్నోవేషన్ పాలసీ సెంటర్) నివేదికలో పేర్కొంది. మేధో సంపత్తిలో ఇండియా గత కొంత కాలంగా వెనుకబడే ఉంది. గత ఏడాదిలో ఇదే సూచీలో 45 దేశాల జాబితాలో 43వ స్థానంలో భారత్ నిలిచింది. అయితే గతేడాదితో పోలిస్తే భారత్ స్కోరు కాస్త మెరుగుపడింది. 2017లో భారత స్కోరు 8.4 పాయింట్లు ఉండగా.. ఇప్పుడు అది 12.03 పాయింట్లకు పెరిగింది. ఇక 37.98 పాయింట్లతో ఈ జాబితాలో అమెరికా మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో బ్రిటన్ 37.97 పాయింట్లు, మూడో స్థానంలో స్వీడన్ 37.03 పాయింట్లు ఉన్నాయని అమెరికా చాంబర్ ఆఫ్ కామర్స్ తెలిపింది. కంప్యూటర్ ద్వారా చేసే ఆవిష్కరణల్లో సానుకూల సంస్కరణలతో పాటు మేధో సంపత్తిపై అవగాహన సదస్సులు నిర్వహించడం, సాంకేతికంగా శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం వల్ల భారత స్కోరు కాస్త మెరుగుపడిందని నివేదిక పేర్కొంది. భవిష్యత్‌లో ఇలాంటివి భారత్ మరిన్ని చేయాల్సిన అవసరముందని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా 50 దేశాల ఆర్థిక వ్యవస్థల్లోని సృజనాత్మక అభివృద్ధి, ట్రేడ్ మార్క్, కాపీరైట్, వాణిజ్య రంగ భద్రత తదితర 40 అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ జాబితాను తయారుచేశారు.

కీలక ప్రాజెక్టులకే మొండిచేయి చూపారు : సుజనా



న్యూఢిల్లీ: బడ్జెట్ కేటాయింపులపై ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంపిలు లేవనెత్తిన అంశాలకు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ స్పందించి, వివరణ ఇవ్వాలని కేంద్ర మంత్రి, తెలుగుదేశం పార్టీ (టిడిపి) సభ్యులు వైఎస్ చౌదరి డిమాండ్ చేశారు. లోక్‌సభలో ఆయన గురువారం ప్రసంగిస్తూ ఆంధ్రపదేశ్ విభజన చట్టం కింద పోలవరం, కడప జిల్లాలో స్టీల్ ప్లాంటు, విశాఖపట్టణానికి ప్రత్యేక రైల్వే జోన్ వంటి పలు ప్రాజెక్టులకు కేంద్ర బడ్జెట్‌లో మొండి చేయి చూపారని అన్నారు. 'సంఖ్యకు కాదు సభ్యులకు మర్యాద ఇవ్వండి. 15 రోజుల్లోగా కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ ఈ అంశాలపై సమాధానం చెప్పాలి. ఇది నా సూచన' అని పేర్కొన్నారు. టిడిపి, వైఎస్ఆర్ కాంగ్రెస్ సభ్యులు వెల్ వద్ద ఆందోళన చేస్తున్న సమయంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 15 రోజుల్లోగా జైట్లీ సమాధానం ఇవ్వకపోతే ఈ అంశాలపై కనీసం రెండు గంటల పాటు సభలో చర్చించేందుకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇలాంటి డిమాండ్ చేయడంలో సభలో చాలా అరుదు. దీనికి స్పందించిన పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజలు లేవనెత్తిన ఈ అంశాల పట్ల ఎన్‌డిఎ ప్రభుత్వం చాలా సున్నితంగా వ్యవహరిస్తుందని చెప్పారు. ఆర్థిక మంత్రి ఈ అంశాలపై సభలోనే సమాధానమిస్తారని చెప్పారు.

2019లోపు పోలవరం పూర్తి : గడ్కరీ

ఢిల్లీ: పోలవరం ప్రాజెక్టును 2019లోపు పూర్తి చేస్తామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. బిజెపి ఎంపిలు కంభంపాటి హరిబాబు, గోకరాజు గంగరాజు, ఎపి మంత్రి కామినేని శ్రీనివాసరావు తదితరులు గురువారం నితిన్ గడ్కరీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గడ్కరీ మాట్లాడారు. ఎపికి ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ఆయన చెప్పారు. మునుపెన్నడూ లేనివిధంగా ఎపికి నిధులు, జాతీయ రహదారులు ఇచ్చామని ఆయన పేర్కొన్నారు. ఎపికి అన్నివిధాలా న్యాయం చేస్తామని, ఇందులో ఎటువంటి సందేహాలు లేవని ఆయన తెలిపారు.

కేంద్రమంత్రిపై భూ కబ్జా కేసు

ఢిల్లీ: కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌పై భూకబ్జా కేసు నమోదైంది. బిహార్‌లోని పాట్నా జిల్లా పరిధిలోని దనాపూర్ పోలీసు స్టేషన్‌లో ఆయనతో పాటు మరో 32మందిపై కేసు నమోదైంది. పాట్నా సివిల్ కోర్టు ఆదేశాల మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రెండెకరాల భూమిని కబ్జా చేసేందుకు మంత్రి ప్రయత్నించారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో దనాపూర్‌కు చెందిన రామ్ నారాయణ్ ప్రసాద్ ఎస్‌సి, ఎస్‌టి స్పెషల్ కోర్టులో ఫిర్యాదు చేశారు. ఐపిసితో పాటు ఎస్‌సి,ఎస్‌టి చట్టం కింద మంత్రి తదితరులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేంద్రమంత్రి గిరిరాజ్ రాజీనామా చేయాలని రాష్ట్రీయ జనతాదళ్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. గిరిరాజ్ కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రిగా పని చేస్తున్న విషయం తెలిసిందే.

తాజ్‌మహల్‌పై నివేదిక ఇవ్వండి



ఢిల్లీ: తాజ్‌మహల్ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, కార్యాచరణపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సుప్రీంకోర్టు గురువారం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాలుష్యం వల్ల తాజ్‌మహల్ అందాలు దెబ్బతింటున్నాయని, తాజ్‌మహల్ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు గురువారం విచారణ చేపట్టింది. ట్రెపీజియం జోన్‌లో ఇటీవల కార్యకలాపాలు తీవ్రంగా పెరగడంపై వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది.

లాలూ కుమార్తె, అల్లుడికి సమన్లు

న్యూఢిల్లీ: అక్రమ నగదు బదిలీ కేసులో బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె మీసా భారతి, ఆమె భర్త శైలేష్ కుమార్‌లకు గురువారం సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం సమన్లు జారీ చేసింది. ఆమె నిర్వహిస్తున్న మిషైలీ ప్యాకర్స్ అండ్ ప్రింటర్స్‌ను నిందితుల్లో ఒకరిగా పేర్కొంది. మార్చి 5న నిందితులంతా తమ ఎదుట హాజరు కావాలని సమన్లు జారీ చేసింది. ఎన్‌ఫోర్స్ డైరెక్టరేట్ దాఖలు చేసిన చార్జిషీట్‌ను ఆధారంగా ప్రత్యేక న్యాయమూర్తి ఎన్‌కె మల్హోత్రా ఆదేశాలు జారీ చేశారు. భారతి, శైలేష్‌కుమార్‌లపై గత ఏడాది డిసెంబర్ 23న అడ్వకేట్ నితీశ్ రానా ద్వారా ఇడి తుది నివేదికను దాఖలు చేసింది. అక్రమ నగదు బదిలీ కేసుకు సంబంధించి మీసాభారతి, శైలేష్‌కుమార్‌కు చెందిన దక్షిణ ఢిల్లీలోని ఓ ఫాం హౌజ్‌ను గతంలోనే ఇడి సీజ్ చేసింది. ఈ కేసులో జైన్ బ్రదర్స్‌కు నగదు బదిలీకి సహకరించిన చార్టెడ్ అకౌంటెంట్ రాజేశ్ అగర్వాల్‌నూ అరెస్ట్ చేసింది. రూ.1.2 కోట్ల మనీ లాండరింగ్ కేసులో జైన్ బ్రదర్స్, అగర్వాల్, భారతి, శైలేష్ కీలక వ్యక్తులని ఇడి ఆరోపించింది. డొల్ల కంపెనీల సృష్టించి కోట్లాది రూపాలయల నగదు చెలామనీ చేసినట్లు వారు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.


రాష్ట్ర ప్రభుత్వాల జోక్యం తగదు

న్యూఢిల్లీ: ప్రైవేటు సంస్థలు నిర్వహించే లేదా స్పాన్సర్ చేసే అధికారిక కార్యక్రమాల్లో జోక్యం చేసుకోవద్దని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఈ విషయంలో పార్లమెంటరీ కమిటీ అందించిన నివేదిక ఆధారంగా కేంద్రం ఈ సూచనలు చేసింది. 'లోక్‌సభ సభ్యుల పట్ల ప్రభుత్వ అధికారుల ప్రోటోకాల్ నిబంధనల ఉల్లంఘున, ధిక్కారపూరిత వ్యవహారశైలి'పై ఏర్పాటు చేసిన కమిటీ' ఈ మేరకు జనవరి 4న నివేదికను అందజేసింది. ప్రైవేటు సంస్థలు నిర్వహించే లేదా స్పాన్సర్ చేసే అధికారిక కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వాలు దూరంగా ఉండాలని నివేదికలో కమిటీ సూచనలు చేసింది. అధికార యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం, లోక్‌సభ సభ్యుల మధ్య వ్యవహారాలపై సూచనలు, మార్గదర్శకాలను సూచించింది. 'అన్ని మంత్రిత్వశాఖలు/వివిధ శాఖలు ఈ కనీస మర్యాదలు, సూచనలను తప్పనిసరిగా పాటించాలి. ఈ మార్గదర్శకాలను ఉల్లంఘించే వారిపై కఠినచర్యలు తప్పవు' అని అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

త్రుటిలో తప్పిన విమాన ప్రమాదం

చెన్నై: చెన్నైలోని అంర్జాతీయ విమానాశ్రయంలో ఓ విమానానికి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. చెన్నై నుంచి ఢిల్లీకి వెళ్లాల్సిన స్పైస్‌జెట్ విమానం టేకాఫ్ అవుతుండగా రన్‌వే పై విమానం టైరు పేలింది. దీంతో సిబ్బంది టేకాఫ్ నిలిపేసి సురక్షితంగా తిరిగి ల్యాండ్ చేశారు. ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారని విమానాయన సంస్థ వెల్లడించింది. విమానం నుంచి అందరినీ సురక్షితంగా దించివేసి టెర్మినల్ భవనంలోకి పంపించినట్లు వెల్లడించింది. విమానానికి త్రుటిలో ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దీంతో రన్‌వేను సాయంత్రం ఆరు గంటల వరకు మూసేశారు.

ఒకేచోట 67మంది గ్యాంగ్‌స్టర్ల అరెస్టు



చైన్నై: నిజంగా ఇది చెన్నై పోలీసులకు జాక్‌పాటే. ఏమంత కష్టం లేకుం డా ఏకంగా 67మంది వాంటెడ్ క్రిమినల్స్ ఒకేచోట వీరికి దొరికిపో యారు. చెన్నైలో పేరుమోసిన గ్యాంగ్‌స్టర్ జన్మదినోత్సవాన్ని జరుపు కుంటున్నాడన్న విశ్వసనీయ సమాచారంతో ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి న పోలీసులు అతడితో పాటు 67మంది నేరస్తులను అరెస్టు చేశారు. చెన్నై శివారులోని మలయంబాక్కంలో బిన్ను ఈ జన్మదినోత్సవాన్ని జరు పుకున్నాడు. దీనికి అతని సహచరులు, మిత్రులు భారీగా హాజరయ్యారు. ఇందులో వాంటెడ్ క్రిమినల్స్ కూడా ఉన్నారు. పోలీసులు వాహ నాలను తనిఖీలు చేస్తుండగా, కొందరు నేరస్తులు దొరికారు. వారు అం దించిన సమాచారంతో పోలీసులు బర్త్‌డే జరుగుతున ప్రాంతాన్ని చుట్టి ముట్టి లోపలికి వెళ్లగా, వెతకబోయిన తీగ కాలికి తగిలినట్టుగా ఏకంగా 67మంది నేరస్తులు కనిపించారు. వారందరినీ అరెస్టు చేశారు. ఈ ఆ పరేషన్‌లో చెన్నై సిటీ పోలీసులకు పూంతమల్లి, నజారేత్‌పేట్, పూనామల్లి, మంగాడు పోలీసులు వారికి సహకరించారు. 60 మోటారు సైకిళ్లు, ఆరు విలాసవంతమైన కార్లు, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

ప్యాకేజీపై త్వరలో కార్యాచరణ

ఎపి అధికారులతో మాట్లాడుతున్నాం

- రైల్వే జోన్, పెట్రో కారిడార్‌పై సంప్రదింపులు జరుగుతున్నాయి
- లోక్‌సభలో ఆర్థికమంత్రి జైట్లీ ప్రకటన
- డిమాండ్లు పట్టించుకోలేదని ఎపి ఎంపిల ఆగ్రహం




న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ ఎంపిలు చేస్తున్న వరుస ఆందోళనపై స్పందించిన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ మళ్లీ పాత పాటే పాడారు. ఆంధ్రప్రదేశ్‌కు సాయంపై ఎలాంటి నిర్దిష్ట ప్రకటనా చేయలేదు. అయితే ఎపి డిమాండ్ల పట్ల సానుభూతితో వ్యవహరిస్తున్నామని, కొద్దిరోజుల్లో ఆ రాష్ట్రానికి అందజేయాల్సిన ప్యాకేజీ, ఆర్థిక లోటును పూడ్చే అంశంపై త్వరలో కార్యాచరణ ఉంటుందని గురువారం నాడు లోక్‌సభలో ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను ఇప్పటికే కొన్ని అమలు చేశామని, మరికొన్ని అమలు దశలో ఉన్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విభజనకు తాము మద్దతిచ్చినా ఎపి హక్కుల కోసం పోరాడామన్నారు. రాష్ట్రానికి పలు జాతీయ సంస్థలు కేటాయించామని, వాటికి నిధులు ఇస్తున్నామని, ఇంకా ఇస్తామని చెప్పారు. రాజధాని నిర్మాణానికి, వెనుకబడిన జిల్లాలకు కూడా కొన్ని నిధులను కేటాయించామని తెలిపారు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా తీసుకుని నిధులు ఇస్తున్నామన్నారు. గత నెలలో నాబార్డ్ ద్వారా నిధులు ఇవ్వాలని ఎపి సిఎం లేఖ రాస్తే అలానే చేస్తున్నామని తెలిపారు. రెవెన్యూ లోటుకు సంబంధించి ఎపి అధికారులతో కలిసి లెక్కలు వేస్తున్నామని, రైల్వే జోన్, పెట్రో కారిడార్‌కు సంబంధించి చర్చలు జరుపుతున్నాని వివరించారు. అయితే, తన ప్రసంగంలో ఎక్కడా నిర్దిష్ట ప్రకటన చేయలేదు. అదనపు నిధుల గురించి గానీ, ఇఎపిలపై గానీ స్పష్టత ఇవ్వలేదు. విద్యాసంస్థలు, పోలవరం, రాజధానిపై కచ్చితమైన హామీ ఇవ్వలేదు. దీంతో టిడిపి ఎంపిలు జైట్లీ ప్రసంగాన్ని అడ్డుతగిలారు. ఆ గందరగోళం నడుమ సభ శుక్రవారానికి వాయిదా పడింది.

సోనియాతో టిడిపి ఎంపిల మంతనాలు

విభజన హామీలను అమలు చేయాలంటూ లోక్‌సభలో టిడిపి ఎంపీల ఆందోళన కొనసాగింది. ఈ క్రమంలో గురువారం ఉదయం లోక్‌సభలో ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. సభ మొదలవగానే టిడిపి, వైసీపీ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. గోవిందా గోవిందా అంటూ టిడిపి ఎంపిలు వినూత్నంగా నినాదాలు చేశారు. ఎంపి శివప్రసాద్ ఏకంగా పూనకం వచ్చినట్లుగా చేశారు. టేబుల్‌పై ఉన్న పుస్తకాలను తీసుకుని బయటకు వెళ్లేందుకు యత్నించారు. బిజెపి నేతలు అడ్డుకోవడంతో శివప్రసాద్ అక్కడే ఉండిపోయారు. సభలో గందరగోళ పరిస్థితి నెలకొనడంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ లోక్‌సభను 12:45 గంటలకు వాయిదా వేశారు. మరోవైపు సభలోనే ఉన్న కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, ఆ పార్టీ సభాపక్ష ఉపనేత జ్యోతిరాదిత్యతో టిడిపి ఎంపిలు కేశినేని నాని, తోట నర్సింహం, రామ్మోహన్ నాయుడు మంతనాలు జరిపారు. ఎపిలో పరిస్థితిని సోనియాకు వివరించారు. తమకు మద్దతు ఇవ్వాలని ఈ సందర్భంగా వారిని కోరారు.

ఎపి అంటే లెక్కేలేదు: బాబు



ఎపి అంటే కేంద్రానికి లెక్కలేనితనంగా ఉన్నప్పుడు పోరాడాల్సిందేనని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. దుబాయ్ నుంచి టెలికాన్ఫరెన్స్‌లో టిడిపి ఎంపిలకు బాబు దిశానిర్దేశం చేశారు. పార్లమెంటులో నిరసనలు ఉధృతం చేయాలని ఎంపిలకు ఆదేశాలు జారీ చేశారు. పార్లమెంటులో వెనక్కి తగ్గాల్సిన అవసరం లేదని, ప్రధాని ప్రసంగంలో రాష్ట్రానికి ఉపయోగపడిందేమీ లేదని దుయ్యబట్టారు. విభజనకు లేని ఫార్ములా లోటు బడ్జెట్ భర్తీకి కావాలా అని ప్రశ్నించారు. అన్ని పార్టీల మద్దతు కూడగట్టాలని ఎంపిలకు బాబు సూచించారు. ఎపికి జరిగిన అన్యాయాన్ని అన్ని పార్టీలకు వివరించాలన్నారు. ఎపికి జరిగిన అన్యాయంపై ఎంపిలందరికీ బుక్‌లెట్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. తెలుగువారి ఆత్మగౌరవం కోసమే ధర్మపోరాటం చేస్తున్నామని వెల్లడించారు. టిడిపి ఎంపిలు పార్లమెంటులోని గాంధీ విగ్రహం వద్ద నల్లరిబ్బన్లతో నిరసన తెలిపారు.

రైతు సమస్యలు ప్రస్తావించనే లేదు

- కేంద్ర బడ్జెట్‌పై దాడిని కొనసాగిస్తున్న ప్రతిపక్షం
- ఆర్థిక సర్వేలో పేర్కొన్న అంశాల పరిష్కారంలో విఫలమైందని విమర్శ

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌పై ప్రతిపక్షం గురువారం కూడా దాడిని కొనసాగించింది. వ్యవసాయ రంగ సమస్యలు గురించి ఏమి చెప్పనేలేదని పేర్కొంది. ప్రధాని తన ప్రసంగంలో పూర్వ ప్రధానులైన ఇందిరాగాంధీ, రాహుల్ గాంధీలకు వ్యతిరేకంగా మాట్లాడారు. కానీ వారు తమ ప్రాణాలను దేశం కోసం ధారపోశారని టిఎంసి ఎంపి దినేశ్ త్రివేది అన్నారు. జిఎస్‌టి, డీమానిటైజేషన్ దేశ జిడిపిని దెబ్బతీసిందని కూడా చెప్పారు. రాష్ట్రాలకు భాగం దక్కేలా సెస్, సర్‌ఛార్జీల వల్ల లభించే ఆదాయాన్ని డివిజబుల్ పూల్‌లో ఉంచాలని ఎఐఎడిఎంకె సభ్యుడు జె.జయవర్ధన్ అన్నారు. వ్యవసాయ సమ స్యలపట్ల రాజకీయం పార్టీలు తగినంత శ్రద్ధ చూపడం లేదని శిరోమణి అకాలీదళ్‌కు మిత్రపక్షమైన ఎన్‌డిఎ సభ్యుడు ప్రేమ్ సింగ్ చందుమంత్రూ అన్నారు. బడ్జెట్ వల్ల మధ్యతరగతి వర్గం సంతృప్తంగా లేదని ఎన్‌డిఎ ఎంపి రాజన్ విచారే చెప్పారు. అభివృద్ధి ఫలాలు దేశంలోని అన్ని ప్రాంతాలకు అందడంలేదని ఆలిండియా యునైటెడ్ డెమో క్రాటిక్ ఫ్రంట్ సభ్యుడు మౌలానా చెప్పారు. బంగ్లాదేశ్‌తో అసోం సరిహద్దును మూసేయాలని కూడా ఆయన డిమాం డ్ చేశారు. పాట్నా మెట్రోను బోధ్ గయా వరకు విస్తరిం చాలని జెడి(యు) సభ్యుడు కౌశలేంద్ర కుమార్ కోరా రు. ఆర్థిక సర్వేలో పేర్కొన్న అంశాలను పరిష్కరించడంలో విఫలమైందని ఆర్ఎస్‌పి సభ్యుడు ప్రేమ్‌చంద్ చెప్పారు.

అస్తవ్యస్త పాలనతో త్రిపుర వెనుకబాటు

- ప్రధాని నరేంద్ర మోడీ



న్యూఢిల్లీ: రెండున్నర దశాబ్దాల వామపక్షాల అస్తవ్యస్త పాల న వల్ల త్రిపుర ఇంకా వెనుకబడే ఉందని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ విమర్శించారు. ఈశాన్య భారతాన్ని అభివృద్ధి పర్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు. 'కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎంతో నిజాయతీతో ఈశాన్య రాష్ట్రాల సమగ్రాభివృద్ధి కోసం పాటుపడుతోంది. కాని, త్రిపుర రాష్ట్రం వెనుకబడేవుంది. 25 ఏళ్లుగా వామపక్షాల అధ్వాన పాలనతో ఇక్కడి ప్రజలు అభివృద్ధికి దిగువనే ఉండి పోయారు' అని మోడీ వ్యాఖ్యానించారు. ఈశాన్య అభివృద్ధి కోసం గతంలో వాజ్‌పేయి ప్రభుత్వం 'ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వశాఖ'ను ఏర్పాటు చేసిందని, తమ ప్రభుత్వం కూడా ఇప్పుడు ఇక్కడి అభివృద్ధి కోసం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నదని, మౌలిక వసతులు కల్పించడం, ప్ర జల జీవన ప్రమాణాలను పెంపొందించడం కోసం కృషి చేస్తున్నదని అన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లోని వెదురు వనరుల ను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రభుత్వం రూ.1300 కోట్లతో జాతీయ వెదురు మిషన్ ఏర్పాటు చేసిందని చెప్పారు. సోనాముర సబ్ డివిజన్ పరిధిలోకి వచ్చే సిఎం మాణిక్ సర్కార్ ధన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 'మార్పు కోసం ముందుకు సాగండి, త్రిపుర సమగ్రాభివృద్ధి కోసం బిజెపి అధికారం లోకి వచ్చేందుకు ఓట్లు వేయండి' అని కోరారు.

రాహుల్ నాక్కూడా బాసే

- బిజెపి వ్యతిరేక పార్టీలతో చర్చలు జరుపుదాం
- కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ



న్యూఢిల్లీ: రాహుల్ గాంధీ తనకు కూడా బాస్ అని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు, పార్లమెంటరీ పార్టీ చైర్మన్ (సిపిపి) సోనియా గాంధీ అన్నారు. పార్టీకి పునర్ వైభవం ప్రారంభమైందని, వచ్చే ఎన్నికల్లో బిజెపిని ఓడించేందుకు భావసారూప్యత కలిగిన పార్టీలతో కలిసి పని చేస్తానని చెప్పారు. గురువారం కాంగ్రెస్ ఎంపిలతో జరిగిన సమావేశంలో సోనియా ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాహుల్ గాంధీ ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. 'ఇప్పుడు నాక్కూడా అతడే బాస్. అందులో ఎలాంటి సందేహం లేదు. మీరంతా నాతో కలిసి పనిచేసినట్లుగానే అదే నిబద్ధత, నమ్మకం, ఉత్సాహంతో తనతోనూ కలిసి పనిచేస్తారని నాకు తెలుసు' అని కాంగ్రెస్ ఎంపిలను ఉద్దేశించి అన్నారు. 'కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్‌గా నేను పార్టీ అధ్యక్షుడితో, తోటి నేతలతో కలిసి పనిచేస్తాను. బిజెపి వ్యతిరేక పార్టీలతో చర్చలు జరిపి వచ్చే ఎన్నికల్లో బిజెపిని ఓడించి భారత్‌లో ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, సహనాన్ని, ఆర్థికంగా అభివృద్ధి చెందే మార్గాన్ని పునరుద్ధరించేందుకు సహకరిస్తాను' అని సోనియా పేర్కొన్నారు. రానున్న సాధారణ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సూచించారు. దేశంలోని ప్రజలు ప్రస్తుత ప్రభుత్వం పట్ల నిరాశగా ఉన్నారని, దాన్ని తమకు మద్దతుగా మార్చుకోవాలని అన్నారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో పార్టీ తిరిగి తమ ప్రాభవాన్ని పునరుద్ధరించుకుంటుందని, గుజరాత్, రాజస్థాన్ ఎన్నికలతో ఈ ప్రక్రియ ప్రారంభమైందని సోనియా వెల్లడించారు. మోడీ ప్రభుత్వ పనితీరు ప్రచారం ఎక్కువ, పని తక్కువ అన్నట్టుగా ఉందని విమర్శించారు. అలాగే తాజా బడ్జెట్‌పైనా ఆమె విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం పార్లమెంటులో కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేసిన విషయం విదితమే.

రాంగోపాల్ వర్మకు నోటీస్



మన తెలంగాణ/హైదరాబాద్: ప్రముఖ సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మకు హైదరాబాద్ పోలీసులు షాక్ ఇచ్చారు. జిఎస్‌టి సినిమా చర్చ సమయంలో తనపై అవమానకర వ్యాఖ్యలు చేశారంటూ వర్మపై సామాజిక కార్యకర్త దేవి సిసిఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసిన కేసులో గురువారం సాయంత్రం ఆరు గంటలకు తమ ముందు విచారణకు హాజరు కావాలంటూ వర్మకు సిసిఎస్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. అయితే ముంబైలో షూటింగ్‌లో బిజీగా ఉన్నందున తనకు నోటీసులు అందలేదని, స్వయంగా హాజరుకాలేనని వర్మ వివరణ ఇచ్చారు. ఈ విషయాన్ని న్యాయవాది ద్వారా సిసిఎస్ పోలీసులకు తెలియజేశారు. వచ్చే వారం మళ్లీ నోటీసులు ఇస్తే, విచారణకు హాజరవుతానని వర్మ తెలిపారు. ఈ నేపథ్యంలో వర్మకు మళ్లీ నోటీసులు ఇవ్వడానికి సిసిఎస్ పోలీసులు సిద్ధ మవుతున్నారు. ఆ నోటీసుకు కూడా వర్మ రాకపోతే అరెస్టు వారెంట్ జారీచేసే యోచనలో అధికారులు ఉన్నారని సమాచారం.


ఎన్‌కౌంటర్‌లో నక్సల్ నేత హతం

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నక్సల్ కమాండర్ హతమయ్యాడు. దోకపార అటవీ ప్రాంతంలోని కిరుందుల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి ఘటన చోటు చేసుకుందని అదనపు ఎస్‌పి గోరఖ్‌నాథ్ బఘేల్ తెలిపారు. ఎస్‌టిఎఫ్, డిఆర్‌జి సంయుక్త బలగాలు కిరుందుల్ అటవీ ప్రాంతాన్ని చుట్టుముట్టిన భద్రతా బలగాలపై నక్సలైట్లు భారీగా కాల్పులకు పాల్పడటంతో ఎన్‌కౌంటర్ జరిగిందన్నారు. అటువైపు కాల్పులు ఆగిపోవడంతో సంఘటనా స్థలం నుంచి భద్రతా బలగాలు నక్సల్ మృతదేహం, 315 బోర్‌గన్‌ను స్వాధీనం చేసుకున్నారని ఎఎస్‌పి తెలిపారు. మృతుడు జనమిలిషియా కమాండర్ అంగామి అలియాస్ చక్రగా గుర్తించామన్నారు.

భద్రత క్యాంప్ పేల్చివేత కుట్ర భగ్నం

దంతెవాడ జిల్లాలో ఎన్‌ఎండిసి వద్ద భద్రతా క్యాంప్‌ను పేల్చివేయాలనే నక్సలైట్ల కుట్రను సిఐఎస్‌ఎఫ్ భగ్నం చేసింది. గురువారం ఉదయం బైలదిల గనులకు చెందిన బచేలి సమీపంలో 40–50 మంది నక్సలైట్లు కనిపించడంతో ఇరువురి మధ్య కాల్పులు చోటు చేసుకున్నాయని అధికారులు తెలిపారు. సిఐఎస్‌ఎఫ్ సిబ్బంది 37 రౌండ్లు కాల్పులు, పలు గ్రేనేడ్లు, బాంబులు విసరడంతో నక్సలైట్లు పారిపోయినట్లు తెలిపారు.

దేశం కతియార్ అయ్య జాగీరా?




న్యూఢిల్లీ: దేశంలోని ముస్లింలందరూ పాకిస్థాన్, బంగ్లాదేశ్ వెళ్లిపోవాలంటూ బిజెపి ఎంపి వినయ్ కతియార్ చేసిన వ్యాఖ్యలపై జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 'ఈ దేశమేమైనా కతియార్ అయ్య జాగీరా. ఇది మనందరి దేశం' అని అబ్దుల్లా ఘాటుగా వ్యాఖ్యానించారు. కతియార్‌కు ఇలాంటి చెత్త వాగుడు అలవాటేనని, రోజూ ఇలాగే మాట్లాడుతుంటారని ఆయన మండిపడ్డారు. ఇలాంటి వాళ్లు హింసను ప్రేరేపిస్తున్నారని అబ్దుల్లా దుయ్యబట్టారు. మతాలు మనకు ప్రేమ, శాంతిని వ్యాప్తి చేయాలని మాత్రమే చెబుతాయని, హింసను కాదని హితవు పలికారు. దేశంలోని ముస్లింలను పాకిస్తానీలు అని పిలిస్తే శిక్షించే విధంగా చట్టం తీసుకురావాలని ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ చేసిన వ్యాఖ్యలపై వినయ్ కతియార్ స్పందించిన విషయం తెలిసిందే.

భూ వివాదంగానే బాబ్రీ విచారణ

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ






న్యూఢిల్లీ : రామ మందిరం–బాబ్రీ మసీదు కేసును తాము పూర్తిగా ఓ భూ వివాదం కేసుగానే పరిగణించి విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. అయితే, ఈ కేసుపై ప్రతి రోజూ వాదోపవాదాలు నిర్వహించడానికి తిరస్కరించింది. '700 మందికిపై పైగా నిరుపేద కక్షిదారులు న్యాయం కోసం ఎదురు చూస్తున్నారు. వారి కేసులు కూడా చేపట్టాలి, అందుకే ఈ కేసును ప్రతి రోజూ విచారించలేం, దీన్ని పూర్తిగా ఒక భూ వివాదం కేసుగానే పరిగణిస్తాం' అని జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ కేసు విచారణకు మార్చి 14కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు, పత్రాలను ఆంగ్లంలోకి తర్జుమా చేసి కోర్టుకు సమర్పించాలని ఈ కేసులో ఉన్న పార్టీలను ఆదేశించింది. ఈ వివాదంలో అలహాబాద్ హైకోర్టులో పార్టీలు కానివారి పిటిషన్లను తర్వాత పరిశీలిస్తామని ధర్మాసనం చెప్పింది. హైకోర్టు రికార్డుల్లోని వీడియో క్యాసెట్ల కాపీలను పార్టీలకు అందజేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. నాలుగు సివిల్ దావాలపై అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై 14 అప్పీళ్లను సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం విచారిస్తున్న సంగతి తెలిసిందే.

రజినీతో కలిసే అవకాశం : కమల్

కాలమే నిర్ణయిస్తుంది : రజినీకాంత్





న్యూఢిల్లీ: ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవసరమైన పక్షంలో సూపర్‌స్టార్ రజినీకాంత్‌తో కలిసి ముందుకు సాగే ఆవకాశం ఉంటుందని తమిళ నటుడు కమల్‌హాసన్ అన్నారు. అయితే, కమల్ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన రజనీ.. రాజకీయ ప్రయాణంలో కమల్‌హాసన్‌తో కలిసి వెళ్లాలా లేదా అనేది కాలమే నిర్ణయిస్తుందని చెప్పారు. 'నేను ఇప్పటికే మీకు చెప్పాను. ఇలాంటి ప్రశ్నల న్నింటికీ కాలమే సమాధానం చెబుతుంది' అని రజినీకాంత్ అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే విషయమై తన నిర్ణయాన్ని సరైన సమయంలో వెల్లడిస్తానని చెప్పారు. వ్యవస్థ కుళ్లిపోయిందని తాను చేసిన వ్యాఖ్యలపై అది తమిళనాడా? భారతదేశమా? అని అడిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ 'అన్నిటికంటే ముందు తమిళనాడులో అని సరిచేసుకోండి' అని చెప్పారు. కమల్ ఈ నెల 21 పార్టీ ఏర్పాటును ప్రకటించి, రాజకీయ పర్యటన జరిపే యోచనలో ఉన్నారు. ముందుకు తామిద్దరం రాజకీయ పార్టీలను ప్రారంభించి, విధానాలు ప్రకటించనున్నారు.



ఎన్నికల్లో రష్యా జోక్యానికి ఆధారం ఉంది : జార్జి బుష్

వాషింగ్టన్: 2016లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా తలదూర్చిందని అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జి డబ్ల్యు బుష్ అన్నారు. ట్రంప్ గెలవడానికి క్రెమ్లిన్ తోడ్పడిందన్నారు. ఎన్నికల్లో రష్యా కలుగ జేసుకుందన దానికి స్పష్టమైన ఆధారాలున్నాయి. అయితే ఫలితాలను వారు ప్రభావితం చేశారా అన్నది వేరే ప్రశ్న అన్నారు. అబుధాబిలో గురువారం ఓ సదస్సులో మాట్లాడుతూ ఆయన ఈ విషయం చెప్పారు. 'మా ఎన్నికల విధానంలో విదేశం జోక్యం చేసుకోవడం సమస్యాత్మకం. మా ప్రజాస్వామ్యం చాలా గొప్పది. ఫలితాలను ప్రజలు నమ్మారు' అని చెప్పారు. 'మా దేశంలో ఉన్న చీలికలను రష్యా అనుకూలంగా మలుచుకుంది' అని ఆయన విమర్శించారు. 'అమెరికాలో ఒకరికొకరు వ్యతిరేకించుకునేలా రష్యా ప్రభుత్వం ఓ ప్రాజెక్ట్ చేసింది' అని బుష్ అక్టోబర్‌లోనే న్యూయార్క్‌లో చెప్పారు. అమెరికా ఎన్నికల్లో రష్యా కలుగజేసుకుందన్న విషయాన్ని ట్రంప్ పదేపదే కొట్టిపారేశారు. 'తాము కలుగజేసుకోలేదు' అని పుతిన్ తనకు స్వయంగా చెప్పారని ట్రంప్ తెలిపారు. 'సోవియట్ ఆధిపత్యం' తిరిగి సాధించేందుకు పుతిన్ చర్యలు అలాగే ఉంటున్నాయని బుష్ తన అబు ధాబి సదస్సులో చెప్పారు. ట్రంప్ ఆలోచనలకు భిన్నంగా బుష్ మాట్లాడుతూ 'అమెరికన్లు చేయకూడదనుకుంటున్న ఉద్యోగాలు వలసదారులు చేస్తున్నారు' అన్నారు. 105 ఫారిన్‌హీట్ డిగ్రీ వేడిమిలో పత్తిని అమెరికన్లు కోయాలనుకోరన్నారు.

సిరియాలో అమెరికా దాడులు

100 మంది మృతి



బీరూట్: సిరియాలో అమెరికా నేతృత్వంలోని సంకీర్ణ దళాలు అక్కడి ప్రభుత్వ దళాలపై చేసిన దాడుల్లో దాదాపు 100 మంది మృతి చెందారున. తూర్పు సిరియాలోని డెయిర్ ఎజోర్‌లో జరిగిన దాడులకు ప్రతీకారంగా అమెరికా ఈ దాడులు చేసినట్లు అమెరికా అధికారి తెలిపారు. ఇటీవల కాలంలో అత్యధిక మంది చనిపోయిన ఘటన ఇదే. డెయిర్ ఎజోర్ ప్రాంతంలో గురువారం కుర్దిష్ నేతృతంలోని సిరియన్ డెమోక్రటిక్ ఫోర్సెస్(ఎస్‌డిఎఫ్) అధీన ప్రాంతాల్లో దాడులు జరగడంతో పోరు కొన్ని కొంట గంటలపాటు కొనసాగింది. రసాయన ఆధుధాల వాడకం విషయంలో అమెరికా, సిరియా మధ్య ఉద్రిక్తతలున్న నేపథ్యంలో ఈ దాడులు జరగడం గమనార్హం. మంగళవారం రాత్రి దాడి జరిగిన ప్రాంతంలో సంకీర్ణ సలహాదారులు కూడా ఉన్నారని అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. సిరియా ప్రభుత్వ దళాలు, అమెరికా సంకీర్ణ దళాలు, ఎస్‌డిఎఫ్‌తో జరిపిన పోరులో 100కుపైగా సిరియా ప్రభుత్వ దళ సైనికులు మరణించారని, ఒక ఎస్‌డిఎఫ్ సైనికుడు కూడా గాయపడ్డాడని పేరు చెప్ప నిరాకరించిన అమెరికా మిలిటరీ అధికారి చెప్పారు. అయితే సిరియాలోని మానవ హక్కుల పరిశీలక సంస్థ ప్రకారం ఖశం సమీపంలో జరిగిన ఆరంభ దాడిలో చనిపోయింది 20 మందే. ఖశం పట్టణం డెయిర్ ఎజోర్ ప్రాంతీయ రాజధాని ఆగ్నేయంలో యూఫ్రెటస్ నది తీరంలో ఉంది. 'సిరియా డెమోక్రటిక్ దళాల(ఎస్‌డిఎఫ్) అధీనంలోని అనేక గ్రామాలపై సిరియా ప్రభుత్వ దళాలు ఫిరంగి దాడులకు పాల్పడ్డాయి' అని బ్రిటన్‌లో ఉన్న సిరియా మానవ హక్కుల పరిశీలక సంస్థ అధినేత రమీ అబ్దెల్ రహ్మాన్ తెలిపారు. సిరియా బలగాల దాడులకు దీటుగా ఎస్‌డిఎఫ్ ఎదురు దాడులు జరిపింది. తర్వాత సంకీర్ణ దళాలు కలుగజేసుకున్నాయి' అని ఆయన వివరించారు.

11న బిసి ఉపాధ్యాయ రాష్ట్ర మహాసభలు : జాజుల శ్రీనివాస్‌గౌడ్

మన తెలంగాణ/హైదరాబాద్: బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని క్రిమీలేయర్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న బిసి ఉపాధ్యాయుల రాష్ట్ర మహాసభలను హైదరాబాద్‌లోని ఫ్యాప్సీ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బిసి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుంకర శ్రీనివాసరావు తెలిపారు. ఈమహాసభకు మంత్రులు, ఎంపీలు,ఎంఎల్‌ఎలు హాజరవుతున్నారని వారు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని, పోస్టింగ్‌లు, ప్రమోషన్లలో బిసి ఉద్యోగులకు ప్రాధాన్యత కల్పించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, బిసి కమిషన్‌కు రాజ్యంగ భద్రత కల్పించాలని ఇలా పలు అంశాలపై సభలో చర్చించి తీర్మానం చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్‌కు సన్మానం



మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర హోంగార్డు సంఘం గౌరవ అధ్యక్షులు, టిఆర్‌ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్‌ను పలువురు హోంగార్డులు గురువారం ఆయన నివాసం వద్ద కలుసుకుని ఘనంగా సన్మానించారు. హోంగార్డుల సమస్యలను ముఖ్యమంత్రి కెసిఆర్ వద్దకు తీసుకెళ్లి జీతభత్యాలను పెంచేందుకు కృషిచేయడం అభినందనీయమని హోంగార్డు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రాజేందర్‌సాగర్‌లు శ్రీనివాస్‌గౌడ్‌ను ప్రశంసించారు.

గడువులోగా ప్రాజెక్టులు పూర్తి

మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రస్తుతం కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టులలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుని నిర్ణీత గడువులోగా ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జోన్‌లోని వివిధ ప్రాజెక్టుల పురోగతిపై ఆయన ఉన్నతాధికారులతో సమీక్షించారు. రైల్ నిలయంలో గురువారం జరిగిన ఈ సమావేశంలో ఎస్‌సిఆర్ అదనపు జనరల మేనేజర్ జాన్ థామస్, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ కె.వి.శివప్రసాద్, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ ఎన్.మధుసూధనరావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రైల్వే ప్రాజెక్టులకు సబంధించిన భూసేకరణ, స్థలాల కేటాయింపు, అటవీ, పర్యావరణ అనుమతులు, విద్యుత్ హైటెన్షన్ సమస్యలు, సిగ్నల్, టెలికమ్ కేబుల్స్ మార్పు తదితర అంశాలలో రైల్వే అధికారులు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో ప్రణాళికబద్ధంగా సమన్వయంతో పరిష్కరించుకోవాలని జిఎం కోరారు. ప్రాజెక్టుల పనులు సజావుగా సాగుతూ సకాలంలో పూర్తయ్యేందుకు అధికారులు ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు, నిధుల కేటాయింపు, ఖర్చులు తదితర అంశాలపై వ్యూహాత్మక ప్రణాళికలను రూపొందించుకుని అమలు చేయాలని సూచించారు. తొలుత కన్‌స్ట్రక్షన్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ విజయ్ అగర్వాల్‌తో పాటు చీఫ్ ఇంజినీర్లు వివిధ ప్రాజెక్టుల పురోగతిని జిఎంకు వివరించారు.

సమిష్టి కృషితోనే ఆర్‌టిసి అభివృద్ధి


మన తెలంగాణ/ హైదరాబాద్ : కార్మికు లు, అధికారుల సమి ష్టి కృషితోనే ఆర్‌టిసి అభివృద్ధి చెందుతున్నదని టిఎస్‌ఆర్‌టిసి మేనేజిం గ్ డైరెక్టర్ జి.వి. రమణరా వు అన్నారు. ఆర్‌టిసి రూ పొందించిన టెలిఫోన్ డైరెక్టరీని ఆయన గురువారం బస్‌భవన్లో ఆవిష్కరించారు. సంస్త ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఎం.సత్యనారాయణ, ఎం.రవీందర్‌లతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సంస్థ అధకారులలు, ఉద్యోగులతో పాటు ప్రయాణికులకు అవసరమైన టెలిఫోన్ నెంబర్లు, సంప్రదించాల్సిన సమాచారంతో డైరీని రూపొందించడం అభినందనీయమని మేనేజింగ్ డైరెక్టర్ రమణరావు అన్నారు.

బిసిల బడ్జెట్ రూ.10 వేల కోట్లు

మన తెలంగాణ/ముషీరాబాద్ : వచ్చే ఆర్థిక సంవత్స రం బడ్జెట్‌లో బిసిల బడ్జెట్ పెంచాలని కోరుతూ బిసి సంక్షేమ సంఘం నాయకులు గురువారం చీఫ్ సెక్రటరి కె.జోషిని సచివాలయంలో కలిసి కోరారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య నేతృ త్వంలో బిసి సంఘం నేతలు గుజ్జ కృష్ణ, గుజ్జ రమేష్, మల్లేష్, రామ లింగం, టిఆర్.చందర్‌లు చీఫ్ సెక్రటరికి వినతి పత్రాన్ని అంద చేసారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ వచ్చే ఆర్థిక సంవత్సరం 2018–19 వార్షిక బడ్జెట్ గురించి వివిధ శాఖలు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తుందని, బిసి సంక్షేమ శాఖ బడ్జెట్‌ను కూడా పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

కానిస్టేబుల్‌పై కేసు నమోదు

శారీరకంగా హింసిస్తూన్నాడని భార్య పిర్యాదు



మన తెలంగాణ / సికింద్రాబాద్ :గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ సంజయ్ కుమార్‌పై అతని భార్య సరిత ఫిర్యాదు చేసింది. తనను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నాడని ఆమె మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు ఐపిసి సెక్షన్ 324 కింద కేసు నమోదు చేశారు. తనను కొన్ని ఏళ్లుగా హింసిస్తూ విడాకులు కావాలని సంజయ్ కుమార్ అతని కుటు ంబ సభ్యులు వేధిస్తున్నారని ఫిర్యాదులోపేర్కొన్నట్లు తెలిపారు.భర్త వేధింపులు ఎక్కువ కావడంతో భరించలేక తాను పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సరిత తెలిపారు. తనకు న్యాయం చేయాలని ఆమె ప్రాదేయ పడిం ది. మార్కెట్ సిఐ మత్తయ్య ఆధ్వర్యంలో కేసును దర్యాప్తు చేస్తున్నారు.

అధ్యాపకులు టెక్నాలజిపై పట్టు సాధించాలి

మన తెలంగాణ/హైదరాబాద్ : మారుతున్న ఆధునిక, సాంకేతిక పరిజ్ఞాన్ని ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ టెక్నాలజీపై మంచి పట్టు సాధించాల్సిన అవసరం ఉందని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం(బిఆర్‌ఎఒయు) ఉపకులపతి ప్రొఫెసర్ కె.సీతారామారావు పేర్కొన్నారు. వర్సిటీ గ్రేడ్ విభాగం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ టీచింగ్, ఆధునిక పరిజ్ఞానం అంశాలపై మూడు రోజుల సదస్సును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో అధ్యాపకులు టెక్నాలజి పరంగా ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ కావాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో గొప్ప ర్యాంకింగ్స్ పొందుతున్న వర్సిటీల్లో టీచర్ల సంఖ్య ఎక్కువగా ఉందని, వాళ్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటి రిజిస్ట్రార్ సి.వెంకటయ్య, గ్రేడ్ డైరెక్టర్ పుష్ప చక్రపాణి, అకడమిక్ డైరెక్టర్ కిరణ్మయి, ఐసిటి ప్రొఫెసర్ కె.శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు.

సచివాలయం వద్ద అక్టోపస్ మాక్‌డ్రిల్

మన తెలంగాణ/హైదరాబాద్ : ఆక్టోపస్ పోలీసు లు గురువారం రాష్ట్ర సచివాలయం వద్ద మాక్‌డ్రిల్ నిర్వహించారు.సచివాలయంపై ఉగ్రవాదులు దాడి చేస్తే సమర్థవంతంగా ఎలా తప్పికొట్టాలో ఈ మాక్‌డ్రిల్‌లో చేసి చూపించారు. అక్టోపస్ పోలీసులు ప్రతి రోజు హైదరాబాద్‌లో ఏదో ఒక ప్రాంతంలో వరుసగా మాక్‌డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. ఇటీవల పంజాగుట్ట, సోమాజిగూడలో మాక్‌డ్రిల్ నిర్వహించిన పోలీసులు తాజాగా సచివాలయం వద్ద నిర్వహించారు. ఇలాంటి మాక్‌డ్రిల్స్ వల్ల ప్రజల్లో అవగాహన పెం పొందడంతో పాటు భరోసా కలుగుతుందని అధి కారులు పేర్కొంటున్నారు.హైదరాబాద్‌లోని ఏ ప్రాంతంలో నైనా ఉగ్రవాదులు దాడులకు తెగబడితే తిప్పి కొడుతామని అక్టోపస్ అధికారులు అంటున్నారు. అందుకు అవసరమైన శిక్షణను తమ సిబ్బందికి ఇచ్చామంటున్నారు.



బంగ్లా మాజీ ప్రధాని ఖలీదాకు ఐదేళ్ల జైలు



ఢాకా: అవినీతి కేసులో బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బిఎన్‌పి) నాయకురాలు బేగం ఖలీదా జియా(72)కు అక్కడి ప్రత్యేక న్యాయస్థానం ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. జియా అనాథల ట్రస్టుకు వచ్చిన విదేశీ విరాళాల్లో 2 కోట్ల 10 లక్షల టాకాలు(కోటి అరవై రెండు లక్షల రూపాయలు లేక 2, 52,000 అమెరికా డాలర్లు) స్వాహా చేసినందుకు న్యాయస్థానం ఐదు సంవత్సరాల శిక్ష విధించింది. ఇదే కేసులో ఆమె కుమారుడు తారిఖ్ రెహమాన్, మరి నలుగురికి10 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఖలేదా జియాకు సమాజంలో ఉన్న హోదాను, ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సెక్షన్లు 409, 109 కింద ఐదు సంవత్సారాల శిక్షను విధించినట్లు న్యాయమూర్తి మహ్మద్ అక్తేరుజ్మాన్ తెలిపారు.

తీర్పు సమయంలో ఘర్షణలు

తీర్పు సమయంలో న్యాయస్థానం వద్ద పోలీసులకు, జియా మద్దతుదారులకు మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో ఐదుగురు పోలీసులు గాయపడినట్లు అక్కడి మీడియా తెలిపింది. కోర్టుకు వెళ్లే ఢాకా రోడ్లపైకి వందలాది మంది బిఎన్‌పి కార్యకర్తలు వచ్చారు. నిరసనకారులను నిలువరించడానికి పోలీసులు భాష్పవాయువును కూడా ప్రయోగించాల్సి వచ్చింది. ఢాకా అంతటా భద్రతా ఏర్పాటు చేశారు. పోలీసులకు అవసరమైతే సాయపడ్డానికి ర్యాపిడ్ యాక్షన్ బెటాలియన్(ఆర్‌ఎబి), సాయుధ పోలీసులను మోహరించారు. ఎవరైనా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే తీవ్ర చర్యలు తీసుకుంటామని హోం మంత్రి, పోలీస్ ఐజి, డిఎంపి కమషనర్ హెచ్చరించారు.

చైనా, పాక్, సౌదీలకు మాల్దీవుల దూతలు

మాలె : దేశంలో అత్యవసరస్థితిని ఎత్తివేయాలని మాల్దీవుల అధ్యక్షుడు అబ్దుల్లా యామీన్ ప్రపంచ దేశాల నుంచి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తనకు మద్దతు కూడగట్టుకోడానికి మిత్రదేశాలైన చైనా, పాకిస్థాన్, సౌదీ అరేబియాలకు దూతలను పంపించారు.మాల్దీవులకు అత్యంత సమీపంగా ఉండే భారత్‌కు మాత్రం ఎవరిని పం పలేదు. అయితే భారత్‌లో ఉన్న మాల్దీవుల దౌత్యవేత్త అహ్మద్ మహ్మద్ విలేకరులతో ' మాల్దీవుల అధ్యక్షుడు పంపే ప్రత్యేక దూతల్లో మొదట భారత్‌కే పంపాలని అనుకున్నారు. కానీ భారత నాయకులతో భేటీ కావడానికి తేదీలు దొరకలేదు' అన్నారు. 'విదేశాంగ మంత్రి విదేశంలో ఉన్నారని, ప్రధాని నరేంద్ర మోడీ ఈ వారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్‌కు వెళ్లబోతున్నారని మాకు తెలుసు' అని ఆయన వివరించారు. మాల్దీవుల మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్‌పై పెట్టిన ఉగ్రవాద అభియోగాల నుంచి విముక్తి చేయమని, ఎనిమిది మంది

జాబితాలో భారత్ లేదు!

ప్రతిపక్ష నాయకులను విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆమోదించడానికి అబ్దుల్లా యామీన్ నిరాకరించడంతో ఈ వారం మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభం తీవ్ర రూపందాల్చింది. యామీన్ 15 రోజుల అత్యాయిక స్థితిని ప్రకటించడమేకాక, ఆ దేశ ప్రధాన న్యాయమూర్తి సహ ఇద్దరు న్యాయమూర్తులను అరెస్టు చేయించారు. మాల్దీవులకు మిత్ర దేశాలైన మూడు దేశాలు చైనా, పాకిస్థాన్, సౌదీ అరేబియా దేశాలకు తన క్యాబినెట్‌లోని ముగ్గురు సభ్యులను ప్రత్యేక దూతలుగా యామీన్ పంపించారు. బుధవారం సాయంత్రం ఆర్థికాభివృద్ధి శాఖ మంత్రి మహ్మద్ సయీద్‌ను చైనా కు, విదేశాంగ మంత్రి మహ్మద్ అసిమ్‌ను పాకిస్థాన్‌కు, గురువారం వ్యవసాయ శాఖ మంత్రి మహ్మ ద్ షైనీని సౌదీ అరేబియాకు పంపించారు.

వ్యాధుల నివారణపైనే దృష్టి : మంత్రి లక్ష్మారెడ్డి



మన తెలంగాణ / హైదరాబాద్ :వ్యాధులు వచ్చిన తర్వాత చర్యలు తీసుకోడానికి బదులుగా అవి దరిచేరకుండా ముందు జాగ్రత్త చర్యలపైనే ప్రధానమైన దృష్టిని సారించామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఉద్యోగులంతా అప్రమత్తంగా ఉండాలని, తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన అవసరముందన్నారు. త్వరలోనే ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కోఠిలోని కుటుంబ సంక్షేమశాఖ కార్యాలయ ఆవరణలో గెజిటెడ్ ఉద్యోగుల డైరీ, క్యాలెండర్‌ను ఆయన గురువారం ఆవిష్కరించిన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్యశాఖ గాడిలో పడిందని, ఇప్పుడు దేశమంతా తెలంగాణ వైద్యశాఖ వైపే చూస్తోందన్నారు. వైద్యశాఖలోని ఉద్యోగులంతా గర్వపడే సందర్భమన్నారు. ఉద్యోగులు సంతృప్తికరంగా పనిచేస్తున్నారనడాకి రాష్ట్రానికి అందుతున్న అవార్డులే నిదర్శనమన్నారు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొత్తలో ఉద్యోగులను భయంతో పనిచేయించాలంటూ సలహాలిచ్చారని, కానీ మంచితనంతో పనిచేయించడంపైనే దృష్టి పెట్టానని గుర్తుచేశారు. ప్రస్తుతం వైద్య సేవలను మెరుగుపర్చడంతో పాటు ఆధునిక వైద్య సౌకర్యాలను సమకూరుస్తున్నామని, తక్కువ సిబ్బందితో ఎక్కువ పనిచేయిస్తున్న ఉద్యోగులను మంత్రి అభినందించారు.రెండు, మూడు నెల ల్లో ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. గతంలో డైరీల ఆవిష్కరణలు ఉద్యమాల వ్యాప్తికి ఉపయోగపడేవని, కానీ ఇప్పుడు తెలంగాణ పునర్నిర్మాణానికి దోహద పడుతున్నాయన్నారు. టీజీఓ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ 'మీరంతా ఉద్యమకారులు.మిమ్మల్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. మేం ఏ స్థాయిలో ఉన్నా మీకు అండగా ఉంటాం' అన్నారు. టీజీఓ అధ్యక్షురాలు మమత, ఎమ్మెల్సీ భానుప్రసాద్,జూపల్లి రాజేందర్, జి.వేణుగోపాల్‌రెడ్డి, జె.రాములు, కె.ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మల్కాజిగిరి ఎంఆర్‌ఒపై హెచ్‌ఆర్‌సిలో ఫిర్యాదు

మన తెలంగాణ/సిటీబ్యూరో : మల్కాజిగిరి మండల తహసీల్దార్, ఓ ప్రధాన పత్రికా విలేకరిపై మానవ హక్కుల కమీషన్‌లో నేరేడ్‌మెట్‌కు చెందిన ఓ వ్యక్తి తన ఇంటి క్రమబద్ధీకరణ విషయమై ఫిర్యాదు చేశాడు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణ పథకానికి సంబంధించి ప్రవేశ పెట్టిన జి. ఒ నెం. 59 ప్రకారం నేరేడ్ మెట్‌లోని జెజె నగర్‌లో గల తన ఇంటిని క్రమబద్ధీకరించకుండా ఎంఆర్‌ఒ అశ్వక్ అహ్మద్ , నేరేడ్‌మెట్ విలేకరిగా ఓ ప్రధాన దిన పత్రికలో పని చేస్తున్న టి. మాధవ రాయుడు ఇద్దరూ కలిసి తనను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని గుణ్ణం రాంబాబు గురువారం న్యా యం కోసం హెచ్‌ఆర్‌సిని ఆశ్రయించాడు. నిబంధనల ప్రకారం సంబంధిత పత్రాలు, ప్రభుత్వం నిర్ణయించిన ఫీజును సకాలంలో డిడి రూపంలో చెల్లించినా కూడా తనకు న్యాయం జరగలేదని వేదన వ్యక్తం చేశాడు. పూర్తి హక్కుదారుడైన నన్ను తీవ్ర మానసిక వేదనకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. మాధవ రాయుడు తన ఇంట్లో అక్రమంగా ఉండడమే కాకుండా ఇంటి ముందు సిసి కెమెరాలు అమర్చుకుని ప్రశ్నించడానికి వెళ్తే తనపై ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటి కేసు పెట్టేందుకు పథకం ప్రకారం ప్రయత్నిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.అంతేకాకుండా తన పలుకుబడిని ఉపయోగించుకుని న్యాయం కోసం ఏ అధికారి వద్దకు వెళ్ళినా తనను అడ్డుకుంటున్నాడని చెప్పారు. ఎంఆర్‌ఒకూడా అతనికే వత్తా సు పలుకుతున్నాడని రాంబాబు వివరించాడు.

ఎసిపిపై ఫిర్యాదు

అధికారాన్ని అడ్డుపెట్టుకుని హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ తనను గత కొంతకాలంగా వేధిస్తున్నాడని ఓ వ్యక్తి హెచ్‌ఆర్సీలో ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన హెచ్‌ఆర్సీ కమిషన్ ఏప్రిల్ 12వ తేదీలోగా సమగ్ర విచారణ నివేదికను సమర్పించాలని గోషామహల్ ఎసిపికి ఆదేశాలు జారీ చేసింది. బాధితుడు హెచ్‌ఆర్సీకి చేసిన ఫిర్యాదు ప్రకారం.. మల్లేపల్లి ప్రాంతానికి చెం దిన వ్యాపారి సయ్యద్ నూర్(40) ఫిబ్రవరి 1వ తేదీన ఆధ్యాత్మికంగా ప్రార్థనలు చేసి సమీపంలోని పాన్‌షాపులో సిగరెట్ తీసుకుని స్నేహితుడు కలవడంతో అతనితో మాట్లాతున్నాడు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న 10 మంది పోలీసులు తమను చుట్టుముట్టి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించావంటూ తనను నేరస్తుడిలా, ఉగ్రవాదిలా ప్రశ్నలను కురిపించారు. బహిరంగ ప్రదేశంలో సిగరెట్ సేవించావంటూ గత కొంత కాలంగా హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ మధుకర్ స్వామి తనపై వేధింపులకు పాల్పడుతున్నా డని, సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం జరిగేలా చూడాలని బాధితుడు నూర్ కోరాడు.

గొల్లపల్లి భూ దందాపై విజిలెన్స్ ఆరా



మన తెలంగాణ/శంషాబాద్ : అంతర్జాతీయ స్థాయిలో శంషాబాద్‌కు గుర్తింపు రావడంతో ఇక్కడి భూములు బంగారం కంటే విలువైనది. దీంతో రాజకీయ నాయకులు , అధికారుల అక్రమ భూదందా మూడు పువ్వులు ఆరు కాయలుగా విరజిల్లుతుంది అనడానికి గత కొంత కాలంగా వెలుగు చూస్తున్న భూకుంభ కోణాలే నిదర్శనం. నిన్న కొత్వాల్‌గూడ గ్రామంలో ఎలాంటి సంబంధం లేని వ్యక్తిని తీసుకువచ్చి భూ చట్టానికి విరుద్ధంగా 1820ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు రూ.332 కోట్ల బ్యాంక్‌కు టోకరా పెట్టిన మరుసటి రోజే చిన్న గొల్లపల్లి గ్రామ శివారులో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఆనుకొని కోట్ల రూపాయల విలువ చేసే 250ఎకరాల ప్రభుత్వ భూమిలో 10ఎకరాలను ఆక్రమించారు. గొల్లపల్లి గ్రామ రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నెంబరు 1 నుండి 260వరకు మాత్రమే ఉన్నాయి.అయితే కొందరు రాజకీయ భూ బకాసురులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై గొల్లపల్లి గ్రామంలో ఉన్న 10ఎకరాల ప్రభుత్వ భూమికి 261 సర్వేనెంబర్‌ను నూతనంగా సృష్టించి హైదరాబాద్ మలక్‌పేటకు చెందిన బినామీల పేరు(రోషన్ దేవరాజ్)మీదా పాసు బుక్ అండ్ టైటిల్ డిడ్ నెం.586834,పట్టా నెం.359ను కేటాయించారు. ఆ తర్వాత రోషన్ దేవరాజ్ నుండి డాక్యుమెంట్ నెం.3466/2013 ప్రకారం హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ పి.అచ్చేశ్వరికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎకరం భూమి రూ20లక్షలుగా వేసి రిజిస్టర్ చేయించారు.ఈ బాగోతం 2013లో జరిగితే ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోను,తహసీల్దార్ కార్యాలయంలోను గొల్లపల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి ఎంత?, ప్రైవేట్ భూమి ఎంత?గ్రామంలో ఎన్ని సర్వేనెంబర్లు ఉన్నాయి? ఎంత భూమి ఆక్రమణకు గురైంది అనే పలు విషయాలపై అధికారులను ఆరా తీయడంతో పాటు వాటికి సంబంధించిన పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.



విభజన హామీలు పట్టని కేంద్రం

జయప్రకాశ్ నారాయణతో పవన్ కల్యాణ్ భేటీ

హైదరాబాద్ : విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జనసేన చీఫ్, నటుడు పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పవన్ కల్యాణ్ లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణతో భేటీ అయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. విభజన హామీల సాధనపై జయప్రకాశ్‌తో చర్చించినట్టు పవన్ వెల్లడించారు. రాష్ట్ర విభజన సమయంలో జెపి ఎంతో అధ్యయనం చేశారని తెలిపారు. ఏరు దాటాక తెప్ప తగిలేసేలా కేంద్రం వైఖరి ఉందని జయప్రకాశ్ నారాయణ అన్నారు. విభజన సమస్యలపై పవన్‌తో సుధీర్ఘంగా చర్చించినట్టు ఆయన వెల్లడించారు. హీరోగా లక్షలాది మంది అభిమానులు ఉన్న పవన్ కల్యాణ్ కోరి కష్టాలు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు న్యాయం జరిగాలని జయప్రకాశ్ నారాయణ ఆకాంక్షించారు. రెండు తెలుగు రాష్ట్రా ప్రజల మధ్య సామరస్య భావన వెల్లివిరుస్తుందని చెప్పారు. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. విభజన హామీలపై పవన్ చేస్తున్న పోరాటానికి లోక్‌సత్తా మద్దతు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఏపికి న్యాయం జరిగేందుకు అన్ని వర్గాల మేధావులతో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని ఆయన చెప్పారు.

సిరీస్‌ను సమం చేస్తాం: డుమినీ

కేప్‌టౌన్: వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడినా తమ అవకాశాలు ఇంకా సజీవంగా ఉన్నాయని దక్షిణాఫ్రికా స్టార్ డుమినీ అన్నాడు. మిగిలిన మూడు వన్డేల్లో గెలిచి సిరీస్‌ను సమం చేస్తామనే నమ్మకాన్ని డుమినీ వ్యక్తం చేశాడు. వరుసగా మూడు వన్డేలను కోల్పోవడం బాధాకర అంశమేనన్నాడు. కాగా, తమకంటే మెరుగైన ఆటను కనబరిచిన టీమిండియా విజయానికి అన్ని విధాలుగా అర్హురాలని పేర్కొన్నాడు. మూడో వన్డేలో కీలక సమయంలో వికెట్లు కోల్పోవడంతో ఓటమి తప్పలేదన్నాడు. తమకు సిరీస్‌లో ఏదీ కలిసి రావడం లేదన్నాడు. కీలక ఆటగాళ్లందరూ ఒక్కొక్కరే సిరీస్‌కు దూరం కావడం జట్టు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసిందన్నాడు. ఈ సిరీస్‌లో తమకు ఇంకా అవకాశాలు మిగిలేవున్నాయన్నాడు. మిగిలిన మూడు మ్యాచుల్లో గెలిచి సిరీస్‌ను సమం చేయడం తమకు అసాధ్యమేమి కాదన్నాడు. ఈ సత్తా తమ జట్టుకు ఉందన్నాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణిస్తే భారత్‌ను ఓడించడం కష్టమేమి కాదని వివరించాడు. దీని కోసం ప్రత్యేకమైన వ్యూహంతో బరిలోకి దిగాల్సి ఉంటుందన్నాడు. కాగా, సిరీస్‌లో భారత స్పిన్నర్లు చాహల్, కుల్దీప్ చెలరేగి పోతున్న తీరు తనను ఎంతో ఆకట్టుకుందన్నాడు. వీరిద్దరి వల్లే తమకు హ్యాట్రిక్ ఓటములు ఎదురురయ్యాయని డుమినీ అన్నాడు.





కోహ్లి బ్యాటింగ్ అమోఘం

పాక్ దిగ్గజం మియాందాద్

కరాచీ: భారత కెప్టెన్ విరాట్ కోహ్లికి పాకిస్థాన్ బ్యాటింగ్ గ్రేట్ జావేద్ మియాందాద్ ఫిదా అయి పోయాడు. దక్షిణాఫ్రికా సిరీస్‌లో కోహ్లి బ్యాటింగ్‌ను చూసిన మియాందాద్ ప్రశంసల వర్షం కురిపించాడు. సమకాలిన క్రికెట్‌లో కోహ్లిలా బ్యాటింగ్ చేయడం ఎవరికి సాధ్యం కాదన్నాడు. కెప్టెన్‌గా, బ్యాట్స్‌మన్‌గా కోహ్లి కొనసాగిస్తున్న ప్రస్థానం తనను ఎంతో ఆకట్టుకుందన్నాడు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మియాందాద్ భారత సారథిని పొగడ్తలతో ముంచెత్తాడు. కోహ్లి బ్యాటింగ్ తమకాలం నాటి దిగ్గజాలను గుర్తు చేస్తుందన్నాడు. తాము క్రికెట్ ఆడే సమయాల్లో ఎందరో దిగ్గజాలు ఉండేవారన్నాడు. అయితే ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో తమలాగా నిలకడగా బ్యాటింగ్ చేసే వారు అరుదుగా కనిపిస్తున్నారని వివరించాడు. కానీ, కోహ్లి మాత్రం తమను సైతం మించి పోయాడన్నాడు. కోహ్లికి సాటిరాగలే క్రికెటర్ ప్రపంచంలో మరోకరూ వస్తాడని తాను భావించడం లేదన్నాడు. అంతలా కోహ్లి తన జోరును కొనసాగిస్తున్నాడని పాక్ దిగ్గజం మియాందాద్ వ్యాఖ్యానించాడు. ఇక, కెప్టెన్‌గా కోహ్లి చూపించే దూకుడు కూడా తనను ఎంతో ఆకట్టుకుందన్నాడు. జట్టును ముందుండి నడిపించే అతని నాయకత్వ ప్రతిభను చూసి ప్రశంసించని వారుండరని మియాందాద్ అన్నాడు.

తొలి రోజు బౌలర్ల హవా

లంక-బంగ్లా రెండో టెస్టు



ఢాకా: బంగ్లాదేశ్, శ్రీలంక జట్ల మధ్య గురువారం ప్రారంభమైన రెండో టెస్టు తొలి రోజు బౌలర్ల హవా కొనసాగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక 222 పరుగులకే కుప్పకూలింది. తర్వాత బ్యాటింగ్ చేపట్టిన ఆతిథ్య బంగ్లాదేశ్ జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 58 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఓపెనర్లు తమీమ్ ఇక్బాల్ (4), ఇమ్రుల్ కైస్ (19) నిరాశ పరిచారు. ఇక, తొలి టెస్టు రెండు ఇన్నింగ్స్‌లలోనూ శతకాలతో అదరగొట్టిన మోమినుల్ హక్ ఈసారి విఫలమయ్యాడు. అతను ఖాతా తెరవకుండానే రనౌట్‌గా వెనుదిరిగాడు. సీనియర్ ఆటగాడు ముష్ఫికుర్ రహీం కూడా (1) కూడా పెవిలియన్ చేరాడు. దీంతో బంగ్లాదేశ్ 45 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. లంక తొలి ఇన్నింగ్స్ స్కోరును అందుకోవాలంటే బంగ్లా మరో 168 పరుగులు చేయాలి. ప్రత్యర్థి జట్టులో లక్మల్ రెండు, పెరీరా ఒక వికెట్ పడగొట్టారు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన లంక 222 పరుగులకు ఆలౌటైంది. బంగ్లా బౌలర్లు అద్భుత బౌలింగ్‌తో లంకను తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. కాగా, ఓపెనర్ కుశాల్ మెండిస్ (68), రోశన్ సిల్వా (56) అర్ధ సెంచరీలతో లంకను ఆదుకున్నారు. మిగతావారిలో ధనంజయ డిసిల్వా (19), దిల్రువన్ పెరీరా (31), అకిల ధనంజయ (20) కాస్త మెరుగ్గా ఆడారు. బంగ్లా జట్టులో తైజుల్ ఇస్లాం, అబ్దుర్ రజాక్ నాలుగేసి వికెట్లు పడగొట్టారు. ముస్తఫిజుర్ రహ్మాన్‌కు రెండు వికెట్లు లభించాయి.

బుమ్రా బౌలింగ్‌కు రాశీఖన్నా ఫిదా

ముంబయి: దేశంలో క్రికెటర్లు, సినిమా స్టార్లది విడదీయలేని అనుబంధం అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. క్రికెటర్లు అంటే సిని తారలకు, సినిమా స్టార్లు అంటే క్రికెటర్లకు ఎంతో ఇష్టం. ఇలా ఇష్టాలు వివాహాల బంధాలకు వరకు వెళ్లిన ఎన్నో ఉదాహరణలు భారత్‌లో ఉన్నాయి. అలనాటి షర్మిలా ఠాగూర్, మన్సూర్ అలీ ఖాన్ పటౌడి, ప్రస్తుత విరాట్ కోహ్లి, అనుష్క శర్మల ప్రేమాయణాలు దీనికి ప్రత్యేక నిదర్శనలుగా చెప్పుకోవచ్చు. తాజాగా టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రాశీఖన్నా కూడా ఓ యువ క్రికెటర్ బౌలింగ్‌కు ఫిదా అయి పోయింది. టీమిండియాలో ప్రధాన బౌలర్‌గా ఎదిగిన జస్‌ప్రిత్ బుమ్రా బౌలింగ్‌కు రాశీఖన్నా క్లీన్‌బౌల్డ్ అయ్యిందనే చెప్పాలి. బుమ్రా బౌలింగ్ అంటే తనకు ఎంతో ఇష్టమని, అతను ఆడే ప్రతి మ్యాచ్ తప్పక చూస్తానని తెలిపింది. అతని కోసమే తాను మ్యాచ్‌లు చూస్తానని కూడా స్పష్టం చేసింది. తనకు తొలుత క్రికెట్ అంటే అంతా ఇష్టం ఉండేది కాదని, అయితే బుమ్రా బౌలింగ్ చూసిన తర్వాత క్రికెట్‌కు అభిమానిగా మారి పోయానని తెలిపింది. బుమ్రా బరిలోకి దిగాడంటే చాలు ఆ మ్యాచ్ తప్పక చూస్తానని రాశీ వివరించింది.





రన్ మెషిన్.. కోహ్లి

వరుస శతకాలతో చెలరేగుతున్న కోహ్లి



మన తెలంగాణ/ క్రీడా విభాగం: భారత కెప్టెన్ విరాట్ కోహ్లి ఇటీవల ఆకాశమే హద్దుగా చెలరేగి పోతున్నాడు. ఫార్మాట్ ఏదైనా సరే కోహ్లి బ్యాట్ నుంచి పరుగుల వరద ఆగడం లేదు. అది స్వదేశి పిచ్‌లు అయినా సరే విదేశి గ్రౌండ్‌లు అయినా ఒక్కటే. అతను బరిలోకి దిగాడంటే చాలు భారీ స్కోరు నమోదు కావాల్సిందే. ఇలా సాగుతుందో భారత సారథి, రన్ మెషిన్ కోహ్లి పరుగుల ప్రస్థానం. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న సిరీస్‌లో కోహ్లికి ఎదురే లేకుండా పోయింది. ఆడిన మూడు మ్యాచుల్లోనూ అతను చెలరేగి పోయాడు. తొలి వన్డేలో అద్భుత సెంచరీ కొట్టాడు. రెండో వన్డేలో హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. మూడో వన్డేలో మళ్లీ శతకంతో కదం తొక్కాడు. ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్ పరుగులు సాధించేందుకు ఇబ్బంది పడుతున్న మైదానాల్లో కోహ్లి అవలీలగా శతకాలు కొడుతూ తాను ఎంత విలువైన ఆటగాడో ప్రపంచానికి చాటి చెబుతున్నాడు. ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగంగా వన్డేల్లో అత్యంత వేగంగా 34 శతకాలు కొట్టిన క్రికెటర్‌గా కోహ్లి చరిత్ర సృష్టించాడు. తన స్వల్ప కెరీర్‌లోనే ఏకంగా 34 సెంచరీలు సాధించి మాస్టర్ బ్లాస్టర్ సచిన్‌ను సైతం మించి పోయేలా కనిపిస్తున్నాడు. ఇదే జోరును కొనసాగిస్తే రానున్న రెండేళ్లలోనే అతను వన్డేల్లో అత్యధిక శతకాలు సాధించిన క్రికెటర్‌గా చరిత్ర సృష్టించడం ఖాయమని చెప్పొచ్చు. పిచ్ ఎలాంటిదైనా కోహ్లి బ్యాట్‌తో చెలరేగి పోతున్నాడు. ప్రపంచంలోనే అత్యంత భీకర బౌలర్లుగా పేరు తెచ్చుకున్న రబడ, మోర్కెల్, ఫెలూక్‌వాయో, మోరిస్, ఎన్‌గిడి తదితరుల బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ కోహ్లి పారిస్తున్న పరుగుల వరదపై ప్రపంచ వ్యాప్తంగా అభినందనల వర్షం కురుస్తోంది. ఒక వైపు కెప్టెన్‌గా తన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తునే బ్యాట్‌తోనూ జట్టుకు అండగా నిలిస్తున్నాడు. ప్రపంచంలో ఏ కెప్టెన్ కూడా కోహ్లిలా జట్టును ముందుండి నడిపించలేదంటే అతిశయోక్తి కాదనే చెప్పాలి.

ఫార్మాట్ ఏదైనా...

కోహ్లి పరుగుల వరద అన్ని ఫార్మాట్‌లలోనూ కొనసాగుతోంది. ముఖ్యంగా టెస్టుల్లో, వన్డేల్లో అతనికి ఎదురు లేకుండా పోయిందని చెప్పాలి. ఏడాది కాలంగా అతని బ్యాట్ నుంచి పరుగులు ఏరులై పారుతున్నాయి. ప్రతి సిరీస్‌లోనూ అతను వరుస సెంచరీలతో చెలరేగి పోతున్నాడు. దాదాపు ఏడాది కాలంగా కోహ్లి భీకర ఫాంలో కొనసాగుతున్నాడు. 2016 విండీస్ సిరీస్ నుంచి కోహ్లి జోరు ప్రారంభమైంది. అప్పటి నుంచి కోహ్లికి టెస్టుల్లో, వన్డేల్లో ఎదురు లేకుండా పోయింది. టెస్టుల్లో అయితే వరుస డబుల్స్ సెంచరీలతో ప్రకంపనలు సృష్టించాడు. విండీస్ సిరీస్ నుంచి కోహ్లి టెస్టుల్లో ఏకంగా పది సెంచరీలు నమోదు చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఏ క్రికెటర్ కూడా ఇంత స్వల్ప వ్యవధిలో ఇన్ని శతకాలు కొట్టలేదు.

అంతేగాక ఈ శతకాల్లో ఆరు డబుల్ సెంచరీలు ఉండడం విశేషం. దీన్ని బట్టి విరాట్ కోహ్లి జోరు ఎలా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్‌లలో నాలుగు సెంచరీలు కొట్టి ప్రకంపనలు సృష్టించాడు. ఇందులో రెండు డబుల్ సెంచరీలు కూడా ఉన్నాయి. మరో వైపు వన్డేల్లో కూడా కోహ్లికి ఎదురు లేకుండా పోయింది. గత ఏడాది కాలంగా అతను వన్డేల్లోనూ 13 శతకాలు కొట్టి తనెంతా ప్రమాదకర బ్యాట్స్‌మన్ అనే విషయాన్ని ప్రత్యర్థి బౌలర్లకు రుచి చూపించాడు. 2017లో ఏకంగా ఆరు సెంచరీలు సాధించాడు. ఈ ఏడాది ఇప్పటికే రెండు శతకాలు కొట్టి సత్తా చాటాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన మూడు వన్డేల్లోనే రెండు సెంచరీలు కొట్టి ప్రకంపనలు సృష్టించాడు. కాగా, ప్రపంచ వన్డే క్రికెట్‌లోనే అత్యంత వేగంగా 34 శతకాలు సృష్టించిన క్రికెటర్‌గా కోహ్లి నిలిచాడు. కోహ్లి కేవలం 205 వన్డేల్లోనే 34 శతకాలు సాధించి అరుదైన రికార్డు నెలకొల్పాడు. కాగా, కోహ్లి కంటే ప్రస్తుతం సచిన్ మాత్రమే అత్యధిక శతకాలు సాధించిన క్రికెటర్‌గా ఉన్నాడు. సచిన్ 463 వన్డేల్లో 49 శతకాలు సాధించి తొలి స్థానంలో నిలిచాడు. కోహ్లి ఇప్పటికే 34 వన్డే సెంచరీలు సాధించి సచిన్ రికార్డు వైపు అడుగులు వేస్తున్నాడు. టెస్టుల్లో కూడా కోహ్లి 21 శతకాలు కొట్టాడు. వన్డేల్లో మరో 15 శతకాలు సాధిస్తే సచిన్ రికార్డు బద్దలు కావడం ఖాయం. కోహ్లి జోరును చూస్తుంటే అతను సచిన్‌ను దాటి పోవడం కష్టం కాదని చెప్పవచ్చు. ఇక, సమకాలిన క్రికెట్‌లో కోహ్లికి దక్షిణాఫ్రికా క్రికెటర్లు డికాక్, ఆమ్లా, డివిలియర్స్‌తో కాస్త పోటీ ఉంది. కాగా, కోహ్లితో పోల్చితే ఆమ్లా, డివిలియర్స్‌లు ఎక్కువ కాలం అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగడం కష్టమే. దీంతో డికాక్ తప్ప వేరే ఎవరి నుంచి కోహ్లికి పోటీ లేదని చెప్పాలి. కానీ డికాక్‌తో పోల్చితే కోహ్లి చాలా మెరుగైన ఆటగాడు, పైగా కెప్టెన్ కూడా కావడంతో సచిన్ రికార్డును బద్దలు కొట్టే ఛాన్స్ అతనికే ఉందని చెప్పక తప్పదు.

క్వార్టర్స్‌లో భారత జట్లు

ఆసియా బ్యాడ్మింటన్

అలోర్ సేటర్: ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషులు, మహిళల జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయి. గురువారం జరిగిన మహిళా టీమ్ విభాగం పోటీల్లో భారత్ 1-4 తేడాతో జపాన్ చేతిలో పరాజయం పాలైంది. అయితే జపాన్ చేతిలో ఓటమి పాలైనా భారత మహిళా జట్టు క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. తొలి మ్యాచ్‌లో హాంకాంగ్‌ను ఓడించడంతో భారత్‌కు క్వార్టర్ ఫైనల్ బెర్త్ దక్కింది. పురుషుల విభాగంలో కూడా భారత్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. ఫిలిప్పీన్స్, మాల్దీవ్స్ జట్లపై క్లీన్‌స్వీప్ సాధించిన భారత్ క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను సొంతం చేసుకుంది. కాగా, జపాన్‌తో జరిగిన మహిళల టీమ్ చాంపియన్‌షిప్ పోటీల్లో సింధు ఒక్కటే విజయం సాధించింది. జపాన్ స్టార్ అకానె యమగూచితో జరిగిన పోరులో సింధు విజయం సాధించింది. రెండు సెట్ల సమరంలో సింధు 21-19, 21-15 తేడాతో యమగూచిను ఓడించింది. కాగా, ఇతర పోటీల్లో భారత్‌కు పరాజయం ఎదురైంది. ఇతర సింగిల్స్‌లో కృష్ణ ప్రియా, అశ్విని పొన్నప్పలు ఓటమి పాలయ్యారు. డబుల్స్‌లో కూడా భారత జోడీలు పరాజయం పాలయ్యాయి. దీంతో జపాన్ 4-1తో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.



తెలంగాణకు పతకాల పంట

మన తెలంగాణ/ హైదరాబాద్: ఖేలో ఇండియా నేషనల్ స్కూల్ గేమ్స్ పేరిట దేశ రాజధాని న్యూఢిల్లీలో జరుగుతున్న క్రీడా పోటీల్లో తెలంగాణకు మూడు స్వర్ణాలు లభించాయి. వెయిట్ లిఫ్టింగ్‌లో రెండు, బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో ఒక స్వర్ణాన్ని తెలంగాణ క్రీడాకారులు సొంతం చేసుకున్నారు. 85 కిలోల బాలుర వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో సి.హెచ్.కార్తీక్ స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. అదే విధంగా 69 కిలోల విభాగంలో రాష్ట్రానికే చెందిన శివలింగేశ్వరకు పసిడి పతకం లభించింది. మరోవైపు బాలుర బ్యాడ్మింటన్స్‌లో కూడా తెలంగాణకు స్వర్ణం దక్కింది. విష్ణువర్ధన్-నవనీత్ జంట డబుల్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి తెలంగాణకు స్వర్ణం అందించారు. ఇక, అథ్లెటిక్స్‌లో తెలంగాణకు రజతం దక్కింది. 400 మీటర్ల పరుగులో శ్రీకాంత్ రజతం సాధించాడు. అదే విధంగా బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో సాయిచంద్‌కు కాంస్యం లభించింది. కాగా, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి విజేతలను అభినందించారు. క్రీడలకు ఆతిథ్యం అందిస్తున్న ఇందిరా గాంధీ స్టేడియాన్ని గురువారం చైర్మన్ సందర్శించి తెలంగాణ ఆటగాళ్లను ప్రోత్సహించారు.



హైదరాబాద్ చిత్తు

• విజయ్ హజారే ట్రోఫీ

మన తెలంగాణ/ హైదరాబాద్: విజయ హజారె ట్రోఫీలో భాగంగా గురువారం ఉప్పల్‌లో జరిగిన మూడో వన్డేలో హైదరాబాద్ 237 పరుగుల భారీ తేడాతో విదర్భ చేతిలో చిత్తయ్యింది. ముందుగా బ్యాటింగ్ చేసిన విదర్భ నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 350 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ కేవలం 113 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయం చవిచూసింది. తొలి రెండు వన్డేల్లో ఘన విజయం సాధించిన హైదరాబాద్‌కు ఇదే మొదటి ఓటమి కావడం విశేషం. భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్‌కు ప్రత్యర్థి బౌలర్లు ప్రారంభం నుంచే హడలెత్తించారు. ఓపెనర్లు రోహిత్ రాయుడు (3), అక్షత్ రెడ్డి (6)లు ప్రారంభంలోనే పెవిలియన్ చేరారు. సందీప్ (7) కూడా నిరాశ పరిచాడు. కెప్టెన్ అంబటి రాయుడు (21) కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలువలేక పోయాడు. విదర్భ బౌలర్లు వరుస క్రమంలో వికెట్లు తీస్తూ ఏ దశలోనూ హైదరాబాద్‌ను కోలుకోనివ్వలేదు. వికెట్ కీపర్ సుమంత్ (29) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ప్రత్యర్థి జట్టులో కర్ణ్ శర్మ మూడు, శ్రీకాంత్ రెండు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన విదర్భను కెప్టెన్ ఫైజ్ ఫజల్ అద్భు/త సెంచరీతో ఆదుకున్నాడు. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన జల్ 9 ఫోర్లు, మూడు సిక్సర్లతో 103 పరుగులు చేశాడు. మరోవైపు ధాటిగా ఆడిన రవి ఆరు ఫోర్లు, మూడు సిక్సర్లతో 62 బంతుల్లోనే 81 పరుగులు సాధించాడు. అపూర్వ్ వాంఖడే ఐదు సిక్సర్లు, మూడు ఫోర్లతో43 బంతుల్లోనే 66 పరుగులు చేశాడు. దీంతో విదర్భ స్కోరు 350కి చేరింది.



జార్ఖండ్ గెలుపు

సర్వీసెస్‌తో జరిగిన మరో మ్యాచ్‌లో జార్ఖండ్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఏఓసి గ్రౌండ్‌లో గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సర్వీసెస్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. హార్దిక్ రాజీవ్ సేథి (66), దివేశ్ (43) తప్ప మిగతావారు విఫలమయ్యారు. దీంతో జట్టు తక్కువ స్కోరుకే పరిమితమైంది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన జార్ఖండ్ 30.5 ఓవర్లలోనే కేవలం ఐదు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. కెప్టెన్ ఇషాన్ కిషన్ అద్భుత సెంచరీతో జట్టును గెలిపించాడు. విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన ఇషాన్ కిషన్ 75 బంతుల్లోనే 4ఫోర్లు, 13 ఫోర్లతో 106 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. సీనియర్ ఆటగాడు సౌరభ్ తివారి ఆరు ఫోర్లు, ఒక సిక్స్‌తో అజేయంగా 56 పరుగులు చేశాడు. దీంతో జార్ఖండ్ ఘన విజయం అందుకుంది.

జమ్మూ జయకేతనం

జింఖానా గ్రౌండ్‌లో సౌరాష్ట్రతో జరిగిన మరో మ్యాచ్‌లో జమ్మూకశ్మీర్ ఆరు వికెట్ల తేడాతో జయకేతనం ఎగుర వేసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన సౌరాష్ట్ర 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 267 పరుగులు చేసింది. ఒక దశలో 135 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన సౌరాష్ట్రను అర్పిత్ వస్వదా, ప్రేరక్ మన్కడ్ ఆదుకున్నారు. చెలరేగి ఆడిన అర్పిత్ ఆరు సిక్సర్లు, మరో ఫోర్‌తో 85 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ప్రేరక్ రెండు సిక్స్‌లు, మరో ఐదు ఫోర్లతో వేగంగా 67 పరుగులు సాధించాడు. దీంతో సౌరాష్ట్ర గౌరవప్రద స్కోరును సాధించింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన జమ్మూ 48 ఓవర్లలోనే కేవలం నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. టాప్ ఆర్డర్ రాణించడంతో జమ్మూ సునాయాస విజయాన్ని అందుకుంది. ఓపెనర్లు అహ్మద్ (65), జతిన్ వధ్వాన్ (30) తొలి వికెట్‌కు 96 పరుగులు జోడించి శుభారంభం అందించారు. కెప్టెన్ పర్వేజ్ రసూల్ మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో 67 పరుగులు చేసి జట్టు విజయంలో తన వంతు పాత్ర పోషించాడు. శుభం ఏడు ఫోర్లతో 55 పరుగులు చేశాడు. వికెట్ కీపర్ ఇయాన్ దేవ్ సింగ్ 17 పరుగులతో అజేయంగా నిలిచాడు. దీంతో జమ్మూ అద్భుత విజయాన్ని అందుకుంది.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.